# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 4

## పౌరాణిక నాటకాలు - భాగం -1

రావాసిష్ఠం, చిత్రకళాప్రదర్శన, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు,
వేదవ్యాసుడు, జగత్ సత్యం బ్రహ్మ మిథ్య


ప్రధాన సంపాదకులు
ఆచార్య కె. యాదగిరి

సంపాదకులు
ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)

సహాయ సంపాదకులు
శ్రీమతి బోయి విజయేందిర
శ్రీ గనుమల జ్ఞానేశ్వర్



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం
సంపుటి-4, పౌరాణిక నాటకాలు-భాగం-1
**Boyi Bhimanna Samagra Sahityam -Vol-4, Pouranika Natakalu Part -1**
Padmabhushan Dr. Boyi Bhimanna - Sahitya Peetham
Potti Sree Ramulu Telugu University
Hyderabad

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - **500 004**

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ప్రథమ ముద్రణ : సెప్టెంబర్, **2011**
ప్రతులు : **1000**
వెల: రూ॥ **160/-**
ISBN NO: 81-86073-204-0

ప్రతులకు:
రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004

ముద్రణ: నవ్య ప్రింటర్స్
సోమాజిగూడ, హైదరాబాద్

Grams: "TELVERS"

Phone: Off: 040-23234815
Tele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య కె. యాదగిరి
ఉపాధ్యక్షులు ఐ/సి

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డన్స్,
హైదరాబాద్ - 500 004

## డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం – కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిగారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమ వంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచనకవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.

6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.
9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలను రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువాదం చేసేనిమిత్తం. ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి పూర్తిచేయటం జరిగింది. వీటిని త్వరలో ముద్రించడం జరుగుతుంది.

గడచిన మూడు సంవత్సరాలలో భీమన్న సమగ్ర సాహిత్యం పేరిట భీమన్న గేయ కావ్యాలు భాగం1, 2, భీమన్న పద్యకావ్యాలు భాగం 1 భీమన్న నాటకాలు 2, భీమన్న పీఠికలు భాగం 1,2, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న గ్రంథాలను ప్రచురించి విడుదల చేయడం జరిగింది. ఇది బోయి భీమన్న శతజయంతి సంవత్సరం. ఈ సందర్భంగా గత ఏడాది భీమన్న వచన కవితలు భాగం 1,2,3. భీమన్న వచన గ్రంథాలు 1,2 గ్రంథాలను ప్రచురించడం జరిగింది.

భీమన్నగారి నాటకాలను సేకరించి రెండు సంపుటాలుగా ముద్రించతలపెట్టాము. డా॥ బోయి భీమన్న గారి సాంఘిక నాటకాలను ఇదివరకే ప్రచురించడం జరిగింది. ఇది పౌరాణిక నాటకాల సంపుటి, ఇందులో రాగవాసిష్ఠం, చిత్రకళా ప్రదర్శన, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు, జగత్ సత్యం – బ్రహ్మమిథ్య అనే నాటకాలున్నాయి. పురాణ ప్రసిద్ధమైన అరుంధతి వసిష్ఠుల ప్రణయ వృత్తాంతం రాగవాసిష్ఠం, సాంఘికేతి

వృత్తమైన బాలయోగి నాటకాన్ని మినహాయిస్తే మిగిలిన నాటకాలన్నీ పౌరాణికాలే. భారతీయ పురాణ విజ్ఞానం పట్ల భీమన్న గారికి ఎంతకంఠదఘ్నమైన అభిరుచి అభినివేశం ఉన్నాయో ఈ నాటకాలు నిరూపిస్తాయి. భీమన్నగారి వేళ్లు (రూట్స్) అంత సంప్రదాయ నిమగ్నతలో ఉండబట్టే ఆయన రచనలకు అంత విలువ ప్రతిష్ఠ.

తెలుగు వారి భాషా, సాహిత్యం సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ (2008) హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షురాలు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, ఇతర సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

కె. యాదగిరి

తేది: 2-9-2011

హైదరాబాద్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ఆచార్య కె. సంజీవరావు (శిఖామణి)
కన్వీనర్

---

# విశిష్ట నాటక శిల్పి బోయి భీమన్న

ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించి విజయం సాధించిన కవులలో పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న ప్రథమ పంక్తిలోని వారు. వారి చేతిలో సాంఘిక నాటక ప్రక్రియ శక్తివంతమైన ఆయుధంగా రూపొందింది. వారి ప్రసిద్ధ నాటకం పాలేరు ఇటు ముద్రణా పరంగాను అటు ప్రదర్శనా పరంగానూ తెలుగు నాటకం అంతకు ముందు అధిరోహించని సమున్నత శిఖరాలను అధిరోహించింది. ఒక రచనకు గల సాంఘిక ప్రయోజనాన్ని ఆ రచయిత జీవిత కాలంలో సజీవ సాక్ష్యంగా నిరూపించిన నాటకం పాలేరు. ఆ నాటక ప్రదర్శనను చూసి అనేక దళిత యువకులు తాము చేస్తున్న పాలేరు తనాన్ని వదిలి విద్యావంతులై తదనంతర కాలంలో ఉన్నత అధికారులైన చరిత్ర తెలుగు సమాజంలో నమోదై ఉంది. పాలేరు నాటకం దళితుల అభివృద్ధికి విద్యా సముపార్జన ఏకైక మార్గమనీ, వర్ణాంతర వివాహాల వల్ల కుల సమస్య కొంతవరకైనా అంతరిస్తుందన్న అంబేద్కర్ ఆలోచనా విధానానికి అక్షర రూపం కూలిరాజు నాటకం దళితుల రాజ్యాధికార కలలకు సాకారరూపం ఇచ్చిన రచన. సాంఘిక నాటకాలే గాక పౌరాణిక ఇతివృత్తాలను తీసుకొని దానికి సాంఘిక దృక్పథం జోడించిన ప్రయోగవాద నాటక రచయిత భీమన్న. భీమన్న నాటకాలను రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్న పీఠం గతంలో భీమన్న సాంఘిక నాటకాలను ఒక సంపుటిగా తెచ్చింది.

ప్రస్తుతం భీమన్న శతజయంతి ముగింపు మహోత్సవాల సందర్భంగా భీమన్న పౌరాణిక నాటకాలను మరో సంపుటిగా తీసుకువస్తున్నది. ఇందులో రాగవాసిష్ఠం, చిత్రకళా ప్రదర్శన, బాలయోగి, ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు, జగత్ సత్యం బ్రహ్మ మిథ్య నాటకాలు ఉన్నాయి. ఇందులో చిత్రకళా ప్రదర్శన, బాలయోగి, జగత్ సత్యం బ్రహ్మ మిథ్య, నాటకాలు సాంఘికేతివృత్తాలుకాగా, మిగిలిన నాటకాలు పురాణేతివృత్తాలు.

రాగవాసిష్ఠం: భీమన్న విద్యార్థి దశలో ఉండగారాసిన రచనల్లో అరుంధతీ కళ్యాణం నాటకం ఒకటి. తర్వాతి రోజులో అది మార్పులకు చేర్పులకు గురై రాగవాసిష్ఠంగా రూపుదిద్దుకొంది. 1941లో భీమన్నగారు రాజోలలు హైస్కూలులో టీచర్‌గా ఉన్నప్పుడు హాస్టల్ విద్యార్థులచే ఈ నాటకం ప్రదర్శింపబడింది. 1958లో హరిజనసేవా సంఘంవారి మహాసభల్లో భీమన్న చేసిన హరిజనులు

ఆర్యులే అన్న ప్రసంగాన్ని విన్న ఐ.పి.ఎస్. అధికారి సాక పేములుగారు దాన్ని ముద్రించమనికోరగా 1949 లో రాగవాసిష్ఠం నాటకం ముందుమాటగా ఆ ప్రసంగవ్యాసం ముద్రించబడింది. మంగిపూడి వేంకటశర్మగారి నిరుద్ధభారతం కావ్యం చదివిన ప్రేరణతో భీమన్నగారు రాగవాసిష్ఠనాటకం రాసినట్టు పీఠికలో చెప్పుకున్నారు. హైందవ సామాజిక వ్యవస్థలో బ్రహ్మర్షి వసిష్ఠుడు ఒక కొస, మాతంగ కన్య అరుంధతి రెండవ కొస. ఈ రెండుకొసలూ కలిపి ఆర్థధార్మిక చక్రాన్ని పరిపూర్ణంచేసినై అన్న భీమన్న వ్యాఖ్యలకు అక్షర రూపం ఈ నాటకం. ఇప్పటికి అయిదు పునర్ముద్రణలు పొందిన ఈ నాటకం 1961–70 సంవత్సరాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డిగ్రీకోర్సులను పాఠ్యాంశంగా ఉంది.

చిత్రకళా ప్రదర్శన: డా॥ బోయి భీమన్న గారు 1960లో స్థాపించిన సుఖేలా నికేతన్ సంస్థ సాహిత్యానికే కాక లలిత కళలకు పెద్ద పీట వేసింది. భీమన్నగారి పైరుపాట, రవీంద్రనాథ్ ఠాగూర్ చండాలికవంటి నృత్య సంగీత రూపకాలను విజయవంతంగా ప్రదర్శించింది. ఈ సంపుటిలో మొత్తం పది నాటకాలున్నాయి. ఇందులో దేవయాని కథ మహాభారతం నుండి, చండాలిక రవీంద్రుని రచనల నుండి స్వీకరించబడినవి. అంధకారంపై విజయం నాటిక వెనక నరకాసుర వధ వంటి పౌరాణిక కావ్యస్ఫూర్తి ఉన్నా భారత్ దురాక్రమణను దృష్టిలో పెట్టుకుని రాసిన నాటిక. ఇవన్నీ నృత్యసంగీత రూపకాలుగా రంగస్థలంపై ప్రదర్శనానుకూలతను దృష్టిలో పెట్టుకుని రచించబడినవే. ఈ నాటికలు భీమన్న గారికి సంగీత అభినయాలపై ఉన్న సాధికారతను, మక్కువను తెలియజేస్తాయి.

బాలయోగి: తూర్పు గోదావరిజిల్లా ముమ్మిడివరంలో వెలసిన శ్రీ బాలయోగీశ్వరుల జీవిత వృత్తాంతాన్ని ఏడంకాల నాటకంగా తీర్చిదిద్దారు భీమన్న. కటిక దల గంగయ్య రామమ్మ దంపతులకు 1930 అక్టోబరు 30న జన్మించిన సుబ్బారావు తన పదహారో ఏట 1946లో తపోదీక్ష ప్రారంభించారు. 1949 నుండి శివరాత్రి రోజు భక్తులకు దర్శనం ఇచ్చేవారు. 40 సంత్సరాల పాటు నిరాహారిగా కఠోర తపోధ్యానంలో ఉన్న బాలయోగి 1985 జులై 30న మహానిర్యాణం పొందారు. బాలయోగి ఈ కాలానికే ఒక భగవత్ ప్రతీక. శివసాక్షాత్కృతి అని భావించి బోయి భీమన్నగారు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ నాటకాన్ని రచించారు.

ఆదికవి వాల్మీకి: స్వర్గంలో అప్సరసల దర్శనం వల్ల బ్రహ్మమనస్సు వికలమై అందుండి వాల్మీకి పుట్టాడనీ, అన్యాయంగా బ్రహ్మచే పించబడి చండాలుడై నాడనీ, తర్వాత అటవికులలో కలిసాడనీ పురాణ గాథ. ఈ పురాణ గాథనే నాటక రచనకు పునాదిగా స్వీకరించారు భీమన్న. హరిజనులు ఆర్యులే అనే తన సిద్ధాంతాన్ని బలపరచడానికే ఆదికవి వాల్మీకి నాటకాన్ని రాసినట్టుగా పీఠికలో చెప్పుకున్నారు. మన ఆర్యమహర్షుల పుట్టుపూర్వోత్తరాలను ఈ విధంగా నేను ఎత్తి చూపడానికి కారణం నేటి హిందూ సమాజం నుండి కులమతాన్ని నిర్మూలించాలన్న నా ఆకాంక్షే అని నాటక రచనోద్దేశాన్ని రచయిత వివరించారు.

ధర్మవ్యాధుడు: తను హైస్కూలు విద్యార్థిగా ఉండగా తెలుగు వాచకంలోని ధర్మవ్యాధుని వృత్తాంతం వున్న కొంగ – కౌశికుడు పాఠాన్ని చదువుకున్న భీమన్న చిన్న నాటి నుండి ధర్మవ్యాధుని

కథపట్ల ఆసక్తిని పెంచుకుంటూ వచ్చారు. ఆ తర్వాత కాలంలో వరాహ పురాణాన్ని విమర్శనాత్మక దృష్టితో చదివి భారత జాతి పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకున్నారు. 1960 ప్రాంతంలో ధర్మవ్యాధుడు నాటకాన్ని రాసారు. మాంసం విక్రయం వృత్తిగా గల ఒక కిరాతడు శాస్త్రజ్ఞుడు, ధర్మజ్ఞుడు, దైవజ్ఞుడు, బ్రహ్మజ్ఞానుడుగా అయిన విధానాన్ని ఈ నాటకం అక్షరీకరించింది. నేను రోజుకు ఒక జీవిని చంపి అతిథులకు పెట్టి, పురవాసులకు పంచి, మిగిలింది నేను తింటాను. మీరు రోజు ఇన్ని వేల జీవుల్ని (బియ్యం లేదా గోధుమలు) ఉడకబెట్టి చంపి తింటున్నారు. అని మతంగున్ని ప్రశ్నించిన ధర్మవ్యాధుడి ప్రశ్న ఆలోచనీయమే!

వేదవ్యాసుడు: వ్యాసమహర్షి భారతజాతికి పంచమవేదం అనదగిన మహాభారత ఇతిహాస వాక్యాన్ని అందించిన వాడు. వేద విభజన చేసి పురాణాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను వింగడించినవాడు. జాతికి పారాయణమైన భగవద్గీతను అందించిన వాడు. అటువంటి వేదవ్యాసుని జీవితంలోని మూడు ముఖ్య ఘట్టాలను ఈ నాటకం చిత్రించింది. వేదవ్యాసుడి పుట్టుక, భారత రాజవంశ పునరుద్ధరణ, వేద విభజన, పురాణ రచన, శ్రీ మహాభారత రచన, శ్రీ శుకుడిపుట్టుక వంటి ఆసక్తికర అంశాలు ఈ నాటకంలో ఉన్నాయి. కథా సందర్భాలను అనుసంధిస్తూ మధ్య మధ్య ప్రయోక్తను ప్రవేశపెట్టా కథాను సంధానం చేయడం జరిగింది.

జగత్ సత్యం – బ్రహ్మమిథ్య: ఒకసభలో భీమన్నగారు జగత్సత్యం-బ్రహ్మమిథ్య అని అన్నారని అది విని బ్రహ్మ, సరస్వతి వచ్చి కవిగారితో వాదానికి దిగడం ఈ నాటకం ఇతివృత్తం. ఇది దృ శ్యకావ్యం ఇందులో కొన్ని చిలిపి ఊహలు, విచిత్రమైన భావాలు ఉన్నాయి. బ్రహ్మచేస్తున్న నాలుగుముఖాల, నాలుగు రకాల సృష్టిని రచయిత నిరాకరించారు.

ఈ నాటకాలన్నీ భీమన్నగారికి పురాణ విజ్ఞానం పట్ల గల అనురక్తినీ తెలియచేయడమే గాక, భారత పురాణ పురుషులందరూ అంటరాని కులాలనుండి వచ్చిన వారేనని, వారే ఈ దేశానికి సంస్కృతిని సాహిత్యాన్ని అందించిన మూలపురుషులనీ ఈ నాటకాల ద్వారా నిరూపించదలిచారు భీమన్న.

బోయి భీమన్న గారి మొత్తం రచనలను సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతి భీమన్న గారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్న గారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్ గార్లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటిని గ్రంథముద్రణకు వీలుగా శుద్ధ ప్రతిని తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి, సహకరించిన డా॥ ఎమ్. కనకదుర్గ గారికి, డా॥ ఎ. పార్వతి గారికి, శ్రీమతి సి. పుష్పలత గారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన నవ్యప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు.

తేది: 10-8-2011

హైదరాబాద్

కె. సంజీవరావు

# విషయ సూచిక


| | |
|---|---|
| 1. రాగవాసిష్ఠం | 1-114 |
| 2. చిత్రకళా ప్రదర్శన | 115-255 |
| 3. బాలయోగి | 257-317 |
| 4. ఆదికవి వాల్మీకి | 319-386 |
| 5. ధర్మవ్యాధుడు | 387-486 |
| 6. వేద వ్యాసుడు | 487-591 |
| 7. జగత్ సత్యం బ్రహ్మ మిథ్య | 593-632 |

# రాగవాసిష్ఠం

(అరుంధతీ కల్యాణం)

నాటకం

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ: 1959
రెండవ ముద్రణ: 1964
మూడవ ముద్రణ: 1967
నాలుగవ ముద్రణ: 1970
అయిదవ ముద్రణ: 1993

1961-70 ల మధ్య
ఉస్మానియాలో బి.ఏ., బి ఎస్సీ., బి. కాం లకు
పాఠ్యగ్రంథంగా నిర్ణయించబడినట్టిది.

హక్కులు : రచయితవి

వెల: 25/-

ప్రతులకు
భీమన్న సాహితీ నిధి,
ఐ.సి. 85, ఇరం మంజిల్ కాలనీ,
హైదరాబాదు-4

విశాలాంధ్ర పబ్లికేషన్స్
విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్
అబిడ్స్, హైదరాబాద్

ముద్రణ
పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్
1-1-517/బి/1, న్యూ బాకారం
హైదరాబాద్ - 380

## ఈ నాటకం బయోడేటా

అరుంధతిని గురించిన రకరకాల కథలు నా చిన్నప్పుడే విన్నాను. మొత్తం మానవ చరిత్రలోనే అతి గొప్ప మహిళ అరుంధతి. అంతటి మహితాత్మ మా ఇంటి ఆడపడుచు అయి వున్నందుకు గర్వపడ్డాను.

అరుంధతిని గురించి ఏదో వ్రాయాలనుకుంటూ ఉండేవాణ్ణి. పద్యాలూ, పాటలూ వ్రాస్తూ, చింపేస్తూ వుండేవాడిని. చివరకు అరుంధతీ కల్యాణం నాటకంగా వ్రాయాలనే సంకల్పం నేను కాలేజీలో చేరినప్పుడు, 1931లో కలిగింది. ఆమె గురించిన సాహిత్యం ఎక్కడ కనిపించినా చదువుతూ, వివిధ ఉదంతాలను సమన్వయపరచుకుంటూ ఒక కథ తయారు చేసుకుని నాటకంగా వ్రాశాను.

నా రచనలలో అత్యధిక భాగం నా విద్యార్థి దశలో వ్రాసినవే. నచ్చని వాటిని చింపి పారవేసినా, నచ్చిన వాటిని అలా వుంచేసుకుంటూ వచ్చాను. తోచినప్పుడెల్లా ఒక్కొక్క రచనను తీసి అప్పటి మనస్తత్వాన్ని బట్టి మార్పులూ, చేర్పులూ చేసుకొంటూ వచ్చాను. వాటిలో ఈ అరుంధతీ కల్యాణం ఒకటి.

1941లో, నేను రాజోలు హైస్కూలులో టీచరుగా వున్నప్పుడు, అక్కడి గొల్ల చంద్రయ్య గారి హాస్టలు విద్యార్థుల చేత ఈ నాటకాన్ని ప్రదర్శింప చేసి ప్రశంసలు అందుకొన్నాను.

తరువాత 1951 ప్రాంతంలో నేను మద్రాసులో ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో వున్నప్పుడు, దీని వ్రాత ప్రతిని ఎడిటరు నార్ల వెంకటేశ్వర రావు గారికి ఇచ్చాను. నా ఉద్దేశం ఆయనకు నచ్చితే ఆంధ్రప్రభలో సీరియలుగా ప్రకటించ వచ్చునని. అయితే రెండు రోజుల తర్వాత ఆయన వ్రాత ప్రతిని తిరిగి ఇచ్చి వేశారు. రచన బాగున్నదనీ, కానీ భావాలలో కాంప్రమైజింగ్ వైఖరి మంచిది కాదనీ, ఒక హరిజనుడి కలం నుంచి వెలువడే రచన ఏదైనా నరికిన ట్లుండాలనీ అని, గ్రంథం ప్రింటయిన తరువాత తనకొక ప్రతిని ఇమ్మన్నారు.

నార్ల వారి గది నుంచి నేను బయటికి రాగానే, ఫలితం కోసం ఎదురు చూస్తున్న సహచర మిత్రులు, ముఖ్యంగా తిరుమల రామచంద్ర గారు, నా ముఖం కేసి ప్రశ్నార్థకాలు విసిరినప్పుడు, "నరికిన ట్టుండా లని అన్నారు" అని జవాబిచ్చాను.

"ఎవరిని?" అన్నా రెవరో. నవ్వుకొన్నాం.

ఇలాంటి సందర్భాలు అంతకు ముందు, ఆ తరువాత కూడా ఏర్పడి వున్నాయి. ఎవర్ని నరకాలో నా కర్థం కాకనే ఆర్యద్రావిడులు, దేవ దానవులు, సురులు అసురులు, అవర్ణులు, సవర్ణులు - ఇలాంటి వైర సమాజాలన్నీ జాతిపరంగా వేరు వేరు కాదనీ, అందరూ రక్త సంబంధీకులేననీ, ఒకరినొకరు నరుక్కోవలసిన అవసరం లేదనీ, కలిసి బ్రతకవచ్చుననీ నేను నా రచనలో సమయం దొరికినప్పుడెల్లా ప్రబోధించుకుంటూ వస్తున్నాను. నా సమన్వయ ధోరణిని, కాంప్రమైజింగ్ వైఖరిని నేను స్థిత ప్రజ్ఞతతో నమ్మిన వాణ్ణి. ఎంత ఒత్తిడి కింద కూడా మార్చుకోదలిచిన వాణ్ణి కాదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, మేము హైదరాబాదుకు చేరుకున్న తరువాత, మంత్రి దామోదరం సంజీవయ్య గారితో సాహిత్యపరంగానూ, సంఘ సేవా పరంగానూ నేను చాలా సన్నిహితంగా వుండే వాణ్ణి. తరచు ఆయన అధికార పర్యటనలలో నేను కూడా వెళ్ళి సభలలో ప్రసంగించేవాణ్ణి. నా ప్రసంగాల లోని వస్తువు సాధారణంగా అరుంధతి చుట్టూ తిరుగుతూ వుండేది. హరిజనుల పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రాచీన సాహిత్య ఆశ్రమాలలో నేను జరిపిన పరిశోధనలకు సంబంధించి వుండేది. స్పృశ్య కులాలు, అస్పృశ్య కులాలు కూడా ఒకే రక్త సంబంధ జాతికి చెందిన వాళ్ళనే నా సిద్ధాంతాన్ని బలవత్తరం చేసేదిగా వుండేది.

బహుశా 1958లో అనుకుంటాను, హరిజన సేవా సంఘ రాష్ట్ర సభలు నెల్లూరులో జరిగినప్పుడు సంజీవయ్య గారు, నేను ఆయన కారులో బయలుదేరి, దారి పొడుగునా సంగీత, సాహిత్య సమారాధన జరుపుకొంటూ నెల్లూరు వెళ్ళాం. ఆ సభలలో నా ప్రసంగం చాలా మంది పెద్దలను ఆకర్షించింది. సంజీవయ్యగారు, వేముల కూర్మయ్య గారు, చెరకువాడ నరసింహం గారు వంటి ప్రముఖులు ఆ నా ప్రసంగాన్ని గ్రంథ రూపంలో వెలువరించ వలసిందిగా గట్టిగాకోరడం జరిగింది.

ఆ తరువాత దాని గురించి ఎవరూ అంతగా పట్టించుకోక పోయినా మిత్రులు సాక పేములు గారు నన్ను వదిలి పెట్టలేదు.

"వ్రాయడం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి భావాలే వున్న నా రచనలు చాలానే వున్నై ప్రింటు కాకుండా" అని నే నన్నప్పుడు, "నేను ప్రింటు చేయిస్తాను. మీరు వ్రాయండి" అన్నాడాయన.

పేములు గారు నెల్లూరు సభలో నా ప్రసంగం విన్న వాడే. అప్పటికి ఆయన సోషల్ వెల్ఫేర్ శాఖ డైరెక్టరుకు పర్శనల్ సెక్రటరీ అనుకొంటాను. ఆ విధంగా, హరిజనుల పుట్టు పూర్వోత్తరాలను గురించిన నా పరిశోధన "హరిజనులు ఆర్యులే" అనే వ్యాసంగా తయారై అరుంధతీ కళ్యాణం నాటకంకి పీఠికగా చేరి అచ్చయింది.

యోగవాసిష్ఠం, జ్ఞానవాసిష్ఠం అనే పేర్లతో అదివరకే వసిష్ఠుడి గురించిన గ్రంథాలున్నై. అందువల్ల ఈ అరుంధతీ కళ్యాణానికి రాగవాసిష్ఠం అని పేరు పెట్టాను. రాగవాసిష్ఠం అంటే వసిష్ఠుడి యొక్క రాగం, అనురాగం, ప్రేమ, పెళ్ళి అని అర్థం.

పేములు గారు అన్నమాట ప్రకారం ఈ గ్రంథం ముద్రణ ఖర్చులను భరించడమే కాక, దీనిని ప్రజలకు అందజేయడంలో కూడా చాల తోడ్పడ్డారు. అటు తర్వాత ఆయన I.A.S ఆఫీసరుగా వివిధ పదవులలో పనిచేస్తున్నప్పుడు కూడా నా సాహిత్యానికి పోషకులుగా వుంటూనే వచ్చారు. అంతటి ఉన్నత సంస్కారులూ, ఉదారులూ, కళాపోషకులూ హరిజన విద్యాధికులలో చాల అరుదు.

పేములు గారిది వసిష్ఠా గోదావరికి కుడివైపు. నాది ఎడమ వైపు. అంకిత పద్యంలోని "ఇద్దరి అద్దరి" అంటే అవే.

ఇక్కడ తమాషా ఏమిటంటే – నేను ఏ అస్పృశ్యులనబడే వాళ్ళకు ఆత్మ విశ్వాసం, సుపీరియారిటీ మనస్తత్వం కలిగించడానికి ఈ గ్రంథాన్ని వ్రాసి ప్రకటించానో వాళ్ళలో ఎంతో మంది దీన్ని చదవనే లేదు.

కాని, సవర్ణ హిందువులలో మాత్రం ఎక్కువ మంది చదివారు. పండితులూ, మేధావులూ మెచ్చుకొన్నారు. హరిజనుల వారసత్వం గురించి నేను ప్రతిపాదించిన సిద్ధాంతం సరైనదేనని అంగీకరించారు. అందుకు తార్కాణం ఈ నాటకాన్ని 1961–70 మధ్య ఉస్మానియా యూనివర్సిటీ B.A., B.SC., B.Com క్లాసులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించడం.

అప్పటి యూనివర్సిటీలోని తెలుగు శాఖాధిపతి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు మా ఇంటికి మనిషిని పంపి ఈ పుస్తకాన్ని తెప్పించుకుని పాఠ్యగ్రంథంగా నిర్ణయించటం జరిగింది. ఈ విషయంలో ఆయనకు సహకరించిన ఆచార్య నిడదవోలు వెంకటరావుగారికీ, డా. దివాకర్ల వెంకటావధాని గారికీ, డా. బి. రామరాజుగారికీ నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. ఈ నాటకాన్ని విద్యార్థులకు అందించే బాధ్యతను స్వీకరించి, నాకు ఆర్థికంగా ఎంతో తోడ్పడిన శ్రీరామా అండ్ కో అధినేతలు పబ్బా శంకరయ్యగారి ఔదార్యం విస్మరించ రానిది.

ఈ నాటకాన్ని చాలా చోట్ల ప్రదర్శించారు కానీ, రచనా పాకం కొంచెం ఎక్కువ చిక్కగా వుండడం వల్ల పాలేరు నాటకం వలే ప్రజలలోకి చొచ్చుకు వెళ్ళలేకపోయింది.

1971లో మా స్వగ్రామం మామిడికుదురులో ఆనాటి జిల్లా కలెక్టరు లింగం మాలకొండయ్యగారి ప్రోత్సాహంతో, ఎంతో వైభవంగా నా షష్టిపూర్తి జరిగినప్పుడు – కాకినాడకు చెందిన ఒక నాటక సమాజం వారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అప్పుడు ఆ ఉత్సవంలో పాల్గొని, నాటక ప్రదర్శనను దర్శించిన డా. సి. నారాయణ రెడ్డి, జె.బాపురెడ్డి, జె.యం.గిర్‌గ్లాని, లింగం మాలకొండయ్య, పోతుకూచి సాంబశివరావు మున్నగు అగ్ర సాహితీ వేత్తలు ప్రదర్శనను బహుధా మెచ్చుకొన్నారు.

ఈ రచనపై భారతిలో గొప్ప రివ్యూ వచ్చింది. చుక్కాని పత్రికలో సంధ్య పాత్రపై వచ్చిన విమర్శకు జవాబుగా బొజ్జా తారకం గారిచ్చిన జవాబు ప్రతిభా ప్రఫుల్లంగా వుంది. ఇది పాఠ్యగ్రంథమైనప్పుడు, దీనిని గురించి పండితత్రయం వారు తమ గైడులో వ్రాసిన వ్యాఖ్యానం బహు విశిష్టంగా వుంది. సంధ్య పాత్ర చిత్రణ నభూతో నభవిష్యతి అంటూ డా. కేతవరపు రామకోటి శాస్త్రిగారు చేసిన ప్రశంస నాకు గర్వకారణమే అయింది.

సవర్ణ హిందువుల కులవ్యవస్థను ఖండిస్తూ చేసిన విమర్శ చాలా సూటి గానూ, వాస్తవంగానూ, ఫ్రాంక్‌గానూ ఉన్నదనీ, అయితే అందులో బిట్టర్‌నెస్ (Bitterness) లేకపోవడం విమర్శకు ఉదాత్తత చేకూర్చిందనీ అప్పటి స్వతంత్ర పత్రిక సంపాదకులు గోరాశాస్త్రి గారు, మిత్రులు గోపాల చక్రవర్తి గారు చాలా మెచ్చుకున్నారు. వీరందరికీ, ఇంకా అనేక మంది సహృదయ మిత్రులకూ సదా నేను కృతజ్ఞుణ్ణి.

ఇక్కడ కొత్తగా ఒక్క మాట–

జాతీయ సమైక్యానికీ, ముఖ్యంగా హైందవ సమాజ సమైక్యానికీ, కుల విద్వేషాల

నిర్మూలనకీ దోహదం చేసే ఈ నాటకం గురించి – భాషా, సాహిత్యా లను, సనాతన ధర్మ ప్రవర్తనను ఎంతో ఉన్నత స్థాయిలో ప్రదర్శించి చూపిన ఈ నాటకం గురించి – ఆంధ్ర కవి పండిత మేధావులచే యూనివర్శిటీ డిగ్రీ క్లాసులకు రెండు టర్ములపాటు పాఠాలు చెప్పబడి ప్రశంసల నందుకొన్న ఈ నాటకం గురించి – 1970 తరువాత ఇంతవరకూ ఎవరూ పట్టించుకో లేదంటే ఏమనుకోవాలి? ఈ జాతి స్తబ్ధతకు చికిత్స ఏమిటి?

మరొక్క మాట–

"అరుంధతిపై ఫిల్మ్ తీయాలనుకొంటున్నాం మేము, అందుకు మీ సలహా సహకారాలు అవసర" మని ఎవరో కొందరు పెద్ద మనుషులు నా వద్దకు వచ్చి, ఈ నాటకం ప్రతులు రెండు తీసుకొని, మళ్ళీ వస్తామని చెప్పి వెళ్ళారు. కానీ మళ్ళీ రాలేదు. కొంతకాలానికి అరుంధతి పిక్చరు విడుదలైంది. అది నా కథకు పూర్తిగా భిన్నంగా వుంది. అరుంధతి ఒక హరిజనేతర మహిళగా చిత్రించ బడింది.

అందుకు నిరసనగా ఆనాటి హరిజన శాసన సభ్యులు, తదితర యువకులు ఆందోళన చేసి ఆ పిక్చరును నిషేధింప చేశారు. ఆ ఆందోళన వెనుక నే నున్నా ననే ప్రచారం కూడా చేశారు దాని ప్రొడ్యూసర్లు. అవి కాసు బ్రహ్మానంద రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్న రోజులు. రెడ్డి గారు నా ఎదరనే ఆ ప్రొడ్యూసర్లను తీవ్రంగా మందలించారు కూడా.

సినీమా రంగంలో నా పేరు కనిపించకుండా సవర్ణ హిందూ శూద్ర దొరలు తీసుకొన్న జాగ్రత్తలలో ఇది రెండోది. మొదటిది నా పాలేరు సందర్భంలో. మూడోది ఈ మధ్య అంబేద్కరు పిక్చరు తీయబడిన సందర్భంలో. హిందూ సమాజంలోని ఈ అజ్ఞాన అమానుషత్వం ఇక మారదా ?

ఇప్పుడు మళ్ళీ ఈ నాటకాన్ని పునర్ముద్రిస్తున్నాను. ఇది అయిదవ ముద్రణ – స్వీకరించండి.

భారత సమాజం మొత్తం అంతా ఒకే జాతి, కుల, వర్ణ, మత భేదాలు కృత్రిమ మైనట్టివి. ఈ ఏకత్వాన్ని సాధించడానికే నా ఈ పౌరాణిక పరిశోధనలు, నా ఈ పీఠికలూ, ప్రస్తావనలూ.

– బోయి భీమన్న
జూన్, 1993

## 1949 మొదటి ముద్రణ పీఠిక - ప్రస్తావన

హరిజనులు ఆర్యులే:

ఘనశాస్త్ర చర్చతో, హరి
జను లార్యు లటంచు చూపి, జాతి సమైక్య
మ్మును తెల్పిన మహితాత్ముని,
వినుతింతును మంగిపూడి వేంకట శర్మన్ !

"హరిజనులు ఆర్యులే" అనే నా సిద్ధాంతానికి త్రోవ చూపిన వారు శ్రీ మంగిపూడి వేంకటశర్మ గారు. ఆయన మహాకవి, మహాఋషి. ఆయన వ్రాసిన "నిరుద్ధ భారతం" ఆధునిక సాహిత్యంలో మకుటాయమానం. అది ఒక్క హరిజనులకే కాక, భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతివ్యక్తికీ పారాయణ గ్రంథం, నోబులు ప్రైజుకే అర్హమైన రచన.

"వ్యాస మునిచంద్రు గన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి యయ్యె,
వేశ్యకును పుట్టి, మాలెత బెండ్లియాడి,
ఆ వసిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె."

-నిరుద్ధ భారతం.

చాలా కాలం క్రితమే, అనగా నా విద్యార్థి రోజుల్లోనే, ఈ పద్యం నన్ను ఆకర్షించి, నాలో ఆలోచనలను రేకెత్తించింది. హరిజనులు ఆర్యులే నన్న భావం నాకు కలగడానికి ఈ పద్యం ఆధారం. అదే నన్ను ఈ "రాగ వాసిష్ఠ" నాటకాన్ని వ్రాయడానికి పురి కొల్పింది. అందుకే శ్రీ శర్మగారికి ప్రారంభంలోనే భక్త్యంజలి సమర్పించు కొంటున్నాను.

హరిజనులు ఆర్యులే అని ఋజువు చేసే ముందు, హరిజను లెవరో చెప్పాలి గదా. ఆంధ్ర ప్రదేశంలో ముఖ్యంగా మాల, మాదిగ, రెల్లి వగైరా కులాలను "హరి జనులు" అని అంటున్నాం. అంటరానివా రనబడే వారందరికీ కలిపి మహాత్ముడు పెట్టిన పేరిది. నేను కూడ ఈ వ్యాసంలో సౌకర్యం కోసం ఈ హరిజన శబ్దాన్నే వాడుతున్నాను.

మారన కృతమైన హరిశ్చంద్రోపాఖ్యానంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుణ్ణి వీరబాహుడికి అమ్మజూపినప్పుడు, తనను చండాలుడికి అమ్మవద్దని హరిశ్చంద్రుడు బ్రతిమాలాడు:

"కరుణన్ జూడుము, కావు మిప్పుడు త్రిలో
క స్తుత్య ! చండాల సం
కర దోషమ్మును పొందకుండగ ననున్
గై కొమ్ము నీ బంటుగా..."

ఇలా బ్రతిమాలగా, విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడితో–

"... నను గొల్చు బంటువై
దక్కితి గాన, మాలనికి
దక్కగ నమ్మితి నేను నిన్ను..."

అంటాడు. అని – అలానే అమ్మేసి ధనం తీసుకుపోతాడు.

(ఆ కాలంలో చక్రవర్తిని కొనగలిగిన సామర్థ్యం ఒక్క చండాలుడికే ఉన్నదన్న మాట !)

ఇక్కడ చండాల, మాల శబ్దాలు రెండూ పర్యాయ పదాలుగానే వాడ బడ్డాయి. మన పూర్వ గ్రంథాలన్నిటిలోను – మాల, మాదిగ, మాతంగ, శ్వపాక, చండాల పదాలన్నీ పర్యాయ పదాలే.

ఇందులో మరీ ఎక్కువగా వాడబడిన శబ్దం "చండాల" శబ్దం. ఈ చండాల శబ్దానికి అర్థం ఏమిటి? అమరకోశంలో దీని నిర్వచనం ఇలా వుంది:

"చండాలస్తు జనితో
బ్రాహ్మణ్యాం వృషలే న యః"

అనగా – బ్రాహ్మణ స్త్రీకి, శూద్రపురుషునికి పుట్టినవాడు చండాలుడు అని.

మనుస్మృతి కూడ ఇదే అర్థాన్ని రూఢిపరుస్తున్నది:

"శూద్రా దాయోగవః క్షత్తా
చండాల శ్చాధమో నృణాం
వైశ్య రాజన్య విప్రాసు
జాయంతే వర్ణ సంకరాః"

అనగా – శూద్రునివలన వైశ్య స్త్రీకి పుట్టినవాడు అయోగవుడు, క్షత్రియ స్త్రీకి పుట్టిన వాడు క్షత్త, బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు చండాలుడు. వీరంతా వర్ణ సంకరులు – అని!

వర్ణ సంకరులంతా వర్ణ బాహ్యులు! అవర్ణులు! అంటే, హిందూ సమాజ వ్యవస్థలోని నాలుగు వర్ణాలలోను ఏ వర్ణానికీ చెందని వారన్నమాట.

అయోగవుడు, క్షత్త మొదలైన అవర్ణుల సంగతి ఏమైనదీ మనకు తెలియదు. వారంతా వెనుకబడిన జాతులుగా వుండివుండవచ్చు. కాని, చండాలుడు మాత్రం చరిత్ర ప్రసిద్ధిని పొంది, ఒక్క దేశం దృష్టినేకాక, ప్రపంచ దృష్టినే ఆకర్షించగలిగాడు. అందుకు కారణం అతడికి హిందూ సమాజం విధించిన తీవ్ర నిషేధమే. సంఘ బహిష్కారం, వెలి, అంటరాని తనం, చూడరానితనం వగైరా అమానుష నిషేధాలు అతడిపట్ల అమలు జరుపబడ్డాయి. అంతటి కఠిన శిక్షలకు అతడు గురి కావడానికి కారణం తల్లి మరీ అగ్ర (శాసక) వర్ణానికి, తండ్రి మరీ అంత్య (సేవక) వర్ణానికీ చెంది వుండడమే కావచ్చు.

న్యాయంగా బిడ్డ తల్లికో, తండ్రికో చెందాలి. తల్లికి చెందితే బ్రాహ్మణుడు, తండ్రికి చెందితే శూద్రుడు కావలసిన బిడ్డ – మధ్య ఎవరికీ చెందని అవర్ణుడు, అస్పృశ్యుడు అయిపోవడం ఏమి న్యాయం? ఇది న్యాయం కాదని వాదించి పోరాడినందుకే అతణ్ణి "చండాలుడు" అన్నారు. చండాలుడు అనే శబ్దానికి అర్థం "కోపం కలవాడు" అని. "చడీ కోపే" అని లింగాభట్టీయం చండాల శబ్దానికి అర్థం చెపుతున్నది. కోపం కలవాడు చండాలుడే అయినప్పటికీ, ఈ శబ్దం – ఈ విధంగా పుట్టిన సంకరార్యుడికే రూఢి అయింది.

ఈ విధంగా పుట్టి, తమపై కఠిన నిషేధాలు అమలు జరపబడగా, అది అన్యాయమని వాదించి, గత్యంతరం లేక తిరుగబడిన తొలి చండాలురందరికీ ''మతంగుడు'' నాయకత్వం వహించినట్లు కనిపిస్తుంది.

''అల్ల మతంగ మహాముని
తల్లజు సంతానమేగదా మాతంగుల్ ?
తెల్లమగు తెనుగునుడి సం
పల్లాలసులార ! వారె మాదిగలు సుడీ.''

–నిరుద్ధ భారతం

''... మతంగుడు తాను వర్ణబాహ్యుడ నని తెలుసుకొని, తపస్సుచే దానిని మాన్పుకొన గొప్ప ప్రయత్నము జేసియు, వ్యర్థ మనోరథుడై, ఆర్యా వర్తమును వదలి, దక్షిణాపథమును ప్రవేశించెను. ఆర్యావర్తమున బ్రాహ్మణులతో సరిపడక నర్మదా తీరమునకు వచ్చెను. పిమ్మట మతంగుడు వాలి సుగ్రీవాద్యనార్య నివాసమగు ఋష్యమూకము జేరెను... శూద్రునకును, బ్రాహ్మణ స్త్రీకిని జన్మించి, వర్ణబాహ్యుడుగా పరిగణింపబడి, ఇంద్రు నంతటివాని మాటను తిరస్కరించి, పిమ్మట (నర్మద యొద్ద) గంధర్వులతో చేరియు, వారితోడను గ్రుద్దులాడి, తరువాత వాలి సుగ్రీవులను జేరియు వీరితోడను పోరాడిన మతంగునికి మన ఆర్యులు - కోపము కలవాడు కాన చండాలుడనియు, ఏ వర్ణమునకు చెందని వాడు కాన వర్ణ బాహ్యుడనియు, అవర్ణుడనియు, ఏ గ్రామమునకు చేరనివాడు గాన అంతేవాసియనియు పేర్లిడిరి... (ఇతడు) పిమ్మట మహా తపస్వియై చండదేవుడనిపించు కొనెను.''

–నిరుద్ధ భారతం

ఈ మతంగ మహర్షి వృత్తాంతం వివరాలకోసం భారతం అనుశాసనిక పర్వాన్ని; రఘువంశం 5వ సర్గని; వాల్మీకి రామాయణం కిష్కింధాకాండని చూడవచ్చును.

మతంగ మహర్షి సంతతివారే మాతంగులు, నేటి మాల మాదిగలు. మాతంగ శబ్దానికి లింగాభట్టీయం ఇచ్చిన అర్థం ''మతంగాజ్జాతాః మాతంగాః'' అని.

మహా తపశ్శాలి మతంగ మహర్షి. ఆనాటి సాంఘిక నీతిసూత్రాలపై తిరుగుబాటు చేసినవాడు. ప్రపంచంలో తొలి విప్లవకారుడితడే కావచ్చు కూడ! ఇది బహుశా స్మృతుల కాలంనాడు జరిగి వుంటుంది. మతంగ మహర్షి తరువాత, సమకాలీన హైందవ సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు చేసిన మహా పురుషుడు బహుశా బుద్ధభగవానుడే కావచ్చును.

ఆర్యావర్తం నుంచి, దారి పొడుగునా హిందూ సమాజంతో పోరాటం పెట్టుకుంటూ, దక్షిణాదికి వచ్చిన అట్టి మహా పురుషుని సంతతి వారైనందువల్లనే మాల మాదిగలు ఆసేతు హిమాచలం, దేశమంతటా, ప్రతి గ్రామంలోను వ్యాపించిన వారై వున్నారు.

మాతంగులలో పుట్టింది అరుంధతి.

"ముని చంద్రుండగు నవ్వసిష్ఠ సతియై
ముల్లోకముల్ మెచ్చ రీ
తిని వర్తించి, ల సద్గుణాఢ్యయయి, పా
తివ్రత్య మాహాత్మ్యమున్
తనరారన్ వరతారయై పొలిచి మిం
టన్ దంపతీలోక వం
దనముల్ గాంచు నరుంధతీ సతియు చం
డాలాంగనా రత్నమే."

–నిరుద్ధ భారతం

"అక్షమాలా (అరుంధతి) వసిష్ఠేన
సంయుక్తాధమ యోనిజా
సారంగీ మందపాలేన
జగా మభ్యర్చ నీయతాం"

–మనుస్మృతి

"మందపాలుడనెడు మౌనీంద్ర చంద్రుండు
కడు నికృష్టజాతి కన్యయయ్యు
సాధుశీలయైన సారంగి బెండ్లాడి
అల వసిష్ఠ లీల నలరలేదె?"

-నిరుద్ధ భారతం

"తల్లి ఊర్వశి లంజ, తనయాలు మాదిగ,
తాను బ్రాహ్మడయ్యె తగ వసిష్ఠ (డు)"

-వేమన

"Tradition traces her (Arundhati's) birth and Parentage to a family of outcastes; but, by her Pativratya, she came to be respected as the greatest woman that Vedic India ever produced" అని శ్రీ బి. హెచ్. సత్యనారాయణ ఎమ్.ఏ. గారు, భవభూతి ఉత్తర రామచరితలోని అరుంధతి పాత్ర పోషణను పరామర్శిస్తూ త్రివేణి పత్రికలో పేర్కొన్నారు.

ఈ విధంగా అరుంధతి మాతాంగ కన్య అని పూర్వగ్రంథాల నుంచి ఇంకా ఎన్నో ఉదాహరణలు ఈయవచ్చును.

అరుంధతి పుట్టుకను గురించి ఒకటి రెండు పాఠాంతరాలు ఉన్నాయి.

బ్రహ్మపుత్రిక అయిన సంధ్యాదేవి మేధాతిథి యజ్ఞంలో ప్రాతస్సంధ్య, అరుంధతి, సాయంసంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్లు ఒక గాథ కలదు. కర్దమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలలో అరుంధతి ఒకతె అనే మరోగాథ కలదు. కర్దముడు ప్రజాపతి అయితే సృష్టికి కారకులైన ఆది పురుషులలో అతడొక డవుతాడు. ప్రజాపతుల కాలంలో వర్ణభేదమే లేదు. లేక కర్దముడు తరువాతి వాడైతే, అతడు మతంగ వంశీయుడే కావచ్చు. అప్పుడు అరుంధతి అక్క చెల్లెండ్రు (అనసూయ మొదలగు మహా పతివ్రతలు), ఆమె తమ్ముడు కపిల మహర్షి కూడ మాతంగులే (అనగా మాల మాదిగలే) అవుతారు గదా?

కపిల మహర్షి మాతంగుడనడానికి ఆధారం వుంది. "... ధరణీ సురునకును, మాలెతకు నందనుడై పరగిన కపిలుడు పావన పురుషుండై ఋషులలోన పూజ్యత కనడే?" అని నిరుద్ధ భారతం చెబుతున్నది. కపిల మహర్షి మాతంగుడైనప్పుడు అతని తండ్రి, అక్కలు మాతంగు లేల కారు? రామాయణ కాలం నాటికే మతంగ మహర్షి దక్షిణాదికి వచ్చి వున్నాడు. కనుక, ఉత్తరాదిని కర్దముడు మతంగ వంశీయుడే అయివుండాలి.

ఆర్యమత ప్రచారకుడైన వసిష్ఠుడు అనుకూలవతియైన భార్య కోసం వెతుకుతూ ఒక మాలపల్లెకు వచ్చాడనీ, అక్కడ ఒక ఇంటి చావడిలో వడ్లు దంచుతున్న ఒక పిల్లను చూశాడనీ - అంతలో తల్లి పిలవగా ఆమె ఎత్తిన రోకలిని అలానే వదిలేసి వెళ్ళిందనీ, ఆమె తిరిగి వచ్చే వరకు ఆ రోకలి అలానే గాలిలో నిల్చివున్నదనీ - ఈ వింతను, ఆమె ఆజ్ఞాపాలనా తత్వాన్నీ, ఆత్మ శక్తిని చూచి, ముగ్ధుడై అతడు ఆమెను పెండ్లాడాడనీ - ఆమే అరుంధతి అనీ వేరొక గాథ కలదు.

అన్ని గాథలను పరిశీలించి, నా రచనకు ఏదీ అనుకూలంగా లేనందు వల్ల, నాకు కావలసిన కథను నేను వీటి నుంచి కల్పించుకున్నాను.

ఏ విధంగా చూచినా, అరుంధతి మాతంగ కన్యే. ఆమెను వసిష్ఠుడు వివాహం చేసుకున్నాడు. ఆ పుణ్య దంపతులకు శక్తి మహర్షి పుట్టాడు. అతడు కూడ ఒక మాలెతను, అదృశ్యంతి అనే ఆమెను, పెండ్లాడి పరాశరుణ్ణి కన్నాడు. పరాశరుడికి వ్యాస మహర్షి పుట్టాడు.

"వ్యాస మునిచంద్రు గన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి యయ్యె"

-నిరుద్ధ భారతం

"వేద విభాగమున్ జరిపె
విశ్వము సర్వము ప్రస్తుతింప, అ
ష్టాదశ సత్పురాణములు
శస్తమతిన్ విరచించె; సర్వలో

కాదరణీయమ్మైన ఇతి
హాసము భారతమున్ రచించె; అ
బ్జోదరు వంశ సంభవము
నొందెను వ్యాసుడు నిమ్నజాతుడే"

–నిరుద్ధ భారతం

"జాతో వ్యాసస్తు కైవర్త్యాః
శ్వపాక్యాస్తు పరాశరః."

–భారతము ఆ.ప.

కాగా, వ్యాస భగవానుడు మాదిగ వనిత అయిన అరుంధతికి ముని మనుమడు. మాలపిల్లకు మనుమడు. జాలరి అయిన మత్స్యగంధికి, మాదిగవాడైన పరాశరుడికి కుమారుడు. ఇదంతా అధికభాగం మాదిగ వంశమే కదా? ఇట్టిది "పెద్ద కులం" కాక మరేమవుతుంది? ఇట్టి వ్యాసమహర్షి కదా వేద విభజన చేసినవాడు? అష్టాదశ పురాణాలను, పంచమ వేదమైన మహాభారతాన్ని రచించినవాడు? అసలు భారతీయులకు భారతీయ సంస్కృతిని, సాహిత్యాన్ని, వేదాంతాన్ని ఇచ్చిన వాడు ఈ పెద్ద మాదిగవాడే కదా?

ఇంకా విశేషమేమంటే, వేదవ్యాసుని సంతానమే ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడున్ను. పాండవులు, కౌరవులు, వ్యాసుని వంశీకులే కద? కాగా, మాదిగలే కద? అప్పుడు వారి బంధువులైన యాదవులు, శ్రీకృష్ణాదులు ఎవరవుతారు? మరీ తమాషా ఏమిటంటే – పంచమునిచే వ్రాయబడిన పంచముల చరిత్ర కాబట్టే మహాభారతానికి "పంచమ వేదం" అనే పేరు వచ్చిందనడానికి వీలుండడం. "గొంతమ్మ" పండగలను మాల మాదిగలు మాత్రమే చెయ్యడం కూడ మరొక విశేషం. మాల మాదిగలకు కుంతి, పాండవులు ఇలవేల్పులు.

ఈ చర్చవల్ల ఇంతవరకు తేలిందేమిటంటే, హరిజనులు తల్లివైపున ఖచ్చితంగా ఆర్యులేనని, పైగా, ఆర్యమతానికి మూల ఋషులు కూడా నని. ఇక తండ్రివైపున

"శూద్రులు" కూడ ఆర్యులేనని నిర్ధారణ అయితే, ఇప్పుడున్న సాంకర్య దోషంపోయి హరిజనులు స్వచ్ఛమైన ఆర్యులే కాగలరు.

అందువల్ల, ఇప్పుడు శూద్రులనబడే వారెవరో విచారిద్దాం.

"జన్మనా జాయతే శూద్రః
కర్మణా జాయతే ద్విజః
వేద పాఠంతు విప్రాణాం
బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః"

అనే ఆర్యోక్తి మనకొకటున్నది. దీనివల్ల ప్రతి హిందువుడు జన్మతో శూద్రుడే నని, కర్మవల్ల ద్విజుడౌతున్నాడని, వేదం చదవడంవల్ల విప్రుడు, బ్రహ్మజ్ఞానాన్ని సాధించడంవల్ల బ్రాహ్మణుడు అవుతున్నాడని స్పష్టమవుతూ వుంది. పుట్టుకతోనే కులం ఏర్పడే నేటి ఆచారాన్ని ఈ సూత్రం స్పష్టంగా ఖండిస్తున్నది కదా?

ఒకే వ్యక్తి జన్మతో శూద్రుడు, కర్మతో ద్విజుడు అవుతున్నప్పుడు ద్విజుడు ఆర్యుడు, శూద్రుడు అనార్యుడు ఎలా అవుతారు? అందరూ ఆర్యులే కారా?

కాగా, శూద్రుడు, ద్విజుడు, విప్రుడు, బ్రాహ్మణుడు మొదలైన తేడాలు గుణకర్మ విభాగంలో వచ్చాయేకాని, అసలు భారత జాతి ఒక్కటే అని దీనినిబట్టి తేలుతున్నది. శూద్ర బ్రాహ్మణత్వాలు ఒకే వ్యక్తిలో అతని విజ్ఞాన స్థాయిని బట్టి ఏర్పడే రెండు దశలు. శూద్రుడు సంస్కారంవల్ల బ్రాహ్మణుడవుతాడు. ఈ విషయం మహాభారతంలో స్పష్టంగా చెప్పబడి వుంది.

"న జాతిః పూజ్యతే రాజన్
గుణాః కల్యాణ కారకాః
చండాల మపి వృత్తస్థం
తం దేవా బ్రాహ్మణం విదుః"

–భారతం

"జననంబు చేత చూచిన
జనులెల్లరు కూడ ఏక జాతియె అనుచున్
మన శాస్త్రములు సమస్తము
పెనురొద మిను ముట్ట ఘోష పెట్టుట లేదే!"

–నిరుద్ధ భారతం

ఈ విషయాన్ని భగవద్గీత మరీ స్పష్టంగా వివరించింది!

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం
గుణకర్మ విభాగశః"

–భగవద్గీత

ఈ గీతావాక్యానికి కొందరు అపార్థాన్ని తీసి, తమకు అనుకూలంగా వాడుకొంటున్నారు. "వారి వారి గుణాలను, పనులను అనుసరించి మనుష్యులను నాలుగు వర్ణాలుగా విభజించాను." అని కృష్ణభగవానుడు చెప్పాడు. (కృష్ణభగవానుడు ప్రపంచానికంతటికీ భగవానుడు గాని, వర్ణభేదం గల హిందువులకు మాత్రమే కాడన్న ఇంగితాన్ని మనం ఇక్కడ గుర్తించాలి.) ఈ భగవద్వాక్యానికి విపరీతార్థం తీసి, ప్రారబ్ధాన్ని బట్టే ఆయా వర్ణాలలో పుడతారని అజ్ఞానంలో వున్న ప్రజలకు బోధించడం జరిగింది. పాపం చేసి చండాలుడై పుడతాడనిన్నీ ప్రచారం చేశారు. అలా ప్రచారం చేసేవారు అటువంటి – అంతకన్న ఘోరమైన పాపాలను చెయ్యడానికి జంకడం లేదు. పునర్జన్మ మీద నమ్మకం వున్న హిందూ జాతి నేడు, అటువంటి నమ్మకాలు లేని ప్రపంచంలోని ఇతర జాతులకంటె, ఎక్కువ పాపాలను చేస్తున్న దంటే – అంతకన్న ఘోరం మరేముంటుంది?

ఈనాడు హిందూ సమాజంలో వేదందారి వేదానిది. విస్సన్న దారి విస్సన్నది. ధర్మం దారి ధర్మానిది. ఆచారం దారి ఆచారానిది. మత గ్రంథాలు చెప్పేదానికీ, మనం ఆచరించేదానికీ ఏ మాత్రమూ సంబంధం లేదు!

"పోరాడు, పురోగమించు, గెలిస్తే భూలోకరాజ్యం, చస్తే వీర స్వర్గం" అని, యుద్ధ రంగంలో సింహనాదం చేసి ఆవిర్భవించిన వీరగీత భగవద్గీత. అట్టి మహాతత్త్వం మూలమతంగా గల భారత సమాజం బానిసతనంలో కూరుకుపోవడం, "ఒకచెంపకొడితే రెండవ చెంప ఇయ్యి" అని కేవలం అహింసను బోధించిన ఇతర దేశాలు "అణోరణీయాన్, మహతో మహీయాన్" నినాదాలతో నవగ్రహాల మీదికీ, నక్షత్రాల మీదికీ దండెత్తి పోతూ వుండడం ఎంత విపరీతం! ఇట్టి వైపరీత్యానికి కారణమేమిటి? నాకు ఒక్కటే కారణం కనిపిస్తున్నది. అది ఇది : వర్ణ వ్యవస్థ ముదిరి, కఠిన కులాలుగా చీలి, జాతీయత ఛిన్నాభిన్నమైపోవడం, జ్ఞానం దాచి పెట్టబడి, ప్రజాసమూహం అజ్ఞానంలో ముంచి వుంచబడడం, ప్రతిభా వికాసానికి అవకాశమే లేక, మహాఋషుల అవతరణకు ఆటంకాలేర్పడడం, క్రమంగా మన మత విజ్ఞానధనం మాసిపోయి, మూఢ స్మృతులు మాత్రం మిగిలి వుండడం.

ఆనాడు "శూద్ర" శబ్దం జాతిని తెలిపే పదం కాదని, అది మనిషి లోని ఒక అవస్థను – అనగా అతని గుణాన్ని, పనిని తెలిపే శబ్దం అని మనం తెలుసుకున్నాం. ఆనాడు ఈనాటి కులాల వంటివి లేనే లేవు. పురాణ కాలం నాటికి వర్ణాలు ఏర్పడ్డాయి. అందులో ద్విజాలు మూడు వర్ణాలు. శూద్రులు ఒక వర్ణం. ఐదవ వర్ణం లేదు.

> **"బ్రాహ్మణ క్షత్రియో వైశ్యః**
> **త్రయో వర్ణా ద్విజాతయః,**
> **చతుర్థ ఏక జాతి స్తు**
> **శూద్రో, నా స్తితు పంచమః"**
>
> –మనుస్మృతి

ఈ చతుర్వర్ణాల చరిత్ర కోసం ఇంకా మనం కొంతవరకు చరిత్రను – కొంతవరకు మన పురాణేతిహాసాలను పరికించి చూద్దాం.

చరిత్రను, మహాపురుషుల రచనలను పరికించి చూస్తే, ఆర్యులు జన్మస్థానం ఉత్తరధ్రువ ప్రాంతమే అనవచ్చు. శ్రీ లోకమాన్య తిలక్ మహాశయుని "ఆర్యుల ఉత్తర

ధ్రువ నిలయం" (The Arctic Home of Aryans) అనే మహాగ్రంథం ఈ విషయంలో మనకు చాల ఉపకరిస్తుంది. ధ్రువ ప్రాంతం సమశీతోష్ణంగాను, భారత భూభాగం మానవ వికాసానికి అయోగ్యంగాను వున్న కాలం అది. క్రమంగా శీతోష్ణ పరిస్థితులు మారడం, ధ్రువ ప్రాంతంలో హిమప్రళయం రావడం జరిగి, అక్కడి ఆర్యులు పలుముఖాలుగా చెదిరి పోయారు. అందులో ఒక జట్టు దక్షిణముఖంగా బైలుదేరారు.

ఈ జట్టుకు తరువాత స్థిరనివాసం కాస్పియను సముద్ర ప్రాంతంగా కనిపిస్తుంది. వేదాల అవతరణ ఉత్తర ధ్రువప్రాంతంలోను, పురాణాల అవతరణ కాస్పియను సముద్ర ప్రాంతంలోను అయివుండవచ్చు కూడ. ఇందుకు బలమైన ఆధారాలున్ను వున్నాయి. కశ్యప ప్రజాపతి ఉనికి ఈ కాస్పియను తీరప్రాంతమేనని, అతని పేరే ఆ సముద్రానికి వచ్చిందనీ కూడ చెపుతున్నారు.

అసీరియనులకు, సిరియనులకు చారిత్రకంగా జరిగిన యుద్ధాలే మన పురాణాలలో దేవాసుర యుద్ధాలుగా వర్ణించబడినట్లు కనిపిస్తున్నది. అసీరియనులు "అసురలు"గాను, సిరియనులు "సురలు"గాను వర్ణించబడ్డారు. చారిత్రకంగా సిరియనులు, అసీరియనులు ఒకే జాతికి చెందినవారు. పొరుగు దేశాల వారు, పౌరాణికంగా సురలు, అసురలు దాయాదులు. ఒకే తండ్రికి పుట్టినవారు. దితి, అదితుల బిడ్డలు. కశ్యప ప్రజాపతి సంతానం.

ఆ కాలంలో తరచుగా అసీరియనులు సిరియాపై దండెత్తి, వారిని ఓడించడం, పీడించడం జరుగుతుండేది. దేవాసుర యుద్ధాలలో ఇదే తరచు జరుగుతుండేది. అసురలే సురలను తరచు ఓడించి పీడిస్తూ వుండేవారు. ఈ విషయం "బ్రాహ్మణుల యూదు జాతీయత (The Hebrew Origin of the Brahmins)" అనే గ్రంథంలో విపులంగా చర్చించబడింది. కాస్పియను ప్రాంతమే మేరుపర్వత ప్రాంతమని కూడ భావించబడుతున్నది.

"... మన ఆర్యులకు, ఇరాన్ వారికి (పారసీకులకు) చాల దగ్గర సంబంధము కలదు. కాని వారికి అసురులైనవారు మనకు సురలుగాను మన అసురులు వారికి సురలుగాను మారిరి."

–తెలుగు విజ్ఞాన సర్వస్వము – పుట – 313

మారడం కాదు. అసలు అదే సత్యం కదా? అసీరియనుల (అసురుల) దేశంలో వారి శత్రువులైన సురలు రాక్షసులు కావడంలో చిత్రం ఏముంది?

కాగా, ఉత్తర ధ్రువ ప్రాంత వాసులైన ఆర్యులు, కాస్పియను తీర భూములలో స్థిర నివాసులై, అక్కడ అంతఃకలహాలకు లోనై, అందులో ఒక తెగ (అసీరియనులు) ఆగ్నేయంగా తరలి, కొండలను దాటి, భారతదేశంలో ప్రవేశించారు. అప్పటికి భారతదేశం శీతోష్ణ పరిస్థితి మానవ వాసయోగ్యంగా మారివుండవచ్చు. వారు సింధునదీ తీరంలో స్థిర నివాసులై, వ్యవసాయ జాతియై, నాగరికులై నారు. నేడు హరప్పా, మొహంజోదారో ప్రాంతాలలో వెలువడిన నాగరికత వారిదే. వారే ద్రవిణులు (ద్రావిడులు).

''హిరణ్యం, ద్రవిణం'' అని అమరం నిర్వచనం. ద్రవిణం అనగా ధనం. వ్యవసాయ జాతిగా స్థిరపడి, నాగరికులై, పాడిపంటలతో ధన ధాన్యాలతో తుల తూగుతూ వున్నవారు కాబట్టి ద్రవిణులు (ధనవంతులు) అని పిలువబడ్డారు.

ఆ తరువాత ఎన్నో వేల సంవత్సరాలకు కాస్పియను ప్రాంతాల నుంచే మరొక ఆర్య తెగ (అక్కడ అసీరియనుల చేతిలో ఓడిపోయిన సిరియనులు) అదే దారిని భారతదేశంలో ప్రవేశించారు. వీరు క్రొత్తగా వచ్చిన ఆర్యులు. వీరిని ఉత్తరార్యులు అనవచ్చు. అంతకు ముందే అక్కడికి వచ్చి స్థిరపడి వున్న నాగరికార్యులను వీరు ద్రావిడులు అన్నారు. మళ్ళీ ఈ ఆర్య ద్రావిడుల మధ్య పాత పోరాటాలు పునర్వి జృంభించాయి. ఆ విరోధ భావంతో ఉత్తరార్యులు తమ దాయాదులగు పూర్వార్యులను దస్యులని, రాక్షసులని, ఇంకా అనేకమైన చెడ్డపేర్లతో దూషించారు. రాక్షసులకు ''పూర్వ దేవతలు'', ''తొలి వేల్పులు'', ''పుణ్యజనులు'' అనే పేర్లు రావడానికి కారణం. వారు నేడు ఆర్యులని చారిత్రకంగా పిలువబడుతున్న వారి కంటె చాల ముందుగా వచ్చిన ఆర్యులై వుండడమే.

కాగా, నేడు ఇక్కడ ఆర్యులుగా వ్యవహరించబడుతున్నవారు, ద్రావిడులు, ఇంకా మధ్య ఆసియా, ఐరోపా ప్రాంతాలలోని వివిధ జాతులూ కూడ ఆదిలో ఒకే ఒక మూలజాతి కుటుంబానికి చెందిన ఆర్యులే. మనకు కావలసి నంతవరకు మాత్రమే తీసుకుంటే - ద్రావిడులు ఆర్యులే, ఆర్య ద్రావిడులు ఒకే జాతికి చెందినవారు. ఈ విషయాన్ని హిందూపురాణాలు, మానవజాతి చరిత్ర - శాస్త్రాలు ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి.

ఆ విధంగా రెండవ జట్టు ఉత్తరార్యులు, మొదటిజట్టు ద్రవిణార్యులతో పోరాటాలకు దిగి, వారిని ఓడించి, దక్షిణాదికి నెట్టారు. చిక్కిన వారిని బానిసలుగా చేసుకొన్నారు. వారి స్త్రీలను పెండ్లాడారు. క్రమంగా వారిలో కలిసి పోయారు. ఆ విధంగా ఏర్పడిన మిశ్రమజాతే భారతజాతి.

ఆర్య ద్రావిడ పోరాటాలలో ఉత్తరార్యులకు బానిసలుగా చిక్కినవారే "శూద్రులు."

"....సాంఘిక విభేదములు క్రమముగా కుల భేదములుగా మారి స్థిరపడినవి... ఆర్యుల చేత జయింపబడి, ఆర్యులు అధమ వృత్తులుగా పరిగణించిన వైద్యము, జ్యోతిషము, నేతపని, కుమ్మరిపని, కమ్మరిపని, తోళ్ళు, కుట్టుపని మొదలైన వృత్తుల వలన జీవించు ద్రావిడులు మొదలుగాగల దేశీయ జాతుల వారిని శూద్రులు అను పేర నాల్గవ వర్ణముగా ఆర్యులు తమ సంఘములో చేర్చుకొనిరి.... రాజుల ఆగ్రహానుగ్రహముల వలనను, తత్తద్గుణ కర్మల వలనను ఒక కులము నారు మరొక కులమునకు మారుచుండుట కూడ మొదట పరిపాటిగా నుండెను. క్రమముగా ఏ కులము వారు ఆ కులము వృత్తుల తోనే జీవింపవలెనను కట్టడి అమలులోని వచ్చినది."

–తెలుగు విజ్ఞాన సర్వస్వము – పుట 315

ఉత్తరార్యులు భారతదేశంలో ప్రవేశించేటప్పటికే మూడు వర్గాలుగా వచ్చినారు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్యవర్ణాలు అవి. ఇప్పుడు పూర్వార్యు లైన ఈ శూద్రులను నాలుగవ వర్ణంగా ప్రకటించి, తమ సామాజిక వ్యవస్థలో ఒక భాగంగా చేసుకొన్నారు.

ఉత్తరాదిని ఆర్య ద్రావిడ సామరస్యం కుదిరి ఒక సామాజిక వ్యవస్థగా మారి, ప్రశాంతత ఏర్పడేటప్పటికి దక్షిణాదిని కూడా ప్రశాంతత ఏర్పడింది. దక్షిణాదికి నెట్టివేయబడి, ఇక్కడ రాజ్యాలు ఏర్పరచుకొన్న ద్రావిడులు క్రమంగా ఉత్తరార్య సామాజిక విధానాన్ని అవలంబించి, గుణకర్మ విభాగ పద్ధతిలో వర్ణాలను ఏర్పరచుకొన్నారు.

ఆపస్తంభుడికి పూర్వం దక్షిణ భారతంలో వర్ణ విభజన లేదు. అతడే తొలిసారిగా దక్షిణాదిలో ఉత్తరార్యుల వర్ణ వ్యవస్థను ప్రవేశ పెట్టినవాడు. అతడు క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దికి చెందినవాడు. ఇది నా వాదనకు పోషకమైన చరిత్రాంశం.

ఉత్తరార్యులు వచ్చి, అంతకు పూర్వం ఏనాడో వచ్చి స్థిరపడివున్న పూర్వా ర్యులతో కలిసిపోయి, తమతో తెచ్చిన వైదిక మతాన్ని వ్యాపింపజేసినారు. ఆధునిక శాస్త్ర పరిశోధనల దృష్ట్యా కూడ ఇది సత్యమే. ప్రస్తుతం భారతదేశంలోవున్న ప్రజలంతా – ఉత్తరార్యులు, ద్రావిడులు అనబడే పూర్వార్యులు, వర్ణాంతర వివాహజనితులైన వేలకొలది ఉపకులాల వారు, సవర్ణులు, అవర్ణులు అందరూ ఒకే ఒక "కాకేషియను" జాతి కుటుంబానికి చెందిన వారే. మూల మానవ జాతులు ఐదింటిలోను కాకేషియను జాతి ఒకటి. అసలు నేడు ప్రపంచంలోని ఏ ఒక్క మానవుడు కూడా స్వచ్ఛంగా ఏదో ఒక్క మూల జాతికి చెందిన వాడుగా లేడని, ఇప్పుడు అందరు మానవులూ మిశ్రమ జాతి వారుగానే వున్నారని మానవజాతి శాస్త్ర పరిశోధకులు అంటున్నారు.

కాగా, వేదసమ్మతం కానట్టి, పైగా వేదవిరుద్ధమైనట్టి, మొన్న మొన్నటి వరకు లేనట్టి వర్ణ వ్యవస్థను పట్టుకొని వ్రేలాడడం కేవలం అజ్ఞత కాదా?

వాతావరణ పరిస్థితులు, జీవిత స్థితిగతులు, కలిమి లేములు, కాయకష్టాలు, జ్ఞానార్జనావకాశాలు, వృత్తుల మంచి చెడ్డలు మానవునిలో కాలక్రమేణా శారీరకంగాను, మానసికంగాను అనేక మార్పులు తెస్తాయి. "నల్ల బ్రాహ్మణుడు, ఎర్ర మాదిగాడు" వగైరా సామెతలు కేవలం అజ్ఞానాన్ని సూచించేవి మాత్రమే.

ఇక్కడ రెండు ముఖ్య విషయాలను గుర్తించవలసి వుంది. (1) "ఆర్య" శబ్దం జాతిని సూచించేది కాదు. అది ఒక జీవిత విధానం. (2) "వర్ణం" రంగును సూచించేది కాదు. అది గుణాన్నీ, తద్వారా వృత్తినీ సూచించేది.

ఆర్యత్వం ఒక జీవిత విధానం. ధర్మార్థ కామ మోక్షాలైన పురుషార్థాలను నాలుగింటిని క్రమంగా సాధించడం ఆర్యమత లక్ష్యం. ధర్మం, అర్థం, కామం, మోక్షం – ఈ నాల్గు అర్థాలలోను ఒక్కొక్క అర్థాన్ని సాధించినవాళ్ళు ఒక్కొక్క "వర్ణం"గా వర్ణించబడ్డారు. వర్ణం అంటే ఇక్కడ గుణం. ధర్మం గుణంగా కలవారు శూద్రులు. అర్థం గుణంగా కలవారు వైశ్యులు. కామం గుణంగా గలవారు క్షత్రియులు. మోక్షం గుణంగా కలవారు బ్రాహ్మణులు. అంటే – బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు క్రమంగా మోక్షార్థులు, కామార్థులు, అర్థార్థులు, ధర్మార్థులు. ఈ గుణాలను బట్టే వారి పనులున్న

ఉన్నాయి. గుణాలు మారినప్పుడు పనులున్ను మారతాయి. ఈ మార్పును సాధించి, శూద్రత్వం నుంచి బ్రాహ్మణత్వానికి పురుషుని వికసింపజేసేదే ఆర్యమతం.

శూద్రత్వం పురుషుడికి బాల్యావస్థ అనుకుంటే, వైశ్యత్వం యౌవనావస్థ, క్షత్రియత్వం కౌమారావస్థ, బ్రాహ్మణత్వం వృద్ధాప్యావస్థ అని చెప్పవచ్చు. పురుషుడు శారీరకంగా బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు పెరుగునట్లే, ప్రపంచంలోని మానవుడైన ప్రతివాడు గుణాత్మకంగా శూద్రత్వం నుండి బ్రాహ్మణత్వం వరకు వికసిస్తాడు. అట్టి క్రమ వికాసానికి శాస్త్రీయంగా తోడ్పడేదే ఆర్యమతం.

విశ్వశ్రేయమే ఆదర్శంగా ''సర్వేజనా స్సుఖినో భవంతు'' నినాదంతో, ''కృణ్వంతో విశ్వమార్యం'' అని ఎలుగెత్తి చాటుతూ, ప్రపంచ మానవుల నందరినీ ఆర్యులుగా చెయ్యడంకోసం జైత్రయాత్ర కదలిన విశ్వజనీనమతం ఆర్యమతం!

''జన్మనా జాయతే శూద్రః'' కనుక, పురుషుని శూద్రత్వం నుంచి క్రమంగా బ్రాహ్మణత్వంవరకు వికసింపజేసి, చివరకు బ్రహ్మైక్యాన్ని సాధించడం ఆర్యమతం. ఈ ఆర్యమతాన్ని, దాని జీవిత ధర్మాన్ని అనుసరించే ప్రతివాడు ఆర్యుడే.

''కృణ్వంతో విశ్వమార్యం'' (విశ్వంలోని మానవులందరినీ ఆర్యులుగా నొనర్పుడు) అనేది ఆర్యమత నినాదం. ఈ నినాదాన్ని అనుసరించే ఆ కాలంలో ఉత్తర ధ్రువం మొదలు దక్షిణ సముద్రపు దీవుల వరకు గల మానవులలో అనేకులు ఆర్యులైనారు.

''గణికాగర్భ సంభూతో
వశిష్ఠ మహాముని:
తపసా బ్రాహ్మణో జాతః
సంస్కారః తత్ర కారణం''

''జాతో వ్యాసస్తు కైవర్త్యాః
శ్వపాక్యాస్తు పరాశరః
బహవోన్యేపి విప్రత్వం
ప్రాప్తాయే పూర్వ మద్విజాః''

"ఇట్లు పూర్వము అద్విజులై, పిమ్మట సంస్కారము ననుసరించి ఎందరో బ్రాహ్మణులైరి." - పూర్వగాథాలహరి

"బ్రాహ్మణ శ్రేష్ఠుడైన భార్గవుడు తొల్లి
ద్విజులు లేని ఒకానొక దేశమందు
సర్వసముడౌచు, కైవర్త్య జాతి జనుల
జందెములు వైచి విప్రుల జలుపలేదె?"

-నిరుద్ధ భారతం

"తొల్లి కణ్వమునీంద్ర చంద్రుండు మ్లేచ్ఛ
దేశమైన ఐగుప్తకేతెంచి, అచట
వేలకొలది మనుష్యుల వేదమతము
నందు చేర్పడె? వారు పూజ్యతను గనరె?"

-నిరుద్ధ భారతం

ఈ విధంగా అద్విజులైన ఇతర జాతీయులెందరో వైదిక మతంలోకి చేర్చుకోబడ్డ ఉదాహరణలు మన హిందూ శాస్త్రాల నిండా వున్నాయి.

దేశ దేశాలు తిరిగి, వేదమతాన్ని వ్యాపింపజేసిన మహాఋషుల దేశం మనది. ఇట్టి దేశంలో శూద్రుడు వేదం వినగూడదన్న శాసనం పుట్టడం, ఒకే జాతిలోని రెండు వృత్తి వర్గాల స్త్రీ పురుషులకు పుట్టిన బిడ్డ అస్పృశ్యుడుగా బహిష్కరింపబడడం నిజంగా దుర దృష్టకరం.

ఇట్టి దురదృష్టకర శాసనాలు ఎప్పుడు ఎందుకు పుట్టినవో ఎవరూ స్పష్టంగా చెప్పలేరు. ఆ సంకుచిత శాసనాలే వేద విజ్ఞానానికి సంకెళ్ళు తగిలించి కులతత్వపు ఖైదు

కొట్టులో పడవేసినవి. ఆనాటి నుంచే వేదమాత కృశించిపోయి, ఆర్యధర్మం నశించిపోయింది.

మరీ దురదృష్టకరమైన విషయమేమిటంటే, స్మృతియుగం నాటి ఏతత్ సాంఘిక శాసనాలను, ఆర్డినెన్సులను కాలపరిస్థితులకు అనుగుణంగా సవరించుకోవడమో, రద్దుచేసికోవడమో చేయకుండా, వాటిని ఈనాటికీ అమలు జరపడానికి ప్రయత్నిస్తూ వుండడం ! వేదకాలపు ఔన్నత్యాల నుండి ఆర్య మతము ఎటువంటి చీకటి లోయలలోకి పతనమైపోయిందో, ఎంతటి అమానుషమైన వెర్రితలలు వేసిందో, ఆర్యధర్మ జీవనస్రవంతి ఎంతగా ఎండిపోయిందో వీనివల్ల స్పష్టమవుతున్నది. వేదహృదయం తెలిసిన ఆర్యధర్మ నాయకత్వం లోపించడంతో భారత ప్రజలు కోట్లకొలదిమంది పరమతాల పాలై పోయారు కూడ.

ప్రపంచమంతా ఆర్యమతంగా మార్చవలసిందిగా మన వేద ఋషులు ఇచ్చిన పిలుపును నేడు ఇతర మతాలవారు అందుకొని అమల్లో పెట్టుకున్నారు. తమ మతాలను విశ్వవ్యాప్తం చేసుకున్నారు. అసలు పిలుపు ఇచ్చిన వేద మతం, తర్వాత మడిగట్టుకొని తన చుట్టూ ముళ్ళకంచెలు నాటుకొని క్షీణించి పోయింది.

ఇక ''వర్ణం'' గురించి ఒక్కమాట. ఆర్యుల సామాజిక వ్యవస్థలోని వర్ణ విభజన ఆయా వర్ణాల రంగుపై ఆధారపడి జరిగినట్టిది కాదు. రంగే ఇక్కడ ప్రధానమైతే, భారతదేశానికి వచ్చిన వైదికార్యులు మూడువర్ణాలు. మూడు వేరువేరు జాతులని చెప్పవలసి వస్తుంది. వైదికార్యులు ఒక్కజాతి కాక వేరు వేరు రంగు...జాతుల కూటంగా గ్రహించవలసి వస్తుంది. ఈ వాదాన్ని ''బ్రాహ్మణుల యూదుజాతీయత'' గ్రంథం సమర్థిస్తున్నది కూడ. కాని నాకు ఈ వాదం సమ్మతంగా కనిపించడం లేదు.

భారతదేశంతో కలుపుకొని, మధ్యప్రాచ్య – ఐరోపా ప్రాంతంలోని ప్రజలంతా మొత్తం మీద నల్లటి పొడవైన శిరోజాలు, నల్లటి వెడల్పైన కళ్ళు, బూడిదరంగు శరీరాలు కలిగిన ఒకే ''కాకేషియను'' జాతికి చెందిన మానవులు. ప్రపంచంలోని మూల మానవ జాతులు ఐదు అని మానవజాతి శాస్త్ర పరిశోధకులు చెపుతున్నారు. (1) కాకేషియను జాతి (ఐరోపా, ఉత్తరాఫ్రికా, నైఋతి ఆసియా ప్రాంతాలు), (2) మంగోలియను జాతి

(చైనా, జపాను ప్రాంతాలు), (3) ఇథోపియను జాతి (ఆఫ్రికా, ఆస్ట్రేలియా ప్రాంతాలు – నీగ్రోలు వగైరా), (4) అమెరికను జాతి (ఉత్తర, దక్షిణ అమెరికాలో ఆదివాసులు), (5) మలయను జాతి (ఆగ్నేయాసియా ప్రాంతాలు). భారతదేశంలోని వారంతా మొత్తం మీద కాకేషియను మూలజాతివారే. వీరు అనేక వర్ణాలుగా చీలిపోక తప్పనప్పుడు అట్టి చీలిక దేశ కాలపరిస్థితు లను అనుసరించిన జీవిత విధానాలనుబట్టి జరుగుతుందేగాని, వారి రంగునుబట్టి జరగడానికి వీలులేదు.

అందువల్ల, ఇక్కడ వర్ణం కేవలం గుణాన్నీ, అభిరుచినీ, వృత్తినీ సూచించే శబ్దం మాత్రమే. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు నాలుగు వృత్తులను చేసుకుంటూ నాలుగు వర్ణాలకు చెందివుండవచ్చు. ఒకడికి చదువు బాగా అంటుతుంది. ఒకడు వ్యాపారం బాగా చేస్తాడు. ఒకడు మంచి వస్తాదు అవుతాడు. మరొకడు వ్యవసాయం పనిలో నిపుణుడుగా వుంటాడు. ఈ నలుగురూ ఉమ్మడి కుటుంబంలో కలిసి వున్నప్పుడు ఒక పంక్తినే భోజనం చేస్తారు. కాని వారు విడిపోయిన తరువాత ఏ వృత్తివాడు ఆ వృత్తి వాళ్ళతోనే సంబంధ బాంధవ్యాలు కలిగివుంటూ, కాలక్రమాన ప్రత్యేక వర్ణంవాడై పోతాడు.

రామాయణ కాలం నాటికి వర్ణభేదంలేదు. గుణకర్మలను బట్టి భారత జాతి అప్పటికే నాలుగు వర్ణాలుగా విభజించబడివున్నా, వర్ణాలు, వృత్తి పరంగానే వున్నాయిగాని, ఇప్పటివలె కులాలుగా పతనం చెందలేదు. ప్రపంచంలో ఏ మానవుడైనా తన శూద్రత్వం నుంచి బ్రాహ్మణత్వానికి వికసించగల కాలమది. ఆ విధంగా బ్రాహ్మణత్వాన్ని సాధించినవాడే వసిష్ఠుడు.

అయితే, రామాయణంలోని శంబుక వృత్తాంతం మాట ఏమిటని ఎవరైనా ప్రశ్నించ వచ్చు, ఆ వృత్తాంతాన్ని ఎవరో కులతత్త్వవాదులు ఇటీవల రామాయణంలో చేర్చివుంటారని, అది కేవలం ప్రక్షిప్తం మాత్రమేనని నా ఉద్దేశం. శబరి వృత్తాంతాన్ని, శంభుకుని వృత్తాంతాన్ని ఒకే గ్రంథంలో, ఒకే కవి ఎలా వ్రాయగలడు?

ఇప్పుడు శూద్రులుగాను, ద్రావిడులుగాను వ్యవహరించబడుతున్న వారు కూడ ఆర్యులేనని స్పష్టమయింది గదా! ఇక మాల మాదిగలు, అనగా హరిజనులు, పూర్తిగా ఆర్యులేననడంలో అసంబద్ధత ఏముంది? కాగా హరిజనులు ఖచ్చితంగా ఆర్యులే.

హరిజనుల పూర్వులలో మతంగ మహర్షి, ఆదికవి వాల్మీకి, వేద వ్యాస మహర్షి, శక్తి మహర్షి, పరాశర మహర్షి, శుక మహర్షి, భక్త నామ దేవుడు, తిరుప్పాణి యాళ్వారు, శ్రీ రామానుజులవారి ఆదిగురువైన తిరుకచ్చినంబి, రోహిదాసుడు, భక్త నందనారు, సాంఖ్య దర్శన ప్రవక్త కపిల మహర్షి, ధర్మ వ్యాధుడు, శ్రీహర్షుని ఆస్థానంలోని దివాకర మహాకవి, కనకమహాకవి, పల్నాటి యోధుడు కన్నమనీడు, జమదగ్ని మహర్షి – ఇలా ఎంత మందినైనా పేర్కొనవచ్చు.

"..... పంచములే
నెలకొని యేలరె? రాజ్యము
నెలకొల్పరె మున్ను? శౌర్యనిరతులు కారే?"

–నిరుద్ధ భారతం.

"నందుడను నతడు ప్రజలా
నందము నందంగ పాలనము సేయడె? ఆ
నందవరమ్మున నాతని
మందిర చిహ్నమ్ము లిపుడు మాత్రము లేవే?"

–నిరుద్ధ భారతం

ఈనాడు ఆసేతుహిమాచలం వ్యాపించి, ప్రతి గ్రామంలోను, నివసిస్తున్న కోట్లకొలది మంది మాల మాదిగలలో – ధర్మన్నలు, మూర్తులు, కూర్మయ్యలు, సంజీవయ్యలు, బాలయోగులు, జాషువాలు, జ్ఞానానందలు, నీలకంఠలు, వెంకట్రావులు, భాగ్యరెడ్డి వర్మలు, అంబేద్కరులు, జగజ్జీవనరాంలు, సదాలక్ష్మలు, బుల్లయ్యలు – వేలకొలది మంది వున్నప్పుడు, ఆనాడు హైందవ మూల పురుషులలో వందలకొలది మంది మహనీయులు మాల మాదిగలై వున్నారంటే అందులో విశేషం ఏముంది?

నేడు ఆర్య ధర్మం పునరుజ్జీవనాన్ని, పునర్వికాసాన్ని పొందాలంటే మళ్ళీ హరిజనుల నుంచే మహర్షులు, బ్రహ్మర్షులు అవతరించవలసి వున్నదేమో! చరిత్ర పునరావర్తన శీలం కదా?

నేటి మాల మాదిగలను గురించి కూడ ఇక్కడ ఒక మాట చెప్పవలసి వుంది. ఈ రెండు వర్ణాలు కూడ మతంగమహర్షి వంశస్థులే; మాతంగులే. వీరు వర్ణ బాహ్యులుగా, అవర్ణులుగా చేయబడ్డారు కదా? అవర్ణులుగా చేయబడడం అంటే, వృత్తి రహితులుగా చేయబడడమే కదా? ఉత్తమ వృత్తులకు వీరు దూరం చేయ బడడంతో, వెలి వేయబడి ఊరికి అవతల ఉంచబడడంతో, గత్యంతరం లేక ఒక చర్మకార వృత్తినే అవలంబించవలసి వచ్చింది. రాను రాను అందులో కొందరు వస్త్ర పరిశ్రమను స్వీకరించారు. జన సంఖ్య పెరిగే కొలదీ వీరిలో కూడా గుణకర్మ విభాగం జరిగింది. క్రమంగా "తోలు-నూలు" పరిశ్రమలను స్వీకరించి మాదిగ, మాల కులాలుగా పరిణమించారు. ఈ మాల మాదిగ కులం ఒకే కులం. హైందవ గ్రంథాలలో మాల, మాదిగ, చండాల, శ్వపచ, మాతంగ, పుల్కస వగైరా పదాలన్నీ పర్యాయ పదాలుగానే వాడబడ్డాయి.

అయితే ద్రావిడార్య, వైదికార్య తెగల రాకకు పూర్వం మన భారత దేశంలో ఆదివాసులే లేరా, అంటే – సరిగా చెప్పలేం. ఇప్పుడు ఆదివాసులు (Tribes)గా పేర్కొనబడుతున్న వారు అసలు అదివాసులయితే అయి వుండవచ్చునేమో.

"...ఆర్యులు వర్ణించిన ఆ ఆదివాసులకును, ఈనాడు అడవులలోను, కొండలలోను నివసించు అనాగరక జాతుల వారికిని ఆకారములోను, ఆచార వ్యవహారములలోను చాల పోలిక లున్నవి..."

–తెలుగు విజ్ఞాన సర్వస్వం పుట 212

"విద్యా వినయ సంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకేచ
పండితా స్సమదర్శినః"

బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క, చండాలుడు అనే భేదం లేకుండా అందరి యందు పండితులు సమదర్శనులై వుంటారని గీత చెపుతున్నది. అట్టి పండితులు కొరవడడం వల్లనే ఈ మధ్య కాలంలో హిందూ ధర్మం మాసిపోయి, హిందూమతం గిడసబారిపోయింది.

ఆధునిక యుగంలో అట్టి పండితులు తిరిగి ఉద్భవించడం ఆరంభ మయింది. రాజా రామమోహనరాయలు, స్వామీ దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, గాంధీమహాత్ముడు, పిఠాపురం మహారాజా, అభినవ మనువు అంబేద్కరు, మహాకవి మంగిపూడి వేంకట శర్మ, 'మాలపల్లి' రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ, బ్రహ్మర్షి వేంకట రత్నం నాయుడు, "మాలపిల్ల" చిత్ర నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం, కందుకూరి వీరేశలింగం పంతులు మున్నగు ఎంతో మంది తిరిగి ఆర్యమతోద్ధరణకు కంకణం కట్టుకొని పనిచేశారు. ప్రస్తుతం ఎంతో మంది పని చేస్తున్నారు. వేదాత్మ నెరుగని కొద్దిమంది సంకుచిత చిత్తులు, తామే సనాతనుల మనుకుంటూ, ఆర్యధర్మ పునర్వికాసానికి దెబ్బకొట్టే విధంగా చేస్తూ, వ్రాస్తూవున్నా - అనేక మంది వైదికాచార ధర్మపరులైన యువకులు ముందుకు వచ్చి ఈనాడు "కృణ్వంతో విశ్వమార్యం" నినాదాన్ని తిరిగి చేపట్టారు. వారందరికీ నా జోహారులు.

హరిజనులు ఆర్యులేనని, ఆర్యద్రావిడ భేదం కూడ కృతకమైందేగాని నిజమైంది కాదని, ద్రావిడులు కూడ ఆర్యులేనని నిరూపించడం కోసమే నేను ఇదంతా వ్రాశాను. "అసలు జాతి భేదమే లేకుండా, వసుధైక మానవ కుటుంబం, సమ సమాజం ఏర్పడుతున్న ఈ రోజుల్లో ఈ గోల అంతా దేనికి?" అని ప్రశ్నిస్తారేమో, అట్టివారికి నా జవాబు - ఒక నమస్కారం.

ఇంతవరకు యోగవాసిష్ఠం, జ్ఞానవాసిష్ఠం గ్రంథాలు ఉన్నాయి. అందువల్ల ఈ పవిత్ర కల్యాణ గాథకు "రాగ వాసిష్ఠం" అని పేరు పెట్టాను. ఇతివృత్త మూలబీజం పౌరాణికం. నాటక కథాపథకం నా కల్పన.

హైందవ సామాజిక వ్యవస్థలో బ్రహ్మర్షి వసిష్ఠుడు ఒక కొస, మాతంగ కన్య అరుంధతి రెండవ కొస. ఈ రెండు కొసలూ కలిసి ఆర్య ధర్మ చక్రాన్ని పరిపూర్ణం చేసినై. ఈ కళ్యాణం జగత్కళ్యాణ కారకం. ముఖ్యంగా ఆర్యులందరికీ ఆరాధ్యం. అరుంధతీ వసిష్ఠుల లక్ష్యంలో నడిచి పోయిన నా తల్లిదండ్రులను స్మరిస్తూ ఈ నాటకాన్ని నా బాల్యమిత్రులు శ్రీ పేములు గార్కి కృతి ఇస్తున్నాను.

రంగు వెలుగుల ఏర్పాట్లు, మైకు వుంటే ఈ నాటక ప్రదర్శన ఆనందకరంగా వుంటుంది. ప్రతి రంగంలోను బ్రాకెట్లలో ఇవ్వబడ్డ సూచనలు సందర్భాన్నిబట్టి మైకులో తెరవెనుక నుంచి చెప్పబడుతూ వుంటే, ప్రేక్షకులకు కథ విపరణ జరుగుతూ వుంటుంది.

"ఎల్ల హిందువులను ఉపాసించు దేవ
గణములోపల మాతంగకన్య లేదె"

–నిరుద్ధ భారతం

"మాణిక్య వీణాం ఉపలాలయంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసాం
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి."

"మాతా, మరకత శ్యామా,
మాతంగీ, మధుశాలినీ,
కుర్యాత్ కటాక్షం కల్యాణీ,
కదంబ వనవాసినీ?"

"జయ మాతంగ తనయే!
జయ నీలోత్పలద్యుతే!
జయ సంగీత రసికే!
జయ లీలాశుక ప్రియే!"

–కాళిదాసు

"మాతంగముని కన్యకాం
మధురభాషిణీం ఆశ్రయే"

–శంకరాచార్యులు

"జయమాతర్విశాలాక్షి!
జయ సంగీత మాతృకే!
జయ మాతంగి! చండాలి!

గృహీత మధుపాత్రకే!"

-శ్యామలస్తోత్రం

ఈ విధంగా మాతంగ కన్య పరమేశ్వరి అవతారంగా, ఆదికాలం నుంచీ అనూచానంగా స్తుతింపబడుతున్నది.

"మనసై వేదమాప్తవ్యం
నేహ నానాస్తి కించన
మృత్యోః స మృత్యుం గచ్ఛతి
య ఇహ నా నేవ పశ్యతి"

-కఠోపనిషత్తు

(మనస్సుచే మాత్రమే ఆ బ్రహ్మను పొందగల్గుచున్నాము. అప్పుడీ నానాత్వమే లేదు. ఎవరు ఈ ప్రపంచమందు నానాత్వమును చూచుచున్నాడో, వాడు జనన మరణ రూప సంసార దుఃఖములో పడిపోవుచున్నాడు.)

"ఈశావాస్యం ఇదం సర్వం
యత్కించ జగత్యాం జగత్,
తేన త్యక్తేన భుంజీథా!
మా గృధః కస్య స్విద్ధనం."

(సమస్త విశ్వమునందును ఏ కొలది చరాచర వస్తుజాలము కలదో, అది అంతయు భగవంతునిచే ఆచ్ఛాదితము. కనుక, భగవత్ప్రసాదితమైన దానిని త్యాగ బుద్ధితో అనుభవింపుము. ఎవ్వని ధనము కొరకును ఆశింపకుము.)

-ఈశావాస్యోపనిషత్తు.

విద్యా ప్రదాన సమయే శరదిందు శుభ్రాం
లక్ష్మి ప్రదాన సమయే నవ విద్రు మాభాం
విజయ ప్రదాన సమయే తమాల నీలాం
దేవీం త్రిలోక జననీం శరణం ప్రపద్యే!
"కృణ్వంతో విశ్వమార్యం"

- బోయి భీమన్న

# అంకితం

ఆత్మీయులు, అమృత హృదయులు
శ్రీ సాక పేములు గారికి

ముద్దుగ మూడు కాలముల
మ్రొక్కులు గైకొను నా వసిష్ఠకున్
ఇద్దరి నీవు, అద్దరిని
నేను ; మనిద్దర మొక్క సారపుం
బద్దెము రీతి ; కాన, కృతి
బాలను దీని గ్రహింపు మయ్య, సం
పద్బుధ మైత్రి : మీ కగు శు
భమ్ములు; పేములు వర్య ! ప్రేమమై !

– భీమన్న

❋ ❋ ❋

## పాత్రలు

అరుంధతి

వసిష్ఠుడు

సంధ్య

పరమ శివుడు

ప్రాచీనుడు

శివోహం

కులగిరి

గోష్పాదం

కుంభోదరం

మునులు

ప్రజలు

# రాగ వాసిష్ఠం

## ప్రథమ దృశ్యం

(తెర లేవడానికి ఒక నిమిషం ముందునుంచే లోపలినుంచి పాట వినిపిస్తూ వుంటుంది. తెర లేచిన తరువాత కూడ పాట వినిపిస్తుంది. రంగం వేదవన కీకారణ్యంలో అరుంధతి ఆశ్రమం. దూరంలో కొండలు, సమీపంలో యమునానది. వృక్షలతా గుల్మాదులతో ప్రకృతి చాలా సంకీర్ణం. ఋతువు వసంతం. సమయం ప్రత్యూషం. రకరకాల, రంగు రంగుల పువ్వులతో దృశ్యం మనోహరం. చెదరి పోతున్న చీకట్లను తరిమికొడుతున్న చిత్రకాంతులు నేత్రపర్వం చేస్తూ వున్నై, దూరంగా వినిపిస్తున్న పాట కొంచెం కొంచెం దగ్గర అవుతూ వుంది. పాడుతూ, ఆడుతూ సంధ్య రంగంలోకి ప్రవేశిస్తుంది. ఆమె శీతాకోక చిలుక వలె, రంగు రంగుల తీగవలె రమణీయంగా వున్నది. ఆమె నృత్యాన్ని మయూరాలు, గానాన్ని కోకిలలు అనుసరిస్తూ వున్నై. మధ్య మధ్య "సఖి, మేలుకో" అని ఆమె అన్నప్పుడు ప్రకృతి అంతా "కో" అని ప్రతి పలుకుతూ వున్నది.)

సంధ్య : (పాట)

మేలుకో !
సఖి ! మేలుకో !!
ప్రశాంతముగ మేలుకో !
ప్రసన్నముగ మేలుకో !
సుఖముగ, సుందరముగ – బా
సుర తరముగ మేలుకో !
మేలుకో ! సఖి ! మేలుకో !!
స్వప్న చరిత్రల పుటలకు
స్వర్ణయుగమ్ములు ఘటించి

అలసిన నీ రథము మలిపి,
ఆవలి పొలిమేర నిలిపి
మేలుకో ! సఖి ! మేలుకో !!
మందార వనాంతరమున
ఇందిర కాహ్వాన మిచ్చి,
కైలాసపు గడపనుండి
గంగకు స్వాగతము చెప్పి
మేలుకో ! సఖి ! మేలుకో !!
నీ సేవకు సతీదేవి
వాసంతిక బంపించె
వాణీకర వీణావర
వాదము లిట విహరించె !
మేలుకో ! సఖి ! మేలుకో ! !
సర్వవిశ్వ సౌందర్యము
సల్పుచున్న దిదె నృత్యము
ప్రాతస్సుఖ హేతువుగా
ప్రాజ్ఞానిక గీతవుగా
మేలుకో ! సఖి ! యేలుకో !!

(నృత్యం చేసుకుంటూ సంధ్య నిష్క్రమిస్తుంది. ఉజ్జ్వలమై వున్న రంగంలోకి యువ ఋషి వసిష్ఠుడు ప్రవేశిస్తాడు. మిరుమిట్లు గొల్పుతున్న పుష్పకాంతుల్ని తిలకిస్తాడు. ఘుమఘుమ లాడుతూ మత్తెక్కిస్తున్న సుగంధాన్ని ఆఘ్రాణిస్తాడు. కర్ణపేయంగా సంధ్యను కీర్తిస్తున్న శకుంతగీతాలను ఆకర్ణిస్తాడు. ముగ్ధుడవుతాడు. చల్లని మలయానిలం అతణ్ణి పరవశుణ్ణి చేస్తుంది. అనుకోకుండానే అతని కంఠం మ్రోగుతుంది. అమృతనాదం మధుర రుచుల్ని అతడు ఒక్కొక్క గ్రుక్కే ఆస్వాదిస్తాడు.)

వసిష్ఠుడు : (పాట)

అరుణోదయమున కీ
అనురాగ మెచటిదో ?
అడవితీగల కింత
అమృతత్వ మేమిటో ?
దుర్గయే మెచ్చి వరమిచ్చెనో ?
స్వర్గమే వచ్చి యిట విచ్చెనో ?
పల్కరించెను పువ్వు !
పరిమళించెను పాట !
వేదనాదము లోనె
వేణురవము జనించె ?
ఆగమములే పరవశించెనో ?
రాగాత్మయే పుట్టువందెనో ?
హేమంత యామినీ
సీమంత రేఖపై
కనుమూసి తెరచి నం
తన ఇంత సొబ గేమి ?
ఇంద్రియమ్ములు తెన్ను దప్పెనో ?
ఇంద్రజాలము కన్నుగప్పెనో ?

(పాడుతూనే పరిక్రమిస్తాడు. పాత్రధారులే కొత్తగా కనిపిస్తున్నై ! నిన్నలేని ఈ రామణీయకం నే డెక్కడనుంచి వచ్చింది ? ఎప్పుడూ అతడు గుర్తించని ప్రతి గడ్డిపోచ ఇప్పుడు అతణ్ణి పట్టి నిల్పుతున్నై! ఎవరది ? కళ్ళు జిగేలు మన్నై ! ముఖం తేజోవంతం అయింది ! ఆపాదమస్తకం అరుణరాగం తరంగిత మయింది. ఉదయాద్రి పురిటిగృహంలో అతడు బాలభానుడే అయినాడు ! ఎవర్నో చూస్తున్నాడు ! ఎంత సేపు అలా చూశాడో ! "మేలుకో" అన్న పాట వినిపించి అతడు వెనక్కి తిరిగాడు ! సంధ్య పాడుకొంటూ,

నృత్యం చేసుకొంటూ వస్తున్నది ! మొదటి దిశకేసి చూశాడు. అక్కడ ఏమీ కనిపించలేదు. తిరిగి సంధ్యను చూశాడు. అప్పటికే సంధ్య రంగంలో ప్రవేశించింది. ఆమె ఎర్రని దుస్తులు ధరించి వుంది.)

సంధ్య : (పాట)

మేలుకో !
జగ మేలుకో ! !
బాలహరిణి చరణములను
పడి నలిగిన తృణ లవమా !
పుంస్కోకిల కంఠములో
పొరమారిన పల్లవమా !
మేలుకో !
జగ మేలుకో ! !
మధువనమా ! మేలుకో !
మధుకరమా ? మేలుకో !
మహితాధ్వగ నవపార్థివ
మానవమా ! మేలుకో !
మేలుకో !
జగ మేలుకో ! !
ప్రేమలతా కుటీరమా !
హేమపాత్ర పటీరమా !
ధరాదార ధారాధర
ధార్మిక చైతన్యరమా !
మేలుకో !
జగ మేలుకో ! !

(వసిష్ఠుడు తన్మయుడైనాడు. నృత్యంతో, గానంతో, అతని చుట్టూ ఒకటి రెండు సార్లు తిరిగి, సంధ్య అలానే నిష్క్రమించింది. భక్తిభావంతో అంజలి ఘటించి, ఆమెను

అనుసరిస్తున్న దృక్కుల్ని మరల్చుకొనే ప్రయత్నంలో, అతడు నిల్చుని చూస్తున్నాడు. అంతలో రెండోవైపు నుంచి "సంధ్యా !" అనే పిలుపు మధురాతి మధురంగా వినవచ్చింది. ఝుమ్మున తుమ్మెదవలె చెదరి అతని చూపులు వనమంతా గాలించై, దూరంలో. అంతకుముందు తనను రంజించిన రాగరాశిదే ఈ మధురాంచిత శబ్దంగా అతడు భావించాడు - ఈమె సంధ్య ! ఆమె ఎవరో ?)

వసిష్ఠుడు : సంధ్య ఏ సమయాని కా రమణీయ రూపం ధరించి, ధరిత్రిని రంజించే పరాశక్తి ! రాశిపోసిన ప్రకృతి సౌందర్యం రమణీమణిగా నర్తిస్తున్నది నా చుట్టు !

ఇందింది రానంద తుందిలమ్ములు, సుంద
రామంద మంజీర రవళిగాగ ;
మందమారుత చలన్మాకంద నవదళ
స్తబకమ్ము, శాటీ ప్రశస్తిగాగ ;
తరు శిరస్సీమంత వరపుష్పరస బిందు
రుచి, లవన్మణిహార రోచిగాగ ;
కిసలయాలయ కళాకృతి రాగమెత్తు కో
కిల గీతి, ప్రియనాట్య గీతిగాగ;
ఉదయభాను సదాగమనోత్సవమున
నాట్యమాడగసాగె సంధ్యాకుమారి !
మకుట కుసుమ రజమ్ములు మహికి రాల,
మహి రజమ్ములు మకుట సుమాల జేర !

ఈ నాట్యంలో నే నొక భంగిమను. ఈ సౌందర్యంలో నే నొక రేఖను. ఈ గానంలో నేనొక సంగతిని.

(నిమీలిత నేత్రుడైనాడు వసిష్ఠుడు - దూరంలో ఉషస్సం కీర్తనం మధురంగా వినవస్తున్నది - అతడు అలానే అంజలి ఘటించి నిలిచి ఉన్నాడు.)

(తెరలో : గీతం)

**ఓ ఉషా ! ఓ ఉషా ! ఉండనే సుంత**
**కరిగి పోనేలనే కనుతెరచి నంత ?**
**రాత్రి దెందము లోన రాగాంకురమవు**
**విశ్వ మోహనముగా వికసించినావు**
**అరుణోదయ మ్మదే అరదమై వచ్చెనే**
**జనమెల్ల నీ మీదె కనుపెట్టి లేచెనే !**
**ఓ విశ్వజీవనీ ; మా వందనము లివే,**
**అందుకొని నీ కరుణ అవని కందీయవే !**

(సంకీర్తనం చేస్తున్న ఆ దివ్యసుందరిని తన మనః ఫలకం మీద దర్శిస్తున్నా డతడు. యపూర్వానుభూతిలో మునిగి అతడలా ఎంతసేపున్నాడో ! గుండె గుభెల్లుమన్న ఏదో ధ్వని అతణ్ణి మేల్కొల్పింది.)

(తెరలో : ఒక కంపిత కంఠధ్వని)

సంధ్యా ! సంధ్యా ! అరుంధతి సుడిగుండంలో చిక్కుకొన్న దమ్మా!

(తెరలో : సంధ్య కంఠధ్వని)

ఆఁ ! ఏమిటి ! !

**వసిష్ఠుడు :** ఆఁ ! ఏమిటి ? ?

(ప్రకృతి ఆందోళిత అయింది. వసిష్ఠుడు ప్రకంపితుడైనాడు. దిక్కులు పరికించినాడు. ధ్వని వినవచ్చిన దిశకు అతని పాదాలు పరుగుతీసినై. అంతవరకు అతడు నిలబడ్డ తావునుంచి చిమ్మిన ఎఱ్ఱని కిరణాలతో రంగం విప్లావిత మయింది – లోపల ఉరుములు, మెరుములు, జలపాతాల హోరు. దృశ్యం క్రమంగా చీకటైపోయింది.)

## ద్వితీయ దృశ్యం

(చీకటి క్రమంగా విడిపోయి, చల్లని కాంతి రంగంలో ప్రసరిస్తుంది. చాలవరకు అదే దృశ్యం. దూరంలో నది సమీపంలో సరోవరతీరం, పరిసరం ఆశ్రమ లక్షణ విలసితం. మొదటి దృశ్యం ముగియ డానికి, ఈ దృశ్యం ప్రారంభం కావడానికి మధ్య వ్యవధానం ఎంతో లేదు. అరుంధతిని చేతులలో పెట్టుకుని వసిష్ఠుడు ప్రవేశించాడు. ఇరువురి వస్త్రాలు తడిసివున్నై. తగిన స్థలం కోసం పరికించాడు. మెత్తని పచ్చికపై పరుండబెట్టాడు, నాడి పరీక్షించాడు. ఏమీ తోచడంలేదు, దేని కోసమో చుట్టూ పరికించాడు. సంధ్య రెండో ప్రక్కనుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది. "అక్కా, అక్కా" అంటూ- వసిష్ఠుణ్ణి చూచి హఠాత్తుగా ఆగిపోయింది.)

సంధ్య : మీరా ! మా అక్కేది ? (వసిష్ఠుడు సమాధానం ఇవ్వక ముందే అటూ, ఇటూ చూచి) అమ్మో ! ! (అరుంధతిని సమీపించి తన పమిటెతో శరీరం ఒత్తుతుంది ) అక్కా ! అక్కా ! అమ్మో !!

వసి : మీ అక్క కేమీ భయంలేదు. గోల చెయ్యకు. (ఇంతలో కొన్ని చిగురు గుత్తులను తామరాకులకు చుట్టి అరుంధతి తలక్రింద దిండుగా పెట్టాడు)

సంధ్య : (కంగారుగా) ఇప్పుడెలాగ ? ఏమి చెయ్యాలి ?

వసి : ఏమీ చెయ్యనక్కరలేదు. కొంచెం విశ్రాంతి తీసుకోనీ.

సంధ్య : అమ్మో ! నీళ్ళు త్రాగిందేమో ! ఏదో చికిత్స చెయ్యకుండా ఎలా? మీరెవరో మహర్షులు ! త్వరపడండి, స్వామీ ! మీ మేలెన్నటికి మరువం.

వసి : (మళ్ళీ నాడి చూచి, పెదవులపై చిరునవ్వు కనబరుస్తూ) మీ అక్క సామాన్యురాలు కాదు - తరంగం గుంజుకోగానే జలస్తంభనం గావించి సమాధి లోకి పోయింది - మెల్లగా బోధిల్ల గలదు. మీరు వనదేవతలా? జలదేవతలా ?

(అంతలో అరుంధతి రెప్పలెత్తుతుంది - రంగం తళుక్కు మంటుంది.)

సంధ్య : అక్కా ! అక్కా ! (సంతోషంతో అరుస్తుంది.) ఎంత ప్రమాదం గడిచిందక్కా !

అరుం : సంధ్యా ! (ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ) ఏమి జరిగిందమ్మా? (జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ, తిరిగి కళ్ళు మూసుకొంటుంది.)

వసి : ఇక భయంలేదు. నేను పోయి వస్తా.

(ఈ మాటలు వినబడగానే తత్తరపాటుతో అరుంధతి లేచి నిలబడుతుంది. అంతవరకు ఆమె వసిష్ఠుణ్ణి చూడనే లేదు. తన దగ్గర కూర్చుని ముఖంలో ముఖం పెట్టుకొని వున్న సంధ్యను మాత్రమే చూచింది. ప్రథమంగా అతణ్ణి ఇప్పుడు చూచింది. సంభ్రమాశ్చర్యాలు విద్యుత్తరంగాల వలె శరీరమంతా వ్యాపించాయి. రెప్పపాటు కాలం నిశ్చేష్టురాలైంది. వసిష్ఠుడు కూడ సమ్మోహితుడై ఆమెనే చూస్తున్నాడు. నదీ గర్భం నుంచి తాను రక్షించిన తపస్విని కాదీమె ! మరింకెవరు ? అయితే ఇంత క్రొత్తగా కనిపిస్తున్న దేమిటి ? ఉషః కాంతిలో సంధ్యకన్న ముందు తాను దర్శించిన దివ్యమూర్తి ఈమేనా!)

సంధ్య : అక్కా! ఆపద్బాంధవులకు అభివందనం చెయ్యి !

అరుం : ఋషి కుమారుల ఋణం తీర్చుకోలేం (అంజలి ఘటిస్తుంది)

వసి : (తిరిగి అంజలి ఘటిస్తూ) నన్ను మీరు క్షమించాలి. మీరు సామాన్య మానవులనుకొని రక్షణ చర్య కుద్యమించాను. నా అజ్ఞతను మన్నించి...

సంధ్య : మన్నించం.

అరుం : (కోపంగా) సంధ్యా ! ఎవరితో మాట్లాడుతున్నావు ?

సంధ్య : ఆర్తత్రాణ పరాయణుడు, అఖండ తపోధనుడు, అద్వితీయ సత్త్వ సంపన్నుడు, అరుంధతీ ప్రాణ ...

అరుం : (తీవ్రంగా) చాలించమ్మా, చాలించు. (వసిష్ఠునితో) ఆర్యా! ఈమె మర్యాద తెలియని మంకు పిల్ల - క్షమించ గోరుతున్నాను.

సంధ్య : పోనీ ఎందుకైనా మంచిది, క్షమించండి. ఇక ఆశ్రమానికి పోవడం ఉత్తమం. అతిథి సత్కారం తరువాత యథేచ్ఛగా మాట్లాడు కోవచ్చు.

వసి : (పరధ్యానంగా) సంధ్యా !. (నాలుక కరచుకొని) బాలామణీ !

సంధ్య : (నవ్వుతూ) ప్రమాదం ఏదీలేదు - పిలవడానికే కదా పేరు ? మమ్మల్ని - ముఖ్యంగా నన్ను పేరుపెట్టే పిలవండి. మా అక్కయ్య సంగతి నాకెందుకు?

అరుం : (వసిష్ఠునితో) ఇక మనం ఆశ్రమానికి వెళ్ళడమే...

వసి : (సందేహిస్తూ) ఏ ఆశ్రమానికి ?

సంధ్య : (కొంటెగా) మీ ఆశ్రమానికి ఏం? రానివ్వరా ?

వసి : (పులకితుడై) అంత అదృష్టమా నాకు ? (అరుంధతివైపు చూస్తూ) నిజంగా మీరు మా ఆశ్రమానికి రాగలిగితే అప్పుడు ఆశ్రమ జీవితం ఎంత సుఖంగా వుంటుంది ! తపస్సు ఎంత ఆనందప్రదం అవుతుంది!

(దూరంగా, ఎక్కడో, ఏదో పిలుపు వినిపిస్తుంది.)

సంధ్య : (ఆలకించి) ఎవరో పిలుస్తున్నట్లున్నది. నేను చూచి వస్తాను.

(పరుగెడుతుంది. అరుంధతి, వసిష్ఠుడు ఒంటరిగా వుండి పోతారు. ఒకరినొకరు చూచుకుంటారు. సహజ ఆకర్షణ, పరస్పర భక్తి తప్ప వారి మధ్య మరే భావమూ లేదు. వసిష్ఠుడు బాలకుడైనా మహర్షి. అరుంధతి బాలికయైనా తపస్విని. స్త్రీ పురుష భావమే వారికిలేదు. కాని, ఒక మహాశక్తి వారిని బంధించింది. ఒకరి చూపులు ఒకరి సౌందర్యసీమలో చిక్కుకున్నై. అలా ఏకానుభూతిలో వారు ఎంతసేపు ఆనందించారో తెలియదు - క్షణకాలపు ఆత్మైక్యం అనంత యుగాల పరిచయంలా స్పందించింది.

సంధ్య ఎప్పుడు వచ్చిందో వారు గుర్తించనేలేదు. ఆమె ఇద్దరికేసి పరీక్షగా చూచి, అరుంధతి చేయి పట్టుకొన్నది.)

అరుం : (తెప్పరిల్లి) సంధ్యా !

వసి : (నిట్టూర్చి) ఇక నేను పోయిరానా మరి ?

సంధ్య : ఎక్కడికి ?

అరుం : మా ఆశ్రమానికి రా రా ?
(మళ్ళీ దూరంలో పిలుపు)

వసి : ఆ పిలుపు నా కోసమే – నా సహాధ్యాయి నా కోసం వెతుక్కుంటూ వస్తున్నాడు. ఇక నేను తడయడం బాగుండదు.

అరుం : మా ఆతిథ్యం ?

వసి : మరొకసారి.

సంధ్య : పునర్దర్శనం ?

వసి : రేపే !

(నిష్క్రమిస్తాడు. అరుంధతి. సంధ్య అతడు వెళ్ళినదారి వెంట చూస్తూ నిలబడినాడు. అరుంధతి దగ్గర గల ఒక పూల తీగను ఆనుకొన్నది, ఇంకా ఆమె తేరుకోలేదు. స్నానఘట్టం లోని దుస్సంఘటన, తరువాతి అపూర్వ మధురానుభూతి ఆమెను అయోమయం చేసి వేసినై. ఆ వదన రంగంలో ఆలోచనలు నాట్యంచేస్తున్నై. చెక్కుటద్దాలలో మందారాలు రూపురేఖలు దిద్దుకొంటునై౹. నిమీలిత నేత్రాలతో కట్టెదుటి సరోజాలు వికసిస్తునై౹. బాగా తెల్లవారిపోయింది. అర్ధనయనాలతో ఆమె దివ్య సౌందర్యాన్ని ఆలోకించింది సంధ్య. ఉత్తేజితు రాలై అరుంధతి చెక్కిలి మీటి, ఆమె చుట్టూ నాట్యం చేస్తూ పాడ సాగింది.)

సంధ్య : (పాట)

మేలుకో !
చెలి మేలుకో ! !
విచ్చినదే తామరసము
తెచ్చినదే ప్రేమరసము,
ముచ్చటగా వెదకి వెదకి
తెచ్చినదే నీ పెదవికి !
మేలుకో !
చెలి మేలుకో ! !
కనకాంబర కోరకమున
కలనిజమై వచ్చినదే !
నీలాంబర పళ్ళెరమున
నీ కోసము నిల్చినదే !
మేలుకో !
చెలి మేలుకో ! !
గుండియలో గూడు కట్టి
కోకిల గొంతెత్తె నేడు
ఆనందము గజ్జెకట్టి
అందియ మ్రోయించె చూడు !
మేలుకో !
చెలి మేలుకో ! !

(రంగం అరుంధతి నిరునవ్వు కాంతితో నిండిపోయి, క్రమంగా దృశ్యం అదృశ్యమైపోతుంది.)

# తృతీయ దృశ్యం

(వేదవనంలో మరోదట్టమైన అరణ్యాభాగం, ప్రొద్దు పొడుపు వేళ – చెట్ల నీడల్లో చేరుకొని ప్రక్కలు పరచుకొంటున్నై చీకట్లు. వాటిని చూచి ఈలపురుగులు ఒక్కటే మోతగా మొరుగుతున్నై, గుడ్లగూబలకు చత్వారపు జోళ్ళను కుదురుస్తున్నై సాలెగూళ్ళు. తన మకాం లేపుకొని ఉషఃకాంతి రూపంతో తరువాతి మజిలీకి పోతున్నది రాత్రి. యజమాని వచ్చిన కార్యాలయం వలె సూర్యోదయంతో అరణ్యం సద్దణగింది. దూరంలో సూర్య నమస్కారం వినిపిస్తున్నది. క్రమంగా అది సమీపిస్తుంది. ఒక శ్లోకాన్ని బిగ్గరగా వల్లించు కుంటూ కులగిరి ప్రవేశిస్తాడు. దిక్కులు చూస్తూ, మధ్య మధ్య బెదురతూ వుంటాడు.)

కులగిరి: (శ్లోకం)

"బ్రహ్మస్వరూప ముదయే
మధ్యాహ్నేతు మహేశ్వరమ్
సాయం ధ్యాయే త్సదా విష్ణుం
త్రిమూర్తించ దివాకరమ్. "

(వడి వడిగా కొంతసేపు వల్లించి)

ఆ అబ్బా ! వెధవ చదువు, చదువుకంటే చ్చాకలిపని మెరుగు. (దిక్కులుచూస్తూ నడిచి, కాలికి ఏదో తగిలి బోర్లపడి, లేచి దులుపు కొంటూ వుండగా, చాల దూరంలో ఏదో పాట వినిపిస్తుంది. ఉలిక్కిపడి చుట్టూ పరికిస్తాడు. ఆలకిస్తాడు, ఏమీ వినిపించదు – ఏదో కనిపెట్టినట్టుగా తల పంకిస్తాడు.)

తెలిసింది. వ్వాళ్ళే ! వ్వసిష్ఠుడే అదృష్టవంతుడు ! అతడి తపస్సు ఫ్ఫలించింది. 'రంభనో, ఉఊర్వశినో, కనీసం ఏ తిలోత్తమనో సంపాదించుకో లేకపోతే త్తపస్సెందుకు తగల బెట్టను?

వ్వాడొస్తే కనిపించే దేవకన్యలు నాక్కనపడరేం ? నేను ప్రొద్దెక్కి రావడమే క్కారణం కావచ్చు. వ్వెధవది, మ్మెలుకువే రాదు! ఏనాటి కానాడే - వ్వెధవ ప్రొద్దు రోజూ ఎక్కిపోతూనే వుంది. నేడేమైనా సరే, ఆ సౌందర్యవతుల్ని చూడకుండా వ్వెళ్ళను.

(కొంచెం ముందుకు నడుస్తాడు - సంకోచంతో ఆగు తాడు.)

వ్వసిష్ఠ దక్కడే వ్వుంటే ? వ్వాళ్ళ స్నేహం ల్లభించిన నాటి నుంచీ అక్కడే అతడి మ్మకాం ! సంధ్యావందనానికని అర్థరాత్రే బైలుదేరతాడు. జ్జాం ప్రొద్దెక్కి వ్వస్తాడు ! శ్శమిధలకని పోతాడు. సంధ్యవార్చి వస్తాడు ! వ్వహ్వా ! వ్వశిష్ఠా ! ఏం ఇంద్రభోగ మోయ్!

(మరికొంత దూరం పోయి)

ఆఁ ! ఇదేదో ఆశ్రమంలాగే వుంది. అది ఇదే కావచ్చు- (శబ్దం) వ్వస్తున్నారనుకుంటాను. ఏం చెయ్యాలో ! ఎలా ప్పులకరించాలో !

(శబ్దం వినిపించిన దిశనుంచి ఏదో ఒక మృగం బైటికివచ్చి కులగిరిని చూచి పారిపోతుంది, వెనుకనుంచి "కాంద్రు" మనే అరుపుతో శివోహం రంగం లోకి దూకుతాడు, కులగిరి కంగారెత్తిపోయి, "బ్బాబోయ్" అంటూ గెంతి, శివోహాన్నే కౌగలించుకుంటూ.)

**శివో** : (కులగిరి వీపు తడుతూ) భయంలేదు. భయంలేదు. వత్సా ! నేనున్నాను. నేనున్నాను.

**కుల** : (కళ్ళు తెరవకుండనే) ఎ ఎవరు నీవు ? ఎక్కడున్నావు ?

**శివో** : ఇక్కడున్నాను. ఎక్కడా వున్నాను.

**కుల** : అంటే ?

**శివో** : నీలో నాలో, నీ భయంలో, నా అభయంలో - అన్నట్టు మరచి పోయాను. ఇదిగో అభయ హస్తం - (చేతిలో చేయి వేస్తాడు)

కుల : (శివోహం వంక బాగా చూస్తూ) న్నీ వెవరు ?

శివో : నేను పక్షిని కాను, మృగాన్ని కాను, జలచరం అంత కంటె కాను, మనిషినోయ్, మనిషీ ! నేను మనిషిని ! !

కుల : న్నిన్నిదివర కెప్పుడూ చ్చూడలేదు.

శివో : ఈ మహా విశ్వంలో నీవు చూడగలిగిందెంత ? ఐనా నీ వీ పల్లె కెప్పుడూ రాలేదు.

కుల : ఎ ఏ పల్లె ?

శివో : మ్మాదిగపల్లె.

కుల : అంటే ?

శివో : మాతంగ వాటిక –

కుల : (ఒక్క గంతులో దూరంగా తప్పుకుంటూ) చ్ఛంపావురా, కోతివెధవా ! చ్ఛంపావు !

శివో : (కొంటెగా నవ్వుతూ) నీవింకా అటు వెళితే నిజంగానే చస్తావు.

కుల : ప్పోరా – పోకిరీ !

శివో : నిజమేరా, అటు వెళ్ళకు, అక్కడ ఇప్పుడె ఒక పెద్దపులిని కట్టేసి వచ్చాను. ఇందాక నిన్ను భయపెట్టిందదే !

కుల : (జంకి) మ్మరి నీవు మ్మీదకు రాకు.

శివో : వస్తే ?

కుల : ప్పులి నోట్లో నన్నా చ్చస్తాను గాని, నిన్ను ముట్టుకోను.

శివో : ఏడిసినట్టుగా వుంది – నీ సిద్ధాంతం – ఎవడు బోధించాడురా నీ కది ? మనిషిని తాకవ్ ? పెద్దపులి నోట్లో చస్తావ్ ? వహ్వా ! వహ్వా! ! అయితే, చావు !

కుల : న్నువ్వు చ్ఛండాలుడివి - చండాలస్తు జనితో - జనితో - జ్జనితో - (జ్ఞాపకం రాదు పాపం.)

శివో : ఏదోలే ఏడుపు. మనిషినుంచి మనిషిని విడదియ్యడానికి మహా వాక్యాలు ఉదహరించక్కర్లేదు.

(తెరలో పెద్దపులి అరుపు, తర్వాత ఒక బాల పిలుపు - "ఒరే శివోహం! దాన్ని విడిచి పెట్టెయ్యరా !" అని)

కుల : (కంగారుగా) ఒరే ! బ్బాబు ! న్నేను పారిపోయే దాకా ద్దాన్ని వ్విడిచి పెట్టకురా ! న్నీకాళ్ళకు మొక్కుతా ! (వెనక్కి తిరిగి పారిపోతాడు)

శివో : (పగలబడి నవ్వుతూ) ఓరి, నిన్ను తగలెయ్యా ! నిన్ను తరిమే పెద్దపులి బైటిది కాదురా - లోపటిదిరా, నీ లోపటిది !! (అదే నవ్వడం నవ్వుతాడు.)

## చతుర్థ దృశ్యం

(వేదవనంలో అరుంధతి ఆశ్రమం. ఫలపుష్ప భరితమైన వృక్షలతా గుల్మాదులతో మనోహరంగా వుంటుంది. వివిధ మృగ శకుంత సంతానం గీత నృత్యాలను నేర్చుకొంటూ వుంటాయి. ఆకీట మృగరాజం అక్కడ తమ ధర్మాల్ని అభ్యసిస్తూవున్నై. దూరంలో పాట వినిపిస్తుంది - దట్టమైన వనంలో కాలాన్ని గుర్తించలేం - దృశ్యంలోని వెలుగు నీడలు మధ్యాహ్న సమయాన్ని సూచిస్తున్నై. ఆ కంఠ స్వరం అరుంధతిదే ! ప్రకృతి అంతా సావధానంగా వింటున్నది. రంగంలో ప్రవేశించింది, అతిలోక సౌందర్యవతి అరుంధతి ! ఓహో, ఆ తేజస్సు ! ఆ రమ్యాలోకన దివ్య ప్రభ ! వినీల మేఘ రాశిలో మిలమిల స్రవించిపోతున్న విద్యుల్లహరి వలె ఆమె తళుక్కుమంటున్నదా వృక్షచ్ఛాయలలో మధురగానంలో తేలిపోతూ, మందార పుష్పాలు రెండందుకొన్నదామె.)

**అరుంధతి:** (పాట)

**మందారమ ! ఒక మంజరి నీవే !**
**మల్లీ ! వాడని మాలను తేవే !**
**మత్తిలకే ఓ మత్తకోకిలా !**
**మాకందమె నీ కందము చాలా .**
**ఉత్పల మాలిక లొప్పునటే ? ఈ**
**చంపక మాలిక చాలు నటే ?**
**విశ్వములోగల పుష్పములారా !**
**వేంచేయరె పీయూషము లూర ! !**

(ఒక పాత్రతో సంధ్య ప్రవేశిస్తుంది. అత్యాశ్చర్యంతో అరుంధతిని తిలకిస్తుంది. సంధ్యకు కూడ ఇది అపూర్వ దృశ్యమే !)

సంధ్య : ఓహో ! వసంత దేవత నాట్యం చేస్తున్నది ! వసిష్ఠుని స్నేహంతో ఆమె పూర్తిగా నూతన వ్యక్తి అయింది ! క్షణ క్షణమూ అపూర్వోత్క్రాంతిని పొందుతున్నది !

అరుం : (ఒక పువ్వును చూపుతూ) సంధ్యా ! దీన్ని చూడు ! ద్యోవీథి నుంచి దోసిట్లో రాలిన చంద్రబింబ మనుకొంటున్నావా దీన్ని ? (నవ్వుతూ) కాదు, ఇది పువ్వే !

వరవసంతము లెన్ని వచ్చిపోయెను కాదు ?
ఏ ఋతువు తెచ్చెనే ఇంత నూతనశోభ ?
ఏ సుధావర్ష ధారా సేచనమొ కాని
మార్చివైచిన దాశ్రమము నొక్కపొద్దులో !

సంధ్య : సత్యమే. ప్రకృతికి అనుగుణంగా నీవు కూడ మారావు !

అరుం : నీవు కూడ.

సంధ్య : నీకు అనుగుణంగా !

అరుం : కాదు, కాదు,

పికము పాడుటకు, వల్లిక పల్లవించుటకు
సంబంధ మేమిటే, సంధ్యాకుమారి
పరిణతిని జెందుచుందురు ఎవ్వరికి వారె,
నవమాస మందు నీ నా భేద మెచటిదే ?

సంధ్య : ఏమో, నా సంగతి నాకు తెలీదు. నీవు మాత్రం ఇదివరకు కాళీశ్వర పూజాపరురాలవు. ఇప్పుడు కల్యాణ నాట్యదేవతవు.

అరుం : కాళీశ్వరుడు నటరాజు కాడా ?

సంధ్య : నటరాజుకు నాట్యమే కానుక. నీ ఉపాసనకు నేను అడ్డం రాలేదు కదా ?

అరుం : అనుచారిణి నంటివి కదా ? నా నాట్యంలో నీ వాక భంగిమవు కావలదా ?

సంధ్య : ఓ, తప్పకుండా - కాంక్షితమే కర్తవ్యం కూడ అయితే అంతకన్నా కావలసిం దేముంది ?

(గిర్రున తిరుగుతూ, నాట్యం చేస్తూ)

నిన్నటి వరకును నిదురించితివా ?
నేడే కను దెరచితివా ?
ఈ ప్రణవాశ్రమ భూమికి నేడే
సుప్రభాతమో పూవా !
అంకురమ్ముగా, లోతు నేలలో
బంకమన్నుగా బాధపడితివా ?
మూగ మొలకవై, సాగి తీగవై
రాగ మొలుకవే, పూవా!

(ఆగి) మరి నీ వలానే నిలబడిపోయా వే !

అరుం : (నిట్టూర్చి) ఏమో ! నా కాళ్ళు నేల కంటుకుపోయి కదల లేకుండా వున్నాను. అబ్బా ! అడుగులింత భారంగా వున్నా యేమిటి ?

సంధ్య: ఆ భారం అడుగులది కాదు, ఎడదది !

అరుం : కాదు, నీ పాటది. (ఆలోచిస్తూ) నిజంగా - ఈ పువ్వు గత జీవితం అంత దయనీయమా ?

సంధ్య : కావచ్చు.

అరుం : వెనుక ఎంతో తపస్సు లేనిదే ఈ ల ౫ జీవితానికి ఇంత రమణీయ పుష్ప సాఫల్యం అబ్బదని నా ఉద్దేశం.

సంధ్య : నిరంతరం తపోముద్ర వహించి వుండే రాతిబండ మాటే మిటి ?

అరుం : నిత్యం నీ వేదో ఒక బండ సమస్యనే తెస్తూ వుంటావు.

సంధ్య : నీ కీ మధ్య మనస్సు మనస్సులో లేదులే - వసిష్ఠుణ్ణి అడుగుదాం.

అరుం : ఆయన రేపుగాని రారు - అదే నన్ను ఆయాస పెడుతున్న తలంపు. ఇదేమిటో నా కర్థం కావడంలేదు. ఒక మనిషి సాన్నిధ్యం కోసం మరో మనిషి బాధపడడం అపూర్వం కాదా, సంధ్యా ? ఇది మనో వైకల్యమా ? తపోవైఫల్యమా ? ఏమంటావు దీన్ని ?

సంధ్య : (నవ్వుతూ) నా మాటకేం గాని, ప్రపంచమంతా "ప్రేమ" అంటుంది దీన్ని - ఇది ఎప్పటికప్పుడు అపూర్వం. ఎవరి మట్టుకు వారికే అభినూత్నం. దీని అనుభవం ఏ కణాని కా కణమే మధురతరం - అందరికీ అందే ఫలం కాదది - అందుకొన్నవారు ధన్యులు - వారికి దేవతలే సేవ చేస్తారని మన పరమశివుడు సతీదేవికి చెపుతుండగా విన్నాను.

అరుం : ప్రేమ అంత దివ్యమయిందయితే ! నన్నింత ఆరాట పెడుతున్న దేమిటి?

సంధ్య : నీ హృదయం ఇంకా పరిపక్వం కాలేదన్నమాట - ఔను - అదిప్పుడే వసంత కోకిల తొలికాటు తిన్న క్రొంజిగురు మరి !

అరుం : (కోపంగా) పో ! మంకుపిల్లా !

(సంధ్య వెంటనే గిర్రున తిరిగి, 'నిన్నటి వరకును నిదురించితివా' అని పాడుతూ, నిష్క్రమిస్తుంది. అరుంధతి నిట్టూర్పు విడుస్తుంది. పైకి చూస్తుంది. మధ్యాహ్నం కావస్తున్నది. వసిష్ఠుడు పరిచయంనాటి నుండి ఆమె అదోలా

వుంటున్నది. ప్రతీ ప్రాతఃకాలం అతని దర్శన మవుతున్నా, గంటల కొలది అతనితో ప్రియోక్తులు సాగిస్తున్నా ఆమెకు తృప్తిలేదు. తపస్సు విఘ్నమైనట్టుగా భావిస్తున్నది. ఒక్క తపస్సేకాదు, తన సర్వస్వమూ అతని కోసం త్యాగం చెయ్యగలదు - కాని - ? అసలు, వసిష్ఠుణ్ణి తాను చాల కాలం క్రితమే చూచింది. తన తపస్సు ఫలిస్తేనేగాని అతనితో పరిచయం కూడదనుకొన్నది. ఇంతలో అనుకోని రీతిగా అతని పరిచయ మయింది. ఒక్క క్షణంలో ఇంత విషయం ఆమె మనస్సులో చిరుతరంగాలను రేపింది - ఆమె కదిలింది - ప్రక్క లతా కాండంపై కూర్చున్నది, లేచింది.)

అరుం : (పాట)

**ఎంతకాలము నుండి ఈక్షించుచుంటి నే**
**యమున కీ దారినే యరుగు నీ జడదారి !**
**బాలసూర్యుని రీతి - సర్వచంద్రుని భాతి**
**దిగివచ్చి నన్నింత పొగిలించునే నేడు !**

(క్షణం భావించి - ఉత్సాహినియై)

పొగులూ, దిగులూ ఏదీ నన్ను బాధించరాదు - మహేశ్వరారాధనకు మల్లెపువ్వులు సేకరించవలసి వుంది.

(ఇక్కడొక పువ్వు, అక్క డొక పువ్వు అందుకొంటూ)

**వికసింపుము, వికసింపుము, మల్లీ !**
**విహరింపుము చిరునవ్వులు, జల్లి !**
**పూజాగృహముల, ప్రేమ హృదయముల**
**పులకింపుము చెక్కిలి గిల్లి !**
**మల్లీ ! మల్లీ !**
**మంజుల వల్లీ !**

పరభృతమా ! పంచాక్షరి పలుకుమ !
పరమేశుని రాగముతో నింపుమ !
జగ మనురాగ సమేతము కాగా
ప్రగతి కాగడాలను వెలిగింపుమ !
పరభృతమా ! మరి
త్వరపడుమా !

(పుష్పాపచయం చేస్తూ, పాడుకొంటూ అరుంధతి దూరంగా వెళ్ళిపోతుంది. పాటకూడ దూరమై పోతుంది. అప్పుడు మరో ప్రక్కనుంచి వసిష్ఠుడు ప్రవేశిస్తాడు. దిక్కులు పరికిస్తూ మెల్లగా అడుగులు వేసుకొంటూ పురోగమిస్తాడు.)

వసి : వసంత మధ్యాహ్నాల శోభను ఈ మాకంద వృక్షచ్ఛాయల్లో అనుభవించ వలసిందే !

చింత నిప్పుల వోలె వర్షించు చున్న
చండ భాను కరాలు శీర్షమున దాల్చి
ఆశ్రితుల కింద కలశాల అమృత మొసగు
శివుని దలపించుచున్న నీ చెట్లగములు !

(ఆశ్రమం అతడికి రోజు రోజు వినూతనంగానే కనిపిస్తున్నది. నేడు మరీ ఆనందకరంగా వుంది. ఉదయ సంధ్యా సమయాలలోనే అతడీ దారికివస్తూ, అరుంధతితో సంభాషించి పోతూవున్నాడు. ఈ వేళ మధ్యాహ్నం వచ్చాడు. తన ఈ విచిత్రచర్య తనకే ఆశ్చర్యంగా వుంది. ఇప్పుడు ఆశ్రమంలో ఎక్కడ చూచినా అరుంధతి పాదముద్రలు, హస్తముద్రలే కనిపిస్తున్నై ! అడుగుల్లో అడుగులు వేసుకొంటూ, చిగురు గుర్తుల్ని తాకుతూ, అతడు పరిక్రమిస్తున్నాడు.)

పసిడి పుప్పొడి నొకచోట, పల్లవముల
నొక్కచోట, అనేకము లొక్కచోట,
ఒక్కటే ఒక్కచోటగ పెక్కు గతుల
అపుచున్న వీ రాగ చిహ్నాములు నన్ను

అరుంధతీ ! నిత్యమూ నిన్ను తన ఒడిలో పెట్టుకొని ముద్దు లాడుతున్న ఈ ప్రకృతి ఎంత ధన్యురాలు !

నీ పాద నిర్మల నీరేజములలోన
ప్రకృతి చైతన్యమే పల్లవించె !
నీ తనూవల్లి కానేక భంగిమలలో
ప్రకృతి శాబల్యమే పరిమళించె !
నీ ప్రసన్నేక్షణానీక రేఖలలోన
ప్రకృతి రాగములె రూపము ధరించె !
నీ మంజు మంజుల ప్రేమావతరణలో
ప్రకృతియే నైజపారము తరించె !
నీవు ముందుకు పోవగా, నీడవోలె
నిన్ననుసరించి వచ్చుచుండినది ప్రకృతి,
ప్రకృతి ననుసరించిన త్వదభ్యర్థి నేను !
అద్ధరిని నీవు, ప్రకృతి కిద్ధరిని నేను ! !

(వసిష్ఠుడు ముందుకు పరిక్రమిస్తాడు – ఎదర దూరంలో అరుంధతిని గుర్తిస్తాడు. సంతోష స్వాంతుడవుతాడు – అటుకేసి నిష్క్రమిస్తాడు. రెండవ ప్రక్కనుంచి అదేపాటను పాడుకొంటూ అరుంధతి ప్రవేశిస్తుంది. ఆమె మనస్సు పూర్తిగా పరమేశ్వర పూజాయత్తమై వుంది.)

అరుం : (పాట)

వికసింపుము, వికసింపుము, మల్లీ !

విసువీధుల పందిరులకు మళ్ళీ !
మీలో నేనొక చెల్లిని కానా ?
మీతో మింటికి రాలేనా ?
మక్కువ మల్లీ !
చుక్కల తల్లీ ! !

(వెనుక నుంచి మెల్లగా వసిష్ఠుడు ప్రవేశించి, ఆనందంతో ఆమెను తిలకిస్తాడు. అరుంధతి హఠాత్తుగా ఆగి, వెనుదిరిగి చూచి, చకితురా లవుతుంది. తమకు తెలియకుండానే ఒకరి నొకరు సమీపిస్తారు. అరుంధతి ప్రణమిల్లుతుంది. వసిష్ఠుడు కంపిత గాత్రుడై ఆమెను వారించబోతాడు. అరుంధతి అవనత వదనంతో అంజలి ఘటించి ఒక ప్రక్కగా నిలుస్తుంది. క్షణం సేపు ఇద్దరూ మౌనంగా వుంటారు.)

అరుం : పరమేశ్వరుడే సాక్షాత్కరించా డనుకొన్నాను !

వసి : నేనూ అలానే అనుకున్నాను, అలానే అంటే – (తడబడతాడు)

అరుం : (నవ్వుతూ) వివరణ అక్కరలేదు లెండి.

వసి : ప్రకృతి – వనదేవత – వనితా రూపంలో –

అరుం : ఆగండి – మీరు నిజంగా పరమేశ్వరుడే కాగలరు – మీరు మరచివచ్చిన భూషణాలివిగో ! (సమీపంలో ఒక మల్లెతీగపై వేసి వుంచిన ముద్దమల్లెదండలు తీసి వసిష్ఠుడి కిస్తుంది – అవి నిజంగానే తెల్ల త్రాచులవలె మిలమిల లాడుతున్నై.)

వసి : (మాలను అందుకుంటూ) అది తెల్లత్రాచు కాదు ! పూజా పుష్పమాల!

అరుం : పరమేశ్వరుని ఫణిమాల, మానవుల మణిమాల, పూజలో పుష్ప మాలలే గదా !

వసి : (స్పష్టంగా అర్థంగాక) అంటే ?

అరుం : మీరు పరమేశ్వరుడైతే అది ఫణిమాలగా వుండేది. మానవులైతే మణిమాలగా మారేది.

వసి : ఓహో !

అరుం : మానవత్వం నుంచి దివ్యత్వానికి పురోగమిస్తూ ఇప్పుడు మీరు మధ్య దారిలో వున్నారు. అందుకే ఈ మాల పూజా పుష్పమాలగా మిమ్ము అలంకరించింది.

వసి : బాగుంది ! (దండ తిరిగి ఇచ్చివేస్తాడు. అరుంధతి దానిని అందుకొని అతని మెడలోనే వేస్తుంది.)

అరుం : ఇది మీ కోసమే రచించబడి నట్టిది.

వసి : (అభ్యంతర సూచకంగా) నా కోసమా ? నేను విరాగిని – నాకీ రాగరుచు లెందుకు?

అరుం : రాగ విరాగా లంటే ?

వసిం : చీకటి వెలుగులు. పోనీగాని... నీకు ప్రత్యామ్నాయ ఏమివ్వను ?

అరుం : ఆ తులసిమాల !

వసి : (పక్కున నవ్వి) నన్ను రాగిని చేసి – నీవు విరాగిణి అవుతావా ?

అరుం : రాగ విరాగాలకూ, ప్రకృతి సిద్ధమైన పుష్పాదులకూ సంబంధ మేమిటి చెప్పండి ? పూలమాలతో మీరు అరుంధతి, జపమాలతో నేను వసిష్ఠుడు కాగలమా ?

వసి : కా – లే – మా ? ఏమో ! అయినా – రాగం జీవనస్వరూపం, విరాగం బ్రహ్మస్వరూపం.

అరుం : కాగా, విరాగం నుంచే కదా రాగం పుడుతుంది ?

వసి : అది తిరిగి విరాగంలో పర్యవసించడమే కదా మోక్షం ?

అరుం : అది తిరిగి జీవ స్వరూపం తాల్చకపోతే ప్రపంచమేదీ ? నదీ జలానికి సాగర సంగమమే పరమావధి అయి - అంతటితో ముగిసిపోతే - మేఘ వర్షాదులు లేక, అసలు నదే లేకుండాపోదా ?

వసి : (ఆలోచిస్తూ) అసలు మోక్ష మనేదే లేదంటావా ?

అరుం : ఆ విషయం మీ దగ్గర ఉపదేశం పొందవలసినదానను.

వసి : (ప్రముదిత చిత్తుడై) నీవు గొప్ప తాత్త్వికురాలివి - అరుంధతీ ! స్త్రీలలో ఇటువంటి బ్రహ్మజ్ఞత అరుదు గదా !

అరుం : (సిగ్గుపడి) బ్రహ్మ పదార్థానికి స్త్రీ పురుష భేదమా ?

వసి : (ముగ్ధుడై ఆమెను చేరదీసుకొని) నేను నీలో పర బ్రహ్మనే దర్శిస్తున్నాను.

అరుం : (వినమ్రతతో) అది మీ ప్రతిబింబమే .

(వసిష్ఠుడు జపమాల తీసి అరుంధతి మెడలో వేస్తాడు. ఆమె తేజోవతి అవుతుంది. ఆమె కళ్ళల్లోకి దీక్షగా, ప్రీతిగా చూస్తాడు. ప్రకృతి పరమానంద భరితమైన లక్షణాలు చుట్టూ కొల్లలుగా కనిపిస్తై. వారిద్దరి మీద ఆశ్రమంలోని వృక్ష లతాదు లన్నీ పుష్పాలు విసిరినై. పుష్పాదులు కురిసినై. శుకపికాదులు కల్యాణ గీతాలు గానంచేసై. దూరంలో సంధ్య పాట వినిపిస్తుంది. క్రమంగా దృశ్యం ఎర్రనై, చీకటై పోతుంది. అరుంధతీ వసిష్ఠులు కనిపించరు. మరొక్క క్షణంలో రంగం మీద తెల్లటి కాంతి ప్రసరించే టప్పటికి సంధ్య ఒక్కతే పాడుతూ కనిపిస్తుంది.)

సంధ్య : (పాట)

వసంతహేల - లసత్సుమాల
పసందులేనో బ్రతుకు !
గులాబిపూల - విలాస లీల
దిలాస లేమో వెతుకు !
విచార మేలా - విహార వేళ
విభాత మే ఘోద్దతికి
మధూళి లేదా - సుధార్థి కాదా !
ప్రధాన మభయం మదికి !

(సంధ్య పాడుకొంటూ నిష్క్రమిస్తుంది - దృశ్యం అదృశ్యమై పోతుంది.)

## పంచమ దృశ్యం

(రంగంలో చీకటి క్రమంగా తెల్లగా, ఎర్రగా విరిసేటప్పటికి అరుంధతీ వసిష్ఠులుకనిపిస్తారు. అదే దృశ్యం. అవే అలంకారాలు, వసిష్ఠుని మెడలో పూలదండ, అరుంధతి మెడలో జపమాల, సంధ్య పాట ఎక్కడో వినిపిస్తున్నట్టే వుంది. ప్రకృతి అంతా కలకల్లాడుతూ వుంది. అరుంధతీ వసిష్టులిద్దరూ ఒక అపూర్వానుభూతికి లోనై ఉన్నారా సమయంలో.)

వసి : అరుంధతీ!

**ఈ వనము, ఈ లతాళులు, ఈ సుమాల**
**పరిమళమ్ము, లన్యము లింతవరకు నాకు ;**
**కాని – నీ మైత్రి దొరికిన క్షణము నుండి**
**ప్రకృతియెల్లను నాకు ఆత్మకథ యయ్యె;**

నాకు నూతన చైతన్యాన్ని, నూతన దృక్పథాన్ని కలిగించి, నన్ను నవనూతన జీవర్షిగా రూపొందించిన నీ ప్రేమ శక్తికి నేను సర్వదా కృతజ్ఞుణ్ణి !

అరుం : ఋషికుమారా ! మీరు చెప్పిన సత్యం నా విషయంలోనే నిజంగా సత్యం.

**పూచి పొదలు నదృష్టమ్ము నోచుకొనక**
**పుడమియడుగు లొత్తెడు గడ్డిపోచ నేను !**
**మునికుమారు నొక్కని ప్రేమపూజలోన**
**పారిజాతము కాగల భాగ్య మబ్బె !**

వసి : అలా కాదు. నీవు పుట్టుకతోనే పూజాపుష్పానివి – నీవు నాకు లభించి నేను ధన్యుణ్ణయాను. ఇప్పుడు మనం జీవ బ్రహ్మలం. ఈ విశ్వం మన నాట్యరంగం.

ఆ బాలతృణపూర యమునా ప్రతీరాల
హరిణ శాబము లట్టు లాడుకొనుచు,
ఈ యామ్రతరులతాచ్ఛాయాగృహమ్ముల
పరభృతమ్ములవోలె పాడుకొనుచు,
ఆ రాగపరిపక్వ నీరేజవనముల
రాయంచ లట్లు నీరాడుకొనుచు,
ఈ సరస్సీమంతినీ సైకతోత్సంగ
శయ్యాతలాల విశ్రాంతి గొనుచు,
వేగు సమయాల, మధ్యాహ్నవేళ లందు,
శాంత సాయంతనముల - నిశ్శబ్ద నిశల
ప్రేయసీ, నీవు నే నొక్క రీతి గలిసి
నటన చేతము ప్రకృతి రంగస్థలాన !

(ఉద్రిక్తుడై ముద్దు పెట్టుకోబోతాడు, చుట్టూ వున్న వృక్షలతా గుల్మాదులు తెల్లబోతై ! శుక పికాదులు కంగారు పడతై ! అరుంధతి చిరునవ్వుతో వసిష్ఠుణ్ణి వారిస్తుంది.)

అరుం : మహా సంయమీ ! సంధ్య వస్తున్నది చూడండి ! పిచ్చి పిల్ల ! నృత్యగానాలే నిత్యం ఆహారాహార్యా లామెకు ! (సమీపంలో పాటవినిపిస్తుంది. వసిష్ఠుడు తమాయించుకొని అటు చూస్తాడు. అప్పటికే సంధ్య రంగంలోకి వచ్చేస్తుంది... వసంత హేలా..... అని పాడుకొంటూ. ఆమె నీలిరంగు దుస్తుల్ని ధరించి వుంటుంది. అక్కడ హఠాత్తుగా అరుంధతీ వసిష్ఠుల్ని చూస్తుంది. ఆశ్చర్యపడుతుంది. అంజలి ఘటిస్తుంది.)

సంధ్య : ఓహో ! అచ్చంగా మీరు సతీ సాంబశివులులా వున్నారు ! లేక నిజంగాన్నే సంధ్యాసమయ విహారార్థం వచ్చారుగీనా ! (ఇద్దర్నీ పరిశీలించి చూస్తుంది) ఔను-- మీరు అరుంధతీ వశిష్ఠులే !

వసి : (నవ్వుతూ) పూర్తిగా అనుమానం తీరినట్టేనా ? ఇంకా పరిశోధించ వలసి వుందా ?

సంధ్య : పరిశోధన మిమ్ము పార్వతీ పరమేశ్వరుల్నే చేస్తుంది. దానివల్ల నాకు లాభం లేదు.

అరుం : (పైకి చూచి) ఎంతలో సంధ్యాసమయ మయింది !

వసి : ఆశ్చర్యమే ! సంధ్యా ! ఇంత తొందరగా వచ్చేశావేం ?

సంధ్య : (విచారంతో ) ఆఁ ! మీ ఆనందానికి ఆటంకం కలిగించానా ? అయితే నిజంగా నన్ను మీరు క్షమించాలి.

వసి : (నవ్వుతూ) ఓహో ! క్షమించు, సంధ్యా ! నే నన్నది నిన్ను కాదు, సాయం సంధ్యను - మధ్యాహ్నం ఎంత త్వరగా సాయంత్రమై పోయింది!

అరుం : (వసిష్ఠుడితో) ఈమెను మీ రెరుగుదురా ? ఈమె ---

వసి : (కొంటెగా చూస్తూ) ఈమెను నే నెరగనా ? నన్ను నేను మరచిపోయినా, సంధ్యను నేను మరవను.

అరుం : (చిరునవ్వుతో) మీరెరిగిన ప్రాతః సంధ్య కాదీమె. ఈమె సాయం సంధ్య.

వసిం : ఆశ్చర్యంగా వుంది !

అరుం : ఇద్దరూ ఒకే రూపంలో వుంటారు. ఉదయం, సాయంత్రం వంతులు వేసుకొని ఒకతె నా దగ్గర వుంటుంది. ఒకతె మా పితరులను సేవిస్తూ చంద్రభాగా తీరంలో వుంటుంది. దుస్తుల తేడా లేకపోతే ఈ యిద్దరిలో ఎవ రెవరో, ఎవరూ తెలుసు కోలేరు.

సంధ్య : మా అక్క మాటలు నమ్మకండి. నే నొక్కత్తినే - ఇద్దర మనుకొంటుందామె!! (పకపకా నవ్వుతుంది)

వసి : ఇది మరీ అద్భుతంగా వుంది ! ఈమె నిజంగా నే నెరిగిన సంధ్యేనా?

సంధ్య : మీ రెరగనిది నన్ను కాదు, ఈ నా అవస్థను. ప్రతిదినం ఈ వేళకే రండి. ఎన్ని ఆకర్షణలు... ఎన్ని అనుభూతులు మిమ్మల్ని ముంచెత్తుతాయో !

వసి : అవన్నీ నా కెందుకు ?

సంధ్య : ఈ సౌందర్య మంతా, ఈ రుచులన్నీ మానవుని కోసం కాకపోతే, మాను కోసమా! (సమీపంలో గల పాత్ర అందుకొని) ఇంతకీ, నేనీ పాత్రకోసం వచ్చాను. (అరుంధతితో) నీ మొక్కలకు కూడ ఇవాళ నేనే పోస్తాలే నీళ్ళు. (నిన్నటి వరకును నిదురించితివా - అని పాడుకొంటూ సంధ్య నిష్క్రమిస్తుంది.)

అరుం : (చిరునవ్వుతో) ఇక మనం సంధ్యావార్చి వద్దాం.

వసి : అవశ్యం. (ముందుకు నడుస్తాడు)

అరుం : ఆ కమండలువు ఇలా ఇవ్వండి.

వసి : (ఇస్తూ) ఆ పూలసెజ్జ ఇలా ఇయ్యి.

అరుం : (ఇస్తూ) ఈ సంధ్యాదేవి మనలను తన రాగదృక్కులతో ముంచెత్తు తున్నది!

వసి : ఆ యపర దిశా లలాట ఫలకంపై కుంకుమ రేఖవు నీవే ! లేకపోతే, దానికా రాగం ఎక్కడిది ?

అరుం : అది మీ హృదయం పొంగి పొర్లుతున్న అనురాగం !

వసి : మనం పరస్పరోపాసకులం, అరుంధతీ ! నన్ను నీవు, నిన్ను నేను చేరి పరిపూర్ణతను సాధించాం - ఇప్పుడు మనం ఒకే అద్వైతం. ! నిండు సత్యం, అక్షరబ్రహ్మం !

అరుం : (సజల నేత్రయై) ధన్యురాలను.

(ఇప్పటికి ఇద్దరూ నదీ జలాలకు సమీపంగా వచ్చారు. అవతలి గట్టు దాటి సూర్యుడు అప్పుడే కొండెక్కి వెనక్కి తొంగి చూస్తున్నాడు. దినమంతా ఎర్ర

కంకర బాటలలో ఎడ్లబండిలో ప్రయాణం చేసిన వస్తాదు వలె అతడు పడమటి కొండ చేరి దుమ్ము దులుపుకొంటున్నాడు. అదే కాబోలు సంజకెంజాయ పేరుతో భూమిమీదకు రాలుతున్నది ! తీరంలో. దూరంగా అక్కడక్కడ మహర్షులు సంధ్యవారుస్తున్నారు. వేదవనంలో ఇంకా ఋష్యాశ్రమాలు ఉన్నట్టున్నై. అరుంధతీ వసిష్ఠు లిద్దరూ పరస్పరం సంభాషించుకొంటూ, పరధ్యానంగా ముందుకు నడుస్తున్నారు. అక్కడ సంధ్యా వందనం చేస్తున్న ప్రాచీనుడు హఠాత్తుగా వారిని చూస్తాడు. సంభ్రమాశ్చర్యాలతో అంజలి ఘటిస్తాడు.)

ప్రాచీ : ఓహో ! ఏమి నా యదృష్టం ! నా తపస్సు నేటికి కదా ఫలించింది! సతీ శివులే నాకు ప్రత్యక్షమైనారు ! ఆది దంపతులారా ! జగజ్జనకులారా ! భక్తుడు సాష్టాంగపడుతున్నాడు ! (వారిముందు సాష్టాంగపడినాడు. అరుంధతీ వసిష్ఠులు దిగ్భ్రాంతులైనారు. అతడెవరో అరుంధతి ఎరుగదు. అందువల్ల విభ్రాంతి తరువాత ఈ సంఘటన ఆమెకు హాస్యాస్పదమయింది. నిజంగానే తాము అలా వున్నావేమో ! అంతకు ముందే సంధ్యరేకూడ సరదాకే అయినా, ఆ మాట అని వున్నది ! ఈ ప్రాచీనుడు ఎవరో వసిష్ఠుడికి తెలుసును. వారిద్దరూ ఒకే ఆశ్రమములో వుంటున్నారు. ప్రాచీనుడు పెద్దవాడు. ఆచారపరుడు. కఠినవ్రతుడు. తీవ్ర మనస్తత్వం కలవాడు, హాస్యాన్ని, అనాచారాన్ని సహించడు. అటువంటి వాడితో ఈ సంఘటన ! నిజంగా వసిష్ఠుడికి పై ప్రాణాలు పైనే పోయాయంటే అతిశయోక్తి కాదు. ఇప్పు డెలాగ? ఏమి చెయ్యాలి ? ఏదో చెయ్యాలిగా మరి ? వసిష్ఠుడు తమాయించుకున్నాడు. ధైర్యం చిక్కబట్టాడు. సహజ స్వరంతో జవాబిచ్చాడు.)

వసి : మహర్షీ ! నేను వసిష్ఠుణ్ణి. మీరు నన్ను చాల క్షమించవలసి వుంది.

ప్రాచీ : (కంగారుగా లేచి) ఏమిటీ ? ఎవరూ ? వసిష్ఠుడా ? కాదు, కాదు, మీరు సతీశివులే !

వసి : అది మీ ఆశీర్వచనం. నేను మాత్రం వసిష్ఠుణ్ణే! క్షమాపణ కోరుకొంటున్నాను.

ప్రాచీ : (అనుమానంతో) నిజమా ? వసిష్ఠుడివే ? (కోపం అణుచు కొంటూ) ఈమె ఎవరు ?

వసి : ఒక తాపస కన్య. ఈ పరిసరాశ్రమ వాసిని.

ప్రాచీ : పేరు ?

వసి : అరుంధతి -

ప్రాచీ : (అదిరిపడి చెవులు మూసుకొని ) హరి హరీ ! అంటరాని, చూడరాని, చెప్పరాని చండాల కన్య ! హరి హరీ ! హరి హరీ! (గిర్రున తిరిగి నిష్క్రమిస్తాడు.)

వసి : (రుద్ధకంఠంతో) చండాల కన్య ? !

అరుం : ఆఁ ! (ఇప్పటికిగాని పరిస్థితి తీవ్రతను ఆమె గుర్తించలేదు.)

వసి : ప్రాచీనా ! ప్రాచీనా ! (వెర్రిగా పిలుస్తూ, అతడి వెంటపడి నిష్క్రమిస్తాడు. అరుంధతి నిశ్చేష్టురాలై అలానే సాల భంజికలా వుండిపోతుంది. ఒక్క పరుగులో సంధ్య రంగంలో దూకుతుంది.)

సంధ్య : అక్కా ! అక్కా ! ఏమిటిది ! అయ్యో ! పలకదే ! (కదిపి చూచి) అయ్యో! కదలదే ! అక్కా ! అక్కా ! (చప్పున ఆగి) చండాల కన్య ? కదూ ? ఔను చండాల కన్య ! (అరుంధతివైపు సజలనేత్రాలతో దీక్షగా చూస్తుంది. క్రమంగా సంధ్యారాగం సడలిపోయి, అంధకారం అలుము కొంటుంది.)

## షష్ఠ దృశ్యం

(వసిష్ఠుని ఆశ్రమం. వేదవనంలోనే ఇది మరో ప్రాంతములో వుంది. యమునకు కొంచెం దూరం. అరుంధతి ఆశ్రమంలో వుండే రామణీయకం ఇక్కడ లేదు. అక్కడి సంస్కారం కూడ ఇక్కడ లేదు. ఇదొక మహారణ్యం. మానవ హస్త శిల్పచ్ఛాయలు ఇక్కడేమీ లేవు. అరణ్యం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్న దిక్కడ. సూర్యచంద్రాదులను గెల్చిన మహావృక్షాల నీడల్లో, బహిఃప్రపంచాన్ని బహిష్కరించిన కంటకకుజాదుల జాడల్లో నిశ్చింతగా తపస్సు చేసుకొంటున్న ఆశ్రమమిది. కాల మిక్కడ అలవాటువల్ల తెలియవలసిందే. తరుశిరాలలోని చిరుశకుంతాలు బోధించ వలసిందే. రంగంలో వెలుతురు క్రమంగా వికసిస్తుంది వసిష్ఠుడు ఒక లతా వేదిక మీద కూర్చుని వున్నాడు. తపస్సులో ఉన్నాడో, నిద్రపోతున్నాడో, దీర్ఘాలోచనలో మునిగి వున్నాడో, అస్వస్థుడుగా కనిపిస్తున్నాడు ! పక్షులు ప్రాతఃకాలాన్ని ప్రకటిస్తున్నై. కళ్ళు తెరచి, మళ్ళీ మూసుకున్నాడు. లేచి ఎదరకు నడిచాడు. అక్కడ మళ్ళీ కూర్చున్నాడు. ఈ సమయానికే అతడు ప్రతిదినం అరుంధతి ఆశ్రమంలో వుంటూవుండేవాడు. ఇప్పటికే అక్కడ సంధ్య నాట్యం ప్రారంభిస్తుంది. ఎంత ఆనందమయ జీవితం వాళ్ళది? అసలు జీవిత మంటే అదే. ఈ చీకటి కాదు. వసిష్ఠుడి మనస్సులో ఈ విషయమే వివిధగతుల్లో పరిభ్రమిస్తున్నది. చండాల కన్య ! ఎవరు ! ఆ దివ్యసుందరి ! )

వసి : చండాల కన్య ! ఆమెను చండాల కన్య అన్నవాడే చండాలుడు.

> ముఖబింబ మందు సంఫుల్లమై బ్రహ్మ తే
> జము సహస్రాబ్జ తేజమున వెలుగు !
> జిహ్వాగ్ర మందు రాజీవాసనుని రాణి
> నాల్గు వేదములతో నాట్యమాడు !

నేత్రాంచలము లందు నిఖిలలోకము లేలు
ప్రణయ పరంజ్యోతి పర్యటించు !
తనువల్లి యందు సుందరకళా కళ్యాణ
విశ్వమోహన రుచి విన్యసించు !
దివ్యబాల నరుంధతీదేవి, నమృత
హృదయ నస్పృశ్యయనగ నో రెట్లు వచ్చె ?
నరుని వెలిబెట్టి హింసించు నరుడు నరుడె ?
మానవాభ్యుదయము కిది మంచి దగునె ?

అరుంధతీ ! నీవు చండాల కన్యవా ? ఓ దివ్యసుందరీ ! నీవు ఏ కులంలో పుడితే ఆ కులం, ఏ స్థలంలో పెరిగితే ఆ స్థలం, నీవు చూచిన, తాకిన, పల్కరించిన ప్రతి లవం పరమపావనమే కదా!

నీ వంటి పరంజ్యోతిని కులం పేరుతో అవమానించిన ప్రాచీనుడిది నాలుక కాదు-- గరిగమ్మ.

ప్రాచీనుడికి మతి లేదా ? కాదు. నాకు మతి లేదు. ఆ స్థితిలో నిన్ను విడిచిపెట్టి వచ్చిన నేను క్రూరుణ్ణి. నేనెందుకు వచ్చేశాను ? ప్రాచీనుడు నా బుద్ధికి సంకెళ్ళు తగిలించి తనతో ఈడ్చుకువచ్చి వుంటాడు! నీవు నన్ను ఎందుకు పోనిచ్చావు ? ప్రియా ! నీ హృదయానికి చిచ్చు పెట్టి వచ్చేశాను! అది నిన్నెలా దహించి వేస్తున్నదో గదా !

నేటి ఉదయం సంధ్య నాట్యం చేసిందా ? నీవు నా కోసం ఎదురు చూస్తూ ఆ సహకార వృక్షచ్ఛాయలో కూర్చున్నా వేమో ! యమునాతీరంలో ఆ సంధ్యావందన ఘట్టంలో ఇంకా నిలబడే వున్నావేమో ! ఇప్పుడేమిటి కర్తవ్యం ?

(దూరంలో సంధ్య కంఠస్వరంతో పాట వినిపిస్తుంది. వసిష్ఠుడు చాల ఆసక్తితో వింటాడు. అతని ముఖంమీద అనేక భావాలు రంగులు రంగుల అలల్ని రేపి మాయమైపోతుంటై.)

(తెరలో)

పంకజ మనియే శంకించెదవా ?
పద్మము విడిచెదవా, మధుపా ?
కమలము, కల్హారము భేదములను
గమనింతువటో, సరసీ ?
ఖంగున మ్రోసే కంచుగంటలకు
బంగారపు నైవేద్యములా ?
వేకువదాటిన వేళను కూడా
చీకటి మాటునె రవిని ?

వసి : (చివాలున లేచి) సంధ్యా ! సంధ్యా ! (ముందుకు నడిచి) నన్ను క్షమించు, సంధ్యా ! ఇదుగో వచ్చేస్తున్నాను. (దురుసుగా వెళ్ళబోతూ, ఎదురుగా వస్తున్న కులగిరిని గుద్దుకుంటాడు.)

కుల : ఛ్ఛంపావోయ్, వసిష్ఠా ! అబ్బా ! "కామాతురాణాం న దారీ, న వేళా" అబ్బబ్బా ! అంత కళ్ళుమూసుకొని-- (శిరస్సు పట్టుకొని, తీక్షణంగా చూస్తాడు)

వసి : (పశ్చాత్తాపంతో ) క్షమించు, కులగిరీ ! చూడలేదు (వెళ్ళ బోతాడు)

కుల : (వసిష్ఠుని. చేయి పట్టుకొని) ఎ ఎక్కడికి ? గ్గురువుగారు ఎక్కడికీ వ్వెళ్ళనివ్వ వద్దన్నారు.

వసి : నీకు గురువుగారు కాని, నాకు కాదు. నేను వెళ్ళక తప్పదు.

కుల : (నిశ్చేష్టుడై) ఆఁ ! ఏమిటి ! ప్పండంటి బ్రహ్మ వంశములో మ్మాలకూడు కలిపేస్తున్నావ్ ?

వసి : "ఏకమేవాద్వయం బ్రహ్మ" అంటూ నీవు అప్పగించేవన్నీ అర్థంలేని చిలుక పలుకు లేనా ?

ప్రాచీ : (ప్రవేశిస్తూ) నీ యీ పలుకు లన్నీ ఆ మాలమాదిగ గూడెంలో నేర్చిన వేనా !

(వసిష్ఠుడు మాట్లాడడు)

కుల : న్నిన్నేనోయ్ ! వసిష్ఠా ! న్నిన్నే !

ప్రాచీ : వసిష్ఠా ! ఎక్కడికి పోతున్నావ్ ? దుష్టస్నేహం దుర్మార్గాలలో నడిపిస్తున్నదా ?

వసి : ఎవరు దుష్టులు ? కుల, మత, స్త్రీ, పురుష విభేదశూన్యమైన పవిత్రస్నేహం దుర్మార్గాలకు ఎప్పుడూ నడిపించదు.

ప్రాచీ : (వికటంగా) పవిత్ర స్నేహం ! స్త్రీ స్నేహం - అందులోను చండాలినీ స్నేహం - పవిత్రమా ?

వసి : బ్రాహ్మణ - చండాలత్వాలను ఎలా నిర్ణయించడం ? కులమా కొలతబద్ద? సహకార వృక్షం రాజోద్యానంలో వలె మాలపేటలో ఫలించదా ? పుట్టుక స్థలాన్ని బట్టి రుచులకు విలువ కట్టుదురా ? అయినా - చెట్టు పుట్టి, ఫలించిన వెనుక గదా పెద్ద, చిన్న, పులుపు, కోల, గుండ్రన కుల నిర్ణయం? ఇక - స్త్రీ స్నేహం గురించి --

ప్రాచీ : ఉపన్యాసం నేర్చావే ! ఇక ఆర్య ధర్మానికి ఆధారం ఎవరు ?

కుల : (పాట)

"జన్మనా జాయతే శూద్రః<br>
కర్మణా జాయతే ద్విజః<br>
వేద పాఠంతు విప్రాణాం<br>
బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః"

మ్మనం బ్రాహ్మలమోయ్, వసిష్ఠా ! మనం బ్ర్బాహ్మలం.

వసి : బ్రహ్మ జ్ఞానమనే మాటనే ఉచ్చరించడానికి అర్హులు కాని యజ్ఞోపవీతధారులంతా బ్రాహ్మణులేనా మహర్షీ !

ప్రాచీ : అయ్యో! ఎంత పతనమైపోయావు ? పాపంచేసి పశ్చాత్తాప పడలేనంతటి హీన స్థితికి దిగజారి పోయావే! స్త్రీ స్నేహం! వసిష్ఠా ! తపోవృక్షానికి చీడపురుగు, ఆధ్యాత్మికానందానికి విష సర్పం, స్త్రీ స్నేహం !

వసి : స్త్రీ చీడపురుగు, విషసర్పం అయితే, సృష్టిలో అసలు స్త్రీత్వమే లేకుండా పోయేది కదా ? శుద్ధ నిర్గుణ పరతత్వంలో సగుణ సుందర చైతన్యశక్తి స్త్రీయే కాదా ? కారుమబ్బుల లోని బంగరు సెలయేరు, గున్నమామిడి గుబురు కొమ్మలలోని ఆనంద మధురగానం--

కుల : (ఊరుతూ) అమ్మ ! అమ్మ ! "మ్మాతంగకన్యాం మ్మనసా స్మరామి."

వసి : (ప్రాచీనుడితో) ఆర్యా ! విశ్వంభరం, శివశంకరం, సుందరం అయిన రమణీమూర్తిని నిందించవద్దు. ఆమె ప్రేమమయి. రసధుని.ఆనంద చేతన. ఈ సకల కళా కల్యాణమూర్తిని సాక్షాత్కరింపజేసుకో. నీ నిస్సంగ ప్రకృతి నుంచి మరొక మెట్టు పైకెక్కిచూడు ! నేను దర్శిస్తున్న ప్రేమ జ్యోతిని నీవు కూడా దర్శించగలవు - ప్రేమోపాసకుడు కానివాడు, దైవోపాసకుడు కూడ కాలేడు.

ప్రాచీ : (మొత్తుకుంటు) హరి హరీ ! ఎంత అధఃపతనం ! ప్రత్యక్ష స్త్రీ ఆరాధనమే జగన్మాత ఆరాధన మంటున్నావా ?

వసి : తప్పేమి ? వివిధ రూపగుణ మాధుర్యాలతో జగన్నాటక రంగంలో అవతరించిన మహాశక్తినే గదా జగన్మాత అనడం ? తెరమీది సాకార బ్రహ్మను, ఉపేక్షిస్తే తెరవెనుక ఏమున్నది స్వామీ ?

కుల : "స్త్రీయో మూల మనర్థానాం"

ప్రాచీ : (చింతతో) తెరవెనుకటి నిరాకార మూర్తిని ఎంతలో మరిచావు, వసిష్ఠా!

వసి : అది నాకు బోధించ నక్కరలేదు.

ప్రాచీ : ఇక, ఆ మాలమాదిగ పిల్లను విడిచిపెట్టవా ?

కుల : ఒఒక కర్తకాదు, ఇద్దరండీ, గురువర్యా ! ఇఇద్దరూ !

వసి : నీటినుండి తడిని విడదీయలేను. పుష్పం నుంచి సౌరభాన్ని తొలగించలేను. అరుంధతీచంద్రిక లేని వసిష్ఠుడు కేవలం ఒక మంటిపెల్ల మాత్రం.

ప్రాచీ : మరొకసారి ఆలోచించుకో ! నీ మార్గానికి నేను అడ్డం రాను. పైగా నీకు సహాయపడగలను. మనం మిత్రులం. అయినా, ఆర్యజాతి సంరక్షకులం. సమష్టిక్షేమం ముందు వ్యక్తిగత ప్రయోజనం తృణప్రాయం. ఇప్పుడు నీ నిర్ణయం మీదనే ఆర్యజాతి భవిష్యత్తు ఆధారపడివుంది. నీచజాతి కన్యతో. పవిత్రమైన ఆర్యజాతిని సంకరంచేసి, సర్వనాశనం చెయ్య దలిచావా ? ప్రశాంతంగా ఆలోచించి, సమాధానం చెప్పుకో ! తొందర ఏమీ లేదు. యుగయుగాలకు, జన్మ జన్మాలకు సంబంధించిన సమస్యను అనాలోచితంగా, క్షణాలపై, ఉద్రేకంలో పరిష్కరించరాదు. సమగ్రంగా, పరిశీలించు. సమంజసమైన నిర్ణయం చెయ్యి. స్వార్థానికి కళ్ళెం వేసి, త్యాగాన్ని ముందుకు రానీ !

కుల : ఈ ఊర్వశీపుత్రు దనిపించుకోకయ్యా, వ్వసిష్ఠా !

వసి : (నిశ్చేష్టుడై) ఆర్యజాతి భవిష్యత్తు ! (తల రెండు చేతుల తోను పట్టుకొని ఒక బండపై కూర్చుంటాడు. దృశ్యం క్రమంగా అయోమయమై పోతుంది.)

(నిష్క్రమిస్తాడు)

## సప్తమదృశ్యం

(అదే రంగం. అదే సమయం, వసిష్ఠుని ఆశ్రమంలో వెనుకభాగం బహుదట్టంగా వుంటుంది. అక్కడికి కులగిరి ఎందుకో వచ్చాడు. హఠాత్తుగా ఆగాడు. బహుశా కొంచెం బెదిరాడనుకోవచ్చు. వెనక్కి తిరిగి ఇటుకేసి వచ్చాడు. దూరంలో ఎవర్నో చూశాడు. పెదవి విరిచాడు.)

కుల : "అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం" ప్పాపం, వ్వసిష్ఠుడు ! ఎలాంటివాడు ఎలా అయిపోయాడు ! మ్మాదిగ పిల్లలట ! ద్దేవకన్యక లనుకున్నాను ఇద్దరూ ! నాక్కూడా స్నేహం క్కలపవోయ్ అంటే వ్విన్నాడూ, స్వార్థపరుడు ! గురువుగారు మంచిపని చేశారు. మహా ప్పూరిపోతు న్నాడులే ! తగిన శాస్తి అయింది. (ఏదో అలికిడి తగిలి, బెదురుతాడు) ఉష్! మ్మొన్న ఆ ఛండాలుడు పెద్దపులిని మ్మీదకు వదిలాడు ; ఆ బెదురే నన్ను త్తరుము తున్నది. (ఆలోచించి) ద్దెయ్యాలు కూడా వున్నా యంటారు పెద్దలు. మ్మనిషి చచ్చిన తర్వాత ప్పునర్జన్మ ఎత్తుతూ వుంటే, మ్మధ్య దెయ్యా లెక్కణ్ణుంచి పుద్తున్నాయ్ చెప్మా ! (అంతలో వెనుకనుంచి ఒక పొదను చీలదీసుకొని సంధ్య ప్రవేశిస్తుంది. కులగిరి అదిరిపడి "బ్బాబోయ్" అంటాడు) బ్బాబోయ్! దెయ్యం! !

సంధ్య : (అదిరిపడి) మునికుమారా ! నేను. నేను దెయ్యాన్ని కాను.

కుల : (కళ్ళు మూసుకునే) మ్మరి. మ్మరెవరు ?

సంధ్య : నేనా ? (సందేహిస్తూ) నేను.

కుల : ఆ అదే, దెయ్యాలకి పేర్లుండవు, న్నేనంటే ఆత్మ. అదే దెయ్యం !

సంధ్య : అదే కాదంటున్నాను. కొంచెం కళ్ళు తెరచి చూడు. నీ సహాయం కోరి వచ్చిన ఒక ఆపన్నను నేను.

కుల : "ఆపత్కాలే నాస్తి మర్యాదా," న్నీ పేరు చెప్పు ! (కొంచెం కళ్ళు తెరిచి) ఎవరు నీవు ? దెయ్యం కాకపోతే దేవతవైనా అయుండాలి. (బాగా చూచి) ఆc ! న్నిన్నెక్కడో చ్చూచినట్టుందే !

సంధ్య : మా ఆశ్రమం ఈ సమీపంలోనే. మీ వసిష్ఠకుమారుడు.

కుల : ఆc ! ఆc ! ఘోరం ! ఘోరం ! మ్మావసిష్ఠుడికి అప్పుడే కుమారుడే !

సంధ్య : (విసుగ్గా) కొంచెం సరీగ్గా వినవయ్యా, స్వామీ ! మీ వసిష్ఠుణ్ణి గురించి మా అరుంధతి ఘోర తపస్సు ప్రారంభించింది.

కుల : త్తపస్సే ! అమ్మబాబోయ్ !

సంధ్య : సంధ్యావందన ఘట్టంలో మీ వసిష్ఠుడు ఆమెను విడిచి పెట్టి వచ్చేసినప్పటి నుంచీ, ఆమెకు స్మృతే రాలేదు. ఆమెను రక్షించగలవాడు అతడొక్కడే.

కుల : మీ పేటలో వైద్యులే లేరా ?

సంధ్య : దయచేసి వసిష్ఠు డెక్కడున్నాడో కొంచెం చెప్పగలవా ?

కుల : క్కొంచెమేం ఖర్మ ? అంతా చెపుతాను. మ్మరి నాకు బ్బహుమానం ?

సంధ్య : పుణ్యం.

కుల : ప్పుణ్యంవల్ల ఏం లాభం ?

సంధ్య : ఆనందం.

కుల : అదే నాక్కావాలి. నాకు ఆనందం కావాలి. వ్వసిష్ఠుడికి లభించిన ఆనందం కావాలి.

సంధ్య : అందుకు నీకొక ఉపాయం చెపుతాను. ముందు వసిష్ఠు డెక్కడో చెప్పు.

కుల : అ అతడు మీ ఆశ్రమం కేసే బైలుదేరి ప్పోయాడు.

సంధ్య : (ఆత్రంగా) ఎప్పుడు ?

కుల : ఇ ఇందాకనే. అతణ్ణి ఆశ్రమం నుంచి క్కదలనివ్వ వద్దని ఆశ్రమవాసు లందరికీ గ్గురువుగారు చెప్పివెళ్ళారు. అయినా, అతడు ఆగలేనురా అని కాళ్ళావేళ్ళాపడ్డాడు. నేను ప్పోనీలే అని వ్వదిలేశాను.

సంధ్య : మరి, మీ గురువుగారి కేమని చెపుతావు ?

కుల : చ్చూడలేదని చెపుతాను.

సంధ్య : బ్బలేవాడివే ! గ్గురువుగారికే ప్పంగనామం పెట్టగల మ్మొనగాడివి!

కుల : (నవ్వుతూ) మ్మరేమనుకున్నావ్ !

సంధ్య : ఈ చుట్టు ప్రక్కల ఏదైనా కోనే రున్నదా ?

కుల : ఎందుకు ?

సంధ్య : స్నానం చెయ్యాలి.

కుల : ఇ ఇప్పుడా ?

సంధ్య : నీ వంటి పాపిష్టిని చూచిన తర్వాత స్నానం చెయ్యకుండా ఎలా ?

(రంగం మీద రక్తకాంతి జిగేలు మంటుంది. సంధ్య కోపాగ్నిలో కులగిరి మిడతలా అల్లాడిపోతాడు. ఆమె బాణంలా నిష్క్రమిస్తుంది. కులగిరి దిగ్భ్రాంతితో కూలబడతాడు.)

## అష్టమదృశ్యం

(అదే రంగం. వసిష్ఠుని ఆశ్రమంలో ఒక భాగం. ఒక బండరాతి మీద కూర్చుని వసిష్ఠుడు చింతాక్రాంతుడై వుంటాడు. అతని ముఖం మీద వెలుగు నీడల గమనం క్రమక్రమంగా తీవ్ర తరమవుతూ వుంది. దూరంలో, సంధ్య కంఠస్వరంతో ఒక పాట దశదిశలా గాలిస్తున్నది.)

(తెరలో)

ధారుణి ముంచుచు వారిధి పొంగిన
ఆవగింజలా ఆటంకం ?
ఉప్పొంగిన ప్రణయోదధి నాపగ
వర్ణ విభేధం వశమా ?
ఎదతో యెదదను స్వీకరించుటకు
స్వేచ్ఛలేని నీ జీవితమేలా ?
అణువు మొదలు బ్రహ్మము వర కొకటే
ఆత్మముగా తెలియగలేవా ?
శిధిలమైన నీ జీవితవాటికి
చేసికోవు వలసిన మరమ్మతులు !
ఆత్మ దైవతమె అరుదెంచినపుడు
మూఢా! తలపులు మూసికొందువా ?

(పాట వింటున్నకొలది వసిష్ఠుని ముఖంలో కాంతి హెచ్చింది. హృదయంలో రేకలు వికసించాయి. ప్రకృతిలో బిగువు సడలింది. వసిష్ఠుడు లేచి నిలబడ్డాడు)

వసి నేను మూఢుణ్ణే! ముమ్మాటికి మూఢుణ్ణే, సంధ్యా! ప్రేమ లతను త్రెంచి వెయ్యడానికి వడి పెట్టుతున్న క్రూరుణ్ణి! నిజమా? నేను క్రూరుణ్ణా ? కాను - ఎన్నటికీ కాను - ప్రేమ లతను అరుంధతి తెగనివ్వదు. ఆమె

కాశక్తి వుంది. నాకు వర్ణ భేదం లేదు. నేను తలుపులు మూసుకోలేదు. నా అరుంధతి నా హృదయంలోనే వుంది. సర్వత్రా ఆమె ప్రతిబింబిస్తున్నది.

సంధ్య వార్చుట కేగి జలకమ్ము చేకొన్న
ప్రతిబింబమై అరుంధతియ తోచు,
మేత మేపుటకునై మృగశాబముల జేర
త న్నేత్రముల అరుంధతియ చూచు,
కందమూలముల చెంగట పోవ, కల కంఠ
రుతములతో అరుంధతియ పిల్చు,
కనుమూసి జపమాలికనుగొన్న, కాళరా
త్రి జ్యోతిగా అరుంధతియ నిల్చు,
పడతి తనయంత విశ్వరూపము ధరించి,
నిండియున్నది నాగుండె నిండ తానె;
నేను నేను ప్రత్యణువును తానెయగుట
మాకు లేదు వియోగబాధాకులమ్ము.

సంధ్యా ! నీవు మీ అక్క దగ్గరకు పో. నేను క్షణంలో వస్తాను. ఆర్య, అనార్య భేద భావాన్ని తునాతునకలు చేసి, ప్రాచీనుడి నోరు మూయించి, ఈ పారతంత్ర్య వాతావరణం నుంచి బైటికి దూకి వచ్చేస్తాను.

అరుంధతీ ! ఎంత కఠిన వ్రతానికి ఉపక్రమించావు ! ఓహో ! లోకంలో ఇంతకన్న ధన్యత ఏమి కలదు? - ! నీవంటి దివ్యశక్తినా ప్రాచీనుడు తూలనాడాడు ? పారిజాతపుష్పాన్ని ఏ పేరుతో పిలిస్తేనేం?

ఎంత పొరపాటు చేశాను ! నీ సాన్నిధ్య స్వర్గం నుంచి అనాలోచితంగా వచ్చి ఈ ప్రాచీనాశ్రమ కారాగారంలో పడ్డాను ! జాతిసంకర భయంతో నన్నిక్కడ కట్టి వెయ్యడానికి చూస్తున్నారు! ఇంత తపస్సుచేసీ నేను మానవ బలహీనతకు లోనుగాక తప్పలేదు. నా దోషానికి నీకు ప్రాయ

శ్చిత్తమా ? స్వపర భేదభావ కాలుష్యంతో, నిమ్నోన్నత ఉచ్చ నీచ విచక్షణా పాపపంకిలంతో నేను బాధపడుతుంటే - శుద్ధిస్నానం నీకా ? తాత్కాలికమే అయినా, ఈ నా అసమర్థతకు అర్థం లేదు.

**కాడపై పూవు వాడిపోగలదు కాని,**
**పెరలలో తేనె సంపద పెంచగలదు;**
**అకట ! నన్ను బోలిన అనామకుని పట్ల**
**ప్రణయసౌందర్య మెల్ల వ్యర్థముకాదె ?**

(అనిశ్చయతవల్ల ఆందోళన పెరిగి, ప్రక్కనుగల వృక్ష కాండ ఖండంమీద కూర్చుంటాడు. చాల బెంగగా కనిపిస్తాడు. అయినా ఒక స్థిర సంకల్పం అతని ముఖంలో మకాం వేసింది. ఆ పరిస్థితిలో ప్రాచీనుడు ప్రవేశించాడు. వసిష్ఠుడి తలపై చేయి వేశాడు. వసిష్ఠుడు తలెత్తి చూచి, మౌనంగానే వుండిపోయాడు. (ప్రాచీనుడు అలానే నిలబడి వసిష్ఠుని తల నిమిరాడు)

ప్రాచీ : వసిష్ఠా ! నీవింకా తేరుకోనేలేదా ? (వసిష్ఠుడు మాట్లాడడు.)

ప్రాచీ : తేరుకోలేవు.

(వసిష్ఠుడు తల పైకెత్తి ప్రశ్నార్థకంగా చూస్తాడు, ప్రాచీనుడు మెల్లిగా ప్రక్కకు పోతూ)

ప్రాచీ : స్త్రీ వాంఛ !

వసి : (తీవ్రంగా చూస్తూ) స్త్రీ వాంఛ ?

ప్రాచీ : (తాపీగా) ఔను, మిత్రమా ! ఔను. నీ హృదయాన్ని దిగలాగుతున్న భారం, నీ నాడుల్ని కోస్తున్న కత్తి, నిన్ను ఆపాదమస్తకం దహిస్తున్న నిప్పు, నిన్ను తపోలోకం నుంచి పడద్రోస్తున్న దయ్యం - స్త్రీ వాంఛ! వాంఛా నివృత్తి చేసుకో ! గతాన్ని మరచిపో ! నిగ్రహం వహించు! నీ హృదయం తేలిక అవుతుంది. నీ నాడులు చల్లబడతాయి. నీవు లేచి నడవగలవు.

వసి : (లేచి నిలబడి) చాలు, మిత్రమా ! చాలు. నాకు చెప్పవలెసిందేదో ఇదివరకే చెప్పావు. ఇక ఈ కంఠశోష అనవసరం. నా దారిని నన్ను పోనీ. వసిష్ఠుడు లేడనుకో. తపస్సంపన్నుడవై ఆర్యజాతి నుద్ధరించు. నా గురించి తాపత్రయపడకు. నా జీవితం ప్రేమయజ్ఞంలో బలి అయిపోయింది.

ప్రాచీ : ప్రేమ ! ప్రేమ అంటే ? విశ్వమానవ కల్యాణాన్ని కోరేదే ప్రేమ ! దాని సిద్ధికోసం చేసే నిష్కామ కర్మే యజ్ఞం. వసిష్ఠా ! నీది ప్రేమ కాదు. ·వట్టి కామం. దానికి ప్రేమ అని పేరు పెట్టి, ప్రేమను అవమానించకు.

వసి : (కోపంతో) ఏమంటున్నావు? ఎవరితో అంటున్నావు ?

ప్రాచీ : (మందహాసంతో) వసిష్ఠుడితో అంటున్నాను. వేద వేదాంగ పారంగతుడైన, మహాతపస్సంపన్నుడైన, అన్నిటినీ మించి యువకుడైన వసిష్ఠునితో అంటున్నాను. కోపపడకు. పరస్పర వాంఛ స్త్రీ పురుషులకు సహజం. నీవు సహజం కానిదేదీ చెయ్యడం లేదు. నీ వాంఛ తప్పుకాదు. కాని, నేననేది దానికి అనవసరంగా పెద్ద పేరు పెట్టవద్దనే.

వసి : విశ్వమానవ కళ్యాణభావం ఔదార్యం, వాంఛా విలుప్తమైన నిష్కామకర్మ నీకు మోక్షాన్ని ఇవ్వవచ్చు. నేనిప్పుడు కోరేది వాంఛామధురమైన రసానుభూతి.

ప్రాచీ : నీవు ఉన్మత్తుడవు. దేన్ని నీవు మాధుర్య మంటున్నావో అది సంసార సాగరంలో గాలానికి ఆకర్షించే ఎర మాత్రమే వసిష్ఠా ! స్వస్థుడవుకా.

వసి : ఈ జీవితంలో నా కిక స్వస్థత లేదు. నన్ను మరచిపో. నేను పోతున్నాను.

ప్రాచీ : ఎక్కడికి? నీ వెక్కడికీ పోలేవు. నీ వాంఛ నుంచి నీ వెక్కడికి పోగలవు ? వ్యర్థం. పోనీ– నీ కా పిల్ల లభిస్తే సుఖంగా వుండగలవా ?

వసి : ప్రాచీనా ! నీ వెంత కఠినుడివి ! మధువులో విషం కలిపి నోటి కంది స్తున్నావా? నా ప్రేమను కామమని అవమానించావు. నా స్నేహాన్ని వాంఛ అన్నావు. పైగా, జాతి సాంకర్య మన్నావు, కరకు బాణాలచే నా హృదయాన్ని వ్రయ్యలు చేశావు. చాలు – ఇక నన్ను పోనీ. నీ ఆశ్రమలతా కోరక మొకటి కాలవశాన గాలికి తెగిపోయిందనుకో.

ప్రాచీ : నా ఆశ్రమ లతాకోరకం ఏదీ, ఎట్టి గాలికీ తెగిపోరాదు. నీ జనని ఊర్వశి నీ రక్షణభారాన్ని నాపై పెట్టింది, నీ విప్పుడు యుక్తవయస్కుడవు, సర్వస్వతంత్రుడవు, వివేకశాలివి, యమ నియమాది గుణవసిష్ఠుడవు, నేను నీకు మిత్రుణ్ణి. నా సలహా పాటించు. ప్రపంచానుభవం లేని యౌవనారంభం పెనుతుఫానులో విడువబడ్డ నౌక వంటిది. మిత్రుడు చుక్కాని పట్టినప్పుడే అది ఒక ఆశ్రయం చేర గలదు. ప్రపంచ మహాసాగరంలో ఎన్నో జీవిత నౌకలు భగ్నం కావడానికి కారణం సరంగు లోపమే. నా సలహా విను. నీవు గృహస్థాశ్రమాన్ని స్వీకరించు.

వసి : నేను తపస్సు మానుకోలేను.

ప్రాచీ : నీవు తపస్సు మానుకోనక్కర లేదు. నీవు ఇప్పటికే మహా తపస్వివి. యౌవనం పాలపొంగు వంటిది. అది మొదట చల్లార వలసి ఉంది. అప్పుడుగాని నీవు నీ చుట్టూ నాట్యం చేసే శతసహస్రాధి కాకర్షణలను నిగ్రహించి నిలువలేవు. నీకు తగిన తేజోవతిని వివాహమాడి, రాజయోగివికా.

వసి : ఆరుంధతి కంటె తేజోవతి యెవరు ?

ప్రాచీ : ఓయి పిచ్చివాడా ! చండాలకన్యకు తేజమా ? మసిబొగ్గుకు రత్నద్యుతులా? బలేవాడివి ! నీవు ఆమె నొక్కర్తనే చూచి భ్రమపడుతున్నావు. ఆమె నొక తారా మాత్రంగా చేయగల ప్రచండ రవితేజస్విను లెందరో లోకంలో వున్నారు. (ఆలోచించి, కొంత ఇసుకను పైకెత్తి) ఇదిగో. ఈ ఇసుకను అన్నంగా వండి

పెట్టగల కన్య నీకు అర్ధాంగి కాగలదు. ఇక నీవు స్వేచ్ఛగా పోవచ్చు. సెలవు.

(ప్రాచీనుడు నిర్వికారంగా నిష్క్రమిస్తాడు. వసిష్ఠుడు కొంతసేపు అలానే నిలబడి వుంటాడు, ప్రాచీనుడు వెళ్ళిన దారివైపు, చేతిలోని ఇసుకవైపు పదే పదే చూస్తాడు. తానిప్పుడు సర్వ స్వతంత్రుడు. తన తల్లి తనను చిన్నప్పుడే ఈ ఆశ్రమంలో వదిలింది. మళ్ళీ ఆమె కనిపించలేదు. ప్రాచీనుడే మార్గ దర్శకుడుగా తాను పెరిగాడు. ఇంత కాలమూ తపస్సులోనే గడిచిపోయింది. అందుకే తాను తాత్కాలికంగా నైనా ప్రాచీనుడి మాటను గౌరవించవలసి వచ్చింది. ప్రాచీనుడు వివేకి. తన మాట ఇక చెల్లదని గుర్తించగానే ఒక ఆంక్షపెట్టి, తాను తప్పుకున్నాడు. ఇప్పుడు వసిష్ఠుడు ఎక్కడికైనా పోగలడు, ఏమైనా చెయ్యగలడు. ఇదంతా వసిష్ఠుని ముఖంలో కనిపిస్తున్నది. అతనికి సంతోషం కలిగింది. వెంటనే దానికి నీడగా విచారం తోడయింది. ఊగులాడుతున్న మనస్సునుంచి ఇప్పుడు అతని ముఖంమీద వెలుగు నీడలు పడుతున్నాయి.)

వసి : ప్రాచీన ధర్మం కంటె ఈ యిసుక కొంత మెత్తనిది. దీనిని అరుంధతి అన్నంగా వండజాలదా?

మాతంగ కన్య తేజశ్శాలిని ఎందుకు కాగూడదు ? మానవ కల్పితకులానికీ, ఆధ్యాత్మిక మహాశక్తికీ ముడిపెడుతున్న ఈ ప్రాచీన మతం ఎంత సత్య దూరం ?

అరుంధతి తపస్విని, బ్రహ్మవిదుషి ! తప్పక ఈ యిసుకను వండగలదు. నా అదృష్టం పండగలదు. నేను తక్షణం అరుంధతీ ఆశ్రమానికి పోయి దీన్ని వండిస్తా. (ఉత్సాహంగా ముందుకు అడుగులు వేస్తాడు ! హఠాత్తుగా ఆగుతాడు. ముఖం గంభీరం అవుతుంది.) ఎక్కడికి పోతున్నాను ?

ఎందుకు పోతున్నాను ? ప్రేమించి మోసం చేసిన నావంక ఆమె కన్నెత్తి అయినా చూస్తుందా ? అవమానాగ్నిలో దహించుకుపోతున్న ఆమెకు వడగాడ్పు కాబోతున్నానా ?

ప్రేమకు పరీక్షా ? ఒక వేళ ఈ ఇసుకను అరుంధతి వండజాలక పోతే. ఆమెను నేను విడిచిపెట్టుకోగలనా ? వండగల మరోస్త్రీని పెండ్లాడ గలనా? అది సాధ్యమా ?

నాకు కావలసింది అరుంధతిగాని, స్త్రీకాదే ! ప్రేమను పరీక్షింప బూనుకొనేవాని హృదయం ఊషరక్షేత్రం. నాకు ఈ యిసుకతో పనిలేదు.

(ఇసుకను పారవేస్తాడు)

ఇంత పాపబుద్ధిగల నా ముఖాన్ని ఇక అరుంధతికి చూపించలేను. కర్తవ్యం - అయోమయం ! గమ్యం -అంధకారం !

(వెనక్కి తిరిగి వడి వడిగా నడిచిపోతాడు)

## నవమ దృశ్యం

(వేదవనంలో ఒక భాగం. ద్వితీయాంకంలోని ప్రథమ రంగాన్ని పోలి వుంటుంది. కాని అప్పటి పచ్చన, నిండు, ప్రకృతిలో ఇప్పుడు లేవు. చెట్ల మీద ఆకులు లేవు. తీగలు వాడిపోతున్నై. దూరంలో ఎక్కడో శకుంత కలకలారవం వినిపిస్తున్నది గాని, ఈ ప్రాంతలో చూడడానికి ఒక్క పిట్టకూడ లేదు. ఏవో నోటికి వచ్చిన శ్లోకాలను వల్లించు కొంటూ కులగిరి ప్రవేశిస్తాడు. అతడు చాల అలసి వున్నాడు. నిరాశ అతని ముఖంనిండా చిక్కిరి గీతలు గీసినట్టుంది.)

కుల : న్నే నెలాగా ౹రిషిని కాలేను. క్కనీసం ప్పండితుణ్ణయినా అవాలని త్తంటాలు పడుతున్నాను. "శతశ్లోకేన పండితః" వ్వసిష్ఠుడు లేకపోవడం వ్వల్ల, ఆశ్రమం ద్దీపం తీసేసిన గదిలా వుంది. ఎక్కడికి పోయాడో ప్పాపం ! ఎక్కడికి పోయినా ప్పదివేల శిష్యుల్ని పెట్టుకోగల సమర్థుడు.

వ్వాళ్ళు ఎంత అందగత్తెలు ! అగ్గి నిప్పులు ! వాళ్ళచేత ప్రేమించబడ్డ వసిష్ఠుడే ధన్యుడు ! మ్మాదిగలైతే అయ్యారు . ప్పెళ్ళాడవోయ్, మిత్రమా ! "స్త్రీ రత్నం దుష్కులాదపి." న్నేను నీకు శిష్యరికం చేస్తా.

(అటూ, ఇటూ పరికించి) ఎంత దూరం వచ్చాను ! ఈ చ్చెట్లని ఒక్క పండైనా క్కనిపించదే ! ప్పిందెలు అలా ౹రాలి పోతున్నాయేమో ? చ్చిగుళ్ళు మాడిపోయాయి ! వ్యాపికలింకిపోతున్నాయి ! న్నిత్య వసంతంగా వుండే మ్మా యాశ్ర రణ్యం ఇలా ఎండిపోయిందేం ? వసిష్ఠుడు గాని శ్శపించి పోలేదు గద ! అతడి ఉసురు ఇలా ద్దెయ్యమై తినేస్తున్నదేమో ఇక మ్మాకు తిండి ఎలా ? (ఎదరకు చూచి) చ్చివరికంటా వచ్చేశాను. అదెవరిదో క్కొత్త ఆశ్రమం అక్కడ కొంచెం ప్పచ్చగానే వున్నట్టుందే ! వ్వెళితే ద్ధురాక్రమణ అవుద్ధి.

"ఆహారే వ్యవహారే చత్యక్త లజ్జా స్సుఖి భవేత్" - ఏమైనా స్సరే - న్నేనింత ఆహారం పట్టుకుపోకపోతే, న్నాపనీ, మ్మా గురువుగారి పనీ సున్నే - (ముందుకు వెళతాడు, హఠాత్తుగా ఆగుతాడు. అవతలి నుంచి ఎవరో ఆటంకపరిచారు.)

(తెరలో)

ఎవ్రడ్రా వాడు ?

కుల : (అదిరిపడి) ఆc ! న్నేను.

(తెరలో)

నా పవిత్రాశ్రమ భూమిలో అడుగుపెట్టిన పాపీ ! పేరు లేదా నీకు?

కుల : క్కులగిరిని. మహర్షి చంద్రమా ! క్కులగిరిని !

(తెరలో)

ఓహో ! కులగిరులా ? ఆహా ! ఏమి నా భాగ్యం ! (శివోహం ప్రవేశిస్తూ) జగదాధారా ! వైకుంఠరూపా ! శరణు శరణు (సాష్టాంగపడతాడు.)

కుల : (మొదట తబ్బిబ్బయి, తర్వాత తెల్లబోయి) ఓరి, న్నీవట్రా ! (వెనక్కిపోతూ) మ్ముట్టుకుంటున్నావ్ !

శివో : (లేవకుండానే) మహాప్రభో ! తమకు కూడా కుల భేదాలు, అంటు దోషాలు, మడి, మైలా, మాయా, మంత్రం వగైరా వున్నాయా. స్వామీ?

కుల : (కలతతో) ఓరి, న్నేను పర్వతం కాదురా ! నా కాళ్ళు వదల్రా !

శివో : కాదు, తమరు కులపర్వతమేనండి, బాబూ, నా దగ్గర అబద్ధ మెందు కాడతారు ?

కుల : న్నేను ప్రాచీనులవారి శిష్యుణ్ణిరా !

శివో : కాదు, నాకు వరం ఇస్తేనేగాని వదల్ను.

కుల : (తల బాదుకొంటూ) ఓరి భగవంతుడా !

శివో : తిరిగి నన్నే భగవంతు డంటున్నారా, స్వామీ ? (తలెత్తి చూచి, లేస్తూ) ఓరి, నువ్వట్రా !

కుల : (నిట్టూర్పుతో) ఆరి, నీ దుంప తెగా !

శివో : ఓరి, నీ కొంప కూలా !

కుల : మ్మాటకు మాటా ?

శివో : చేతకు చేతా.

కుల : పోనీ – రాజీ పడదాం.

శివో : కాదు – ప్రేమించుకొందాం.

కుల : ప్రేమ ! ఎక్కడా ఇదే గొడవలాగుందే ! !

శివో : మనిషికీ మనిషికీ మధ్య ప్రేమకంటే ఉత్కృష్టమైన సంబంధం మరి లేదట.

కుల : ఎ ఎవరు చెప్పారు ?

శివో : మా పెద్దక్క ప్రేమకోసం తపస్సు చేస్తున్నది. హృదయ పరిపక్వానికి, జీవిత సాఫల్యానికి తపస్సే సాధనమట.

కుల : ఓహో !

శివో : ఆమె తపస్సుకు సానుభూతిగా నేను ఇక్కడ తపస్సు చేస్తున్నాను !

కుల : స్సానుభూతి తపస్సా ?

శివో : ఇది ముదిరితే మామూలు తపస్సే కాదటోయ్ ? మా తాతగారి లాగా, నేను కూడా ఒక మహాఋషినై పోతాను.

(దూరంలో "ఒరే. శివోహం" అనే పిలుపు వినిపిస్తుంది. అటు చూచి కులగిరి ఉలిక్కిపడతాడు.)

కుల : అమ్మో ! ఆవిడ వచ్చేస్తోంది. (వెనక్కితిరిగి పారిపోతాడు.)

సంధ్య : (ప్రవేశిస్తూ - అటు కేసి చూచి) ఒరే ! ఆ పోతున్న వారెవరు ?

శివో : వాడా ? వాడొక మనిషి !

సంధ్య : తిన్నగా చెప్పరా, డిప్పకాయ !

శివో : (కోపంగా) మరి. మనిషిని మని షనకపోతే మరే మనాలి ?

సంధ్య : అతని పేరు ?

శివో : కులగిరట.

సంధ్య : (జ్ఞాపకం తెచ్చుకొని) అయితే, నీవు త్వరగా పోయి అతణ్ణి పిలు?

శివో : ఎందుకు ?

సంధ్య : వసిష్ఠుల విషయం కనుక్కోవాలి.

శివో : ఎందుకు ?

సంధ్య : తర్వాత చెపుతా. ముందు పరుగెత్తు ! అతడు దూరం వెళ్ళి పోతాడు.

శివో : ఈ వ్యవహారం నా కిష్టం లేదు.

సంధ్య : ఏ వ్యవహారం ?

శివో : ఈ వర్ణాంతర ప్రేమ వ్యవహారం. ఆ పాటి కుర్రవాడు మన మునిపల్లెలో దొరకడా ?

సంధ్య : ఏడిశావు - ముందు వెళ్ళిరా, తర్వాత చెపుతాను. (శివోహం మూతి ముడుచుకొని పరుగెడతాడు. సంధ్య అలానే చూస్తూ నిలబడుతుంది.)

సంధ్య : ఆహా ! ఎంత కాలం ఈ ఘోర తపస్సు ! వేదబాహ్యం, ధర్మనిషిద్ధం, అభారతీయం, ప్రకృతి విరుద్ధం అయిన ఈ వర్ణభేద కాలుష్యాన్ని నీ తపోవహ్ని దహించగలదా, అక్కా ?

పాషాణాలనే కరిగించగల నీ ప్రేమాగ్నిజ్వాల వసిష్ఠుని నవనీత హృదయాన్నే కరిగించలేకపోతున్నదే ! లోకం భస్మమైనా, అతని లలాట భస్మరేఖ చెదరజాలదు. సంఘ దోషానికి వ్యక్తి శిక్ష ! ఈ విపత్తు ఎలా పర్యవసిస్తుందో వసిష్ఠుని జాడే కనిపించడం లేదు!

(కొంచెం ముందుకు నడుస్తుంది. దూరంలో ప్రజల కోలాహలం వినిపిస్తుంది. సంధ్య అటు పారజూస్తుంది. కోలాహలం సమీ పిస్తుంది. తండోప తండాలుగా ప్రజలు తరలిపోతున్నారు. మహా విపత్తు ఏదో వారిని తురుముకు పోతున్నది. పేటలకు పేటలే, ఆశ్రమాలకు ఆశ్రమాలే ఖాళీ అయిపోతున్నై. ఈ అపూర్వ దృశ్యాన్ని చూస్తూ సంధ్య నిలబడిపోయింది. అందులో ఒక జట్టు ఆమెను సమీపించింది. భీతావహులై అన్నార్తులై సాగిపోతున్న ప్రజలు. గోష్పాద, కుంభోదరం మొదలైన వారు - హడావుడిగా రంగంలో ప్రవేశించారు.)

గోష్పా : పదండి ! పదండి !

కుంభో: పరిగెత్తండి ! పరిగెత్తండి !

సంధ్య : మహర్షులారా ! ఎక్కడికీ పరుగులు ? ఏ మహా విపత్తు మిమ్మల్ని తురుముకొస్తున్నది ?

ప్రజలు: ఆకలి ! ఆకలి !

గోష్పా : సాగండి ముందుకు !

సంధ్య : అయ్యో ! ఏమిటా ఉపద్రవం ?

కుంభో: ఉపద్రవం. మహోపద్రవం !

గోష్పా : ఘోరం. ప్రళయం.

ప్రజ : కరువమ్మా ! కరువు !

కుంభో: ఘోర కరువు ! లోక కరువు !

గోష్పా : జనమంతా చచ్చిపోతున్నారు.

సంధ్య : అయితే- ఎక్కడికీ పరుగులు ?

గోష్పా : బ్రహ్మ దగ్గరకు.

కుంభో: విష్ణు దగ్గరకు.

ప్రజ : ఈశ్వరుడి దగ్గరకు. ఎక్కడికి బడితే అక్కడికే. కూడు దొరికే చోటికి- ఆకలి తీర్చే వాకిలికి.

గోష్పా : ప్రజల దుస్థితి బ్రహ్మదేవుడితో చెప్పుకోవాలి.

కుంభో: అన్నం పెట్టలేనివాడు ఇంత మందిని ఎందుకు సృష్టించాడో- నిలవదీసి అడగాలి.

(ప్రజలలో కొందరు "ఆకలి .... ఆకలి" అంటుంటే మరి కొందరు "అన్నం.... అన్నం" అని నినాదాలు చేస్తారు.)

గోష్పా : నీవు కూడ బైలుదేరు.

కుంభో: లేకపోతే చచ్చిపోతావు.

సంధ్య : మీతో నేను పరుగెత్తలేను.

గోష్పా : నా భుజాలమీద ఎక్కు !

కుంభో: నా నెత్తిమీద కూర్చో ! శివుడు గంగను మోసినట్టు మోస్తా.

గోష్పా : వీడి పొట్టే వీడు మోసుకోలేడు. ఇంకోర్ని మోస్తాడట !

**కుంభో**: (కోపంతో) చూడు నా సత్తా (గోష్పాదాన్ని తన్ని నేలబడవేస్తాడు - అతడు కుంభోధరాన్ని బోర్ల బడనెట్టుతాడు. వాళ్ళిద్దరూ కుస్తీ పడుతుంటారు.)

**ప్రజలు**: శంభో ! ఆకలి ! ఆకలి !

**సంధ్య** : ప్రజలారా ! ఈ నీచ నాయకత్వం మీ కెందుకు ? మా ఆశ్రమానికి రండి ! మాకు కలిగిందే మీకు పెడతాం.

**ప్రజలు**: (అందరూ చేతులెత్తి నమస్కరిస్తూ) తల్లీ ! అన్నపూర్ణా !

**సంధ్య** : (ముందుకు నడుస్తూ) రండి !

**ప్రజలలో ఒకడు** : మరి మా నాయకులు ?

**మరొకడు** : చావ నివ్వండి. వాళ్ళు మనది తినేవాళ్ళేగాని, మనకు పెట్టేవాళ్ళు కాదు.

**ఇంకొకడు** : మనది తినడమే కాదు, మనల్నే తినేస్తారు.

**సంధ్య** : ఈ కరువు కాటకాలకు కారణం ఇలాంటి నాయకులే.

(అందరూ నిష్క్రమిస్తారు. గోష్పాదం, కుంభోదరం ఒక మూల ఇంకా కుస్తీ పడుతూనే వున్నారు. తమను విడిచి అందరూ వెళ్ళి పోవడం చూచి, పోరాటం ఆపి నిలబడ్డారు.)

**గోష్పా** : ఒరేయ్ ! వాళ్ళు చెక్కేసినట్టున్నార్రా !

**కుంభో**: పరిగెత్తరా పట్టుకుందాం !

(ఇద్దరూ రెండోవైపుకు పరిగెత్తబోతారు. అంతలో ఎదురుగా ఇద్దరు వృద్ధమునులు ఒక కుక్కను మోసుకొంటూ వస్తారు. కుక్క మొర్రో అంటూ వుంటుంది. గోష్పాదం, కుంభోదరం బలే కుక్క అన్నట్టుగా ఒకరి నొకరు కనుసైగ చేసుకుంటారు. మునులను సమీపిస్తారు.)

**గోష్పా** : కుక్క ఎందుకు ? మహాముని ?

ఒక ముని : తినడానికి, స్వామీ !

కుంభో: కుక్కను తింటారా ఋషివర్యా ?

రెండో ముని : అసలు, కుక్కలు మాత్రం దొరుకుతున్నాయటయ్యా !

గోష్పా : (అసహ్యం నటిస్తూ) ఛె ! తుఫ్ !

కుంభో: (మరీ ఘోరంగా) ఓఖ్ ! ఓఖ్ !

గోష్పా : ఆ యెదరన్నీ కుందేళ్ళేనే ?

కుంభో: మామిడి చెట్లు విరగబండి వున్నాయిగా ?

మొదటి : ఎక్కడ స్వామీ ?

రెండో : నిజమా ? మహాత్మా ?

కుంభో: మమ్మల్ని చూడరాదటయ్యా ? ఇప్పుడే బాగా గొంతు దాకా మెక్కి, అరక్క కుస్తీ పడుతున్నాం.

గోష్పా : వెధవ కుక్కని పారేసి, త్వరగా వెళ్ళండయ్యా ! ఇప్పుడే కొందరు ప్రజలుకూడ వెళ్ళారు.

మొదటి ముని : దేవుళ్ళులా కనిపించారు, స్వామీ ! (కుక్కను పారవేసి, ఆశతో ముందుకు పోతారు. వాళ్ళు పోగానే, వీళ్ళిద్దరూ కుక్కను ఎత్తుకుంటారు.)

గోష్పా : బలే కుక్కరా ! రెండు రోజులకు సరిపోతుంది –

కుంభో: నాకైతే ఒక్క పూటకు కూడ చాలదు.

గోష్పా : నేను తిన్నంతే నీవూ తినాలి – తెలుసా ?

కుంభో: దుమ్మూ, దుట్రా నాకు పడవేద్దువుగాని లేరా ! (ఇద్దరూ కుక్కను మోసుకుపోతారు.)

## దశమ దృశ్యం

(ప్రాచీనుడి ఆశ్రమం. అంతా కళాహీనంగా వుంది. ప్రాచీనుడు తపస్సు చేసుకొంటూ అనేకసార్లు కళ్ళు తెరిచి చూశాడు. అతడు మనస్సు నిలవడం లేదని ముఖమే చెపుతున్నది. కొంచెంసేపు అలానే కూర్చుని, కళ్ళు గట్టిగా మూసుకోడానికి ప్రయత్నంచేసి, లాభం లేక లేచి నిలబడతాడు. ఇటూ, అటూ పచార్లు సాగిస్తాడు?)

ప్రాచీ : వసిష్ఠుడు ఆశ్రమాన్ని విడిచింది మొదలు ఈ అరిష్టం దాపరించింది! ఆహా ! ఎంతటి ఘోర క్షామం ! ఎన్ని యాతనలు! ఎంత జన క్షయం ! !

ఏ ధర్మగ్లాని, ఏ సాధు హింస, ఏ పతివ్రతా శాపాగ్ని ఈ ప్రళయాన్ని తెచ్చిపెట్టిందో ! ఈ జగన్నాశనాన్ని అరికట్టడం ఎలాగో !

శ్రీ మహావిష్ణువు దగ్గరకు రాయబారం వెళ్ళిన మహర్షులింకా రానేలేదు. అత దేమన్నాడో !

(అంతలో నీరసంగా కాళ్ళీడ్చుకొంటూ కులగిరి ప్రవేశిస్తాడు. ప్రాచీనుడికి సాష్టాంగపడి లేస్తాడు.)

ప్రాచీ : ఏమిరా, శిష్యా ! విష్ణు దేవుడేమన్నాడు ? ఈ కాటకానికి కారణ మేమిటన్నాడు ? దానికి పరిష్కార మేమి చెప్పాడు ?

కుల : గ్గురువర్యా ! అబ్బబ్బా ! ఏమి వైకుంఠ మండీ ! వ్వైకుంఠ మంటే ఇక్కడా, అక్కడానా ? ఎంత దూరం, ఎంత దూరం ! మీ్మరైతే మధ్య దారిలోనే వ్వైకుంఠ యాత్ర చేద్దురు.

ప్రాచీ : నీ వైకుంఠయాత్ర గురించి చెప్పరా ముందు !

కుల : ఎంత వైభవోపేతంగా వుందండీ ఆ ప్పట్నం ! బ్భోగం అంతా అక్కడే వుందండి. ధ్ధాన్యం, ధనం, చీని చ్చీనాంబరాలు అక్కడ ప్పర్వతాల్లా పడివున్నాయంటే న్నమ్మండి. ఇక – అప్సరస లంటారా ? (గుటకలు మింగుతూ) చ్చంద్రశకలాలు – అమృత బ్బిందువులు !!

ప్రాచీ : (విసుగ్గా) అబ్బబ్బా !

కుల : అక్కడివాళ్ళు ఒక్కపూట ఫలహారం మ్మానేస్తే, ఇక్కడ మనకు ప్పది సంవత్సరాల కరువు తీరిపోద్దండి.

ప్రాచీ : (కోపంతో) ఇంతకీ, విష్ణుదేవు డేమన్నాడు ? ఈ విపత్తు దాటిస్తా నన్నాడా ?

కుల : చ్చిత్తం. తనకు చ్చేతకా దన్నాడండి !

ప్రాచీ : ఆఁ ! ఆఁ ! జగత్పోషకుడైన శ్రీ మహావిష్ణువే చేతకాదన్నాడా ?

కుల : మ్మొదట మేం బ్రహ్మగారి దగ్గర కెళ్ళాం. "మ్మనుష్యులందర్నీ సమానంగా సృష్టిస్తున్నాను. మ్మీ లో మీరు భేదాలు పెట్టుకొని, ఒకళ్ళ నొకళ్ళు హింసించుకొంటున్నారు. ఆ ప్పాపం పెరిగి, ఇలాంటి వ్విపత్తులు దాపురిస్తున్నాయి. నే నేమి చెయ్యలే నిప్పుడు. మ్మీరు పోయి విష్ణువు నాశ్రయించండి. ప్పొండి" అని బ్రహ్మదేవుడు స్సెలవిచ్చాడు.

ప్రాచీ : అత డేమి చెయ్యలేడన్న సంగతి నాకు ముందే తెలుసు. అతగాడికి ఆ ఒక్క పనీ తప్ప మరేమీ చేతకాదు.

కుల : చ్చిత్తం. ఆ బ్రహ్మగారి పట్నం కూడా చ్చూడవలసిందే నండి. అదొక చిత్రశాల ! రకరకాల బొమ్మలు వేలు, లక్షలు ఆయనగారు చ్చేసి పారేస్తుంటే, ఆబిడగారు రంగులు పూసేస్తూ, ఊపిరి ప్పోసేస్తూ వుంటుంది! మనందరి నమూనాలు అక్కడ వున్నాయండీ..... నే చూశాను ! నా

బొమ్మను ఎర్రమట్టితో చేశారు. నక్షత్రాలను సానబట్టిన కాంతి రజనుతో చేశారండి ఆడబొమ్మను ! ఆ ముఖ లక్షణాలు నే నెక్కడో చ్చూసిన గుర్తు! (ప్రాచీనుడు చేసేదిలేక నిట్టూర్పు విడిచి వూరుకుంటాడు. )

కుల : అక్కడి నుంచి ద్దేవుడా అంటూ. వైకుంఠానికి పోయాం. ఆయనగారు అంతఃపురం వ్విడిచి బైటికి రావడమే మ్మహా గగనమైపోయింది.

ప్రాచీ : శ్రీ మహాలక్ష్మి లేదా ?

కుల : ఎవరో చెంచులక్ష్మట ! అసలు ఆయనగార్ని ఓ పట్టాన బైటికి వదిలి తేనా? (కొంచెం ఆగి) "అరుంధతి అనే కన్యారత్నంఘోర తపస్సు చేస్తున్నది. మ్మీరు పరమశివుణ్ణి ఆశ్రయించండి. శ్శుభం కలుగుతుంది" అన్నారాయన.

ప్రాచీ : (నిశ్చేష్టుడై) అన్నన్నా !

కుల : అక్కడి నుంచి మ్మళ్ళీ ప్పరమేశ్వరా అంటూ – ఆ కొండలన్నీ ఎక్కి కైలాసానికి వ్వెళ్ళేటప్పటికి మ్మా పెద్దలు దిగి వచ్చారు ! (పెద్ద నిట్టూర్పు విడుస్తాడు) గ్గురువర్యా ! ఈ దేవుళ్ళకు ఎక్కడా చ్చోటు లేనట్టు ఆ కొండల్లో కట్టుకొన్నారే మండి ప్పట్టణాలు ?

ప్రాచీ : ఆ ప్రశ్న మనం అడగకూడదు.

కుల : న్నాకు తెలుసండి . ఆ పర్వతాల సౌందర్యానికి సమ్మోహితులై అక్కడ చేరారు. లేకపోతే... ప్రజలకు దగ్గర్లోవుంటే లోకువై పోతామని భయపడైనా అక్కడ చేరివుండాలి.

ప్రాచీ : దైవదూషణ పాపంరా ! నోరు మూసుకో !

కుల : చ్చిత్తం (నోరు మూసుకుంటాడు)

ప్రాచీ : ఓరి మందబుద్ధీ ! సాంబ శివుడేమన్నాడు ?

కుల : ఆయన అక్కడ ల్లేడండి.

ప్రాచీ : (పెద్ద నిట్టూర్పు విడుస్తాడు) కైలాసములోనే లేడా ?

కుల : అంతకు ముందే అరుంధతీ ఆశ్రమానికై బైలుదేరాడట! అక్కణ్ణుంచి చ్ఛచ్చినట్టు కొండదిగి, మళ్ళీ పరిగెత్తాం.

ప్రాచీ : ఎక్కడ దొరికాడు ?

కుల : ఇంకా దొరకలేదండి.

ప్రాచీ : (నిరాశతో) పరమేశ్వరా ! ఇప్పుడేమిటి కర్తవ్యం ?

కుల : ఇప్పుడక్కడికి వ్వెళతామండి. కాని .. అక్కడికి ఎలా వ్వెళ్ళడమా అని .....

ప్రాచీ : అదే ఆలోచిస్తున్నాను.

కుల : ప్పరమేశ్వరుడి కోసం వ్వెళుతున్నాం కాబట్టి , ఆకాస్త సేపు....

ప్రాచీ : కావచ్చు, అతడెక్క డుంటే అక్కడికి వెళ్ళడంలో తప్పుండ గూడదు.

కుల : అవ్విధంగా కొన్ని సూత్రాలు మ్ముందే రాసిపారేయండి.

ప్రాచీ : (ఆలోచిస్తూ) పద. ఆ సరస్సు వరకు నేను కూడ వస్తాను. (ముందుకు సాగుతారు. రంగంమీద కాంతి రంగులు మారతై. వెలుగునీడలు దూరమవుతై. హఠాత్తుగా ఒకచోట ఆగుతారు. పొదల అవతలినుంచి హెచ్చరిక వినిపిస్తుంది.)

ఆగండయ్యా, ఆగండి ! మహా జోరుగా వచ్చేస్తున్నారు !

కుల : (అదిరిపడి) శ్శి... ... శ్శివో......

ప్రాచీ : (సంభ్రమంతో) ఆఁ ! శివుడా ! సాంబశివా ! ఆపద్బాంధవా ! ఓం......

కుల : (వారిస్తూ) క్కాదండి గురువుగారూ ! వ్వాడండి, వ్వాడు, శ్శివోహంగా డండి!

ప్రాచీ : (కోపంగా) అంటే ?

కుల : అరుంధతి తమ్ముడండి !

శివో : (ప్రవేశిస్తూ) ఎవరు మీరు ?

కుల : (ముందుకు వచ్చి) మ్మేం రా, మేం! నన్ను మరచిపోయావా యేం ?

శివో : ఎవరైనా సరే, ఈ ఆశ్రమంలో ప్రవేశించగూడదు.

కుల : ఒక్కసారికే రా !

శివో : లాభంలేదు. మా పెద్దక్క తపస్సు చేస్తున్నది. ఆమె ఏకాగ్రతకు భంగం కలగగూడదట !

ప్రాచీ : అబ్బాయి ! గట్టి వాడవు. మీ అక్క ధన్యురాలు. ఆమెకు పరమేశ్వరుడే దర్శన మివ్వడానికి వస్తున్నాడు. నీవు కూడ పోయి, ఆయన కృపను సంపాదించుకో !

కుల : (ఎదరకు చూపుతూ) ఓహో ! మ్మంటలు ! మ్మంటలు !

ప్రాచీ : (చేతులు జోడించి) ఓహో ! అరుంధతి తపోమాహాత్మ్యం !

శివో : (కంగారుగా) ఓ ! మా అక్క ! కాలిపోతున్నది ! మీరు రాకండి సుమా ! (ఎదర మంటలు కనిపిస్తున్న వైపుకు పరిగెడతాడు. కులగిరి, ప్రాచీనుడు నిశ్చేష్టులై అలానే నిలబడిపోతారు రంగం అదృశ్యమై పోతుంది.

## ఏకాదశ దృశ్యం

(అదే వనంలో మరో ప్రాంతం. సరోవరతీరం. ప్రకృతి అంతా ఏదో బెంగగా వున్నట్టు కనిపిస్తుంది. వసిష్ఠుడు మెల్లగా నీరసంగా అడుగులు వేసుకొంటూ ప్రవేశిస్తాడు. అరుంధతిని గురించిన మనోవ్యధ కోటి కైలాసాల బరువుతో అతణ్ణి అదిమి వేస్తున్నది. ఆమె హృదయంతో ముడిపడ్డ అతని జీవనవల్లరి అతడు దూరంగా పోతున్న కొలదీ బిగువు పెరుగుతున్నది. అది తెగిపోతుందో.... అతడు ఆగిపోతాడో ! )

వసి : అరుంధతీ ! నీ నుంచి నేను దూరంగా నడిచిపోతున్న కొలదీ నీకు నేను దగ్గరగాచేరి వస్తున్నట్టుగా వుంది. ఇదే నిజమైతే ఎంత అదృష్టం ! భూవలయంలో అట్టిది సాధ్యమా ?

**తలిరాకు కిటికీల దరిజేరి యేపు చూ**
**పులు మాటిమాటికి పలుకరించు !**
**చూపులా అవి ! కావు ! సూటిగా నా యాత్మ**
**సారసమ్మును చేల్చు షట్పదములు !**
**చెంగల్వమోవి చీల్చిన కావి లేనవ్వు**
**ఎండలు గాయు నా గుండెలోన !**
**గుండెకా దిది – హోమకుండము, పలుకొక్క**
**నేతిబొట్టుగ మందు నిప్పు లందు !**
**నీరజాస్య నాకు నిత్యాగ్ని హోత్రమై**
**నమిలి మ్రింగసాగె నన్ను నన్ను !**
**ప్రణయ యజ్ఞ మందు ప్రాణాలను యజించి**
**సోమపాన మగుదు సుదతి పెదవి !**

(ఒక లతా వేదిక మీద కూర్చుంటాడు. హస్త ముకుళం అగ్రాన్ని క్రింద

పెదవికి ఆనించి దీర్ఘాలోచనలో మునిగి పోతాడు. అతని పంచ ప్రాణాలు పంచ భూతాలతో చేరి పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నట్టుగా వుంది. నిజంగానే ప్రార్థన స్పష్టంగా వినిపిస్తున్నది. అది సంధ్య నివేదనగా, అరుంధతి ఆరాధనగా తలంచబడవచ్చు. లేక .... లోకమే ఆరాటపడుతున్నదేమో !)

(తెరలో)

నీవే గతివి- నీవే పతివి-
నిఖిలావని కో దేవా,
కమ్మని తేనెకు, కరకు ముల్లునకు
కాదవు నీవే నోదేవా !
జీవనపతి ! నా జీవితగతిలో
పూవులు వుడికిన దీవేనా !
కరుణకు పట్టిన ధరణీ హస్తము
కరవున నింపుట తగవేనా ?
ప్రణయమె మొలవని పాటినేలలో
ప్రణవ కోకిలారవమా !
హేతువు తెలియని యాతనలో, నీ
వ్రాతకు శీతువె ఫలమా ?

(వసిష్ఠుడు సావధానంగా విన్నాడు. నిట్టూర్పు విడిచి లేచాడు.)

వసి : తపస్సు చేశాను. అదొక యేడారి. ఒక నీటి చెలమ లభించింది. అది ఆ క్షణమే ప్రాచీన తీవ్ర వాతోద్ధూతమైన ఇసుకతో పూడిపోయింది. ఈ జీవితంలో ఇక తపస్సు లేదు. తపస్సు లేక జీవితమే లేదు. నమ్మించి మోసంచేసిన నా ముఖం అరుంధతి చూడదు. ఇక నాకు దిక్కు నీవే! ఓ మృత్యువా ! నన్ను తీసుకుపోయి, నీ అనంత కాల గర్భంలో దాచేసుకో !

కుల విభేదంపు కఠిన శృంఖలము ద్రెంచి
మోక్షముం బొందజాలని మూఢు నేను
సత్త్వ హీనుని బ్రతుకు వర్జ్యమ్ము, కాన
రమ్ము, మరణము! కరుణ గైకొమ్ము నన్ను !

(అదే సమయానికి పరమశివుడు ప్రవేశిస్తాడు. హడావిడిగా ప్రయాణమై పోతున్నట్లు వుంటాడు. అందువల్ల పాముల కండువాలు వగైరా ఏమీ లేవు. జుట్టుముడిలో చంద్రవంక జారిపోతూవుంది. చేతిలో త్రిశూలం లేదు. ఈ వేషంలో అతణ్ణి గుర్తుపట్టడం కొంచెం కష్టం. అతడు వసిష్ఠుని చూచి ఆగాడు.)

**పరమ :** మరణమా ? ఎవరికి బాబూ ?

**వసి :** (తలెత్తి చూచి) నాకే ! మహాశయా ! నాకే ! మరణం గురించి మీకేమైనా తెలుసా ? అది నాకెలా లభిస్తుంది ?

**పరమ :** ఏ మరణం ?

**వసి :** (అప్రతిభుడై) ఏ మరణమా ? ఎన్ని మరణాలున్నై ?

**పరమ శివుడు:** చాల వున్నై. అందులో నీకు ఏ మరణం కావాలి ?

**వసి :** వ్యర్థజీవికి తగినది ఏదైతే అది.

**పరమ :** అయితే, అది దీర్ఘయాతనామయం. నీవు భరించలేవు. అయినా, నీవు అంత కఠిన వ్రతానికి ఎందుకు పూనుకొన్నావు ?

**వసి :** మరణించడం కఠినవ్రతమా ?

**పరమ :** వ్యర్థజీవిగా మరణించటం కఠినమే కాదు, క్రూరం కూడ, పురోగతి జీవి స్వభావం దాన్ని బలవంతంగా ఆపడం బహు బాధాయుతం.

వసి : ఎవరు ఆపడం ?

పరమ శివుడు: వ్యక్తి, సంఘం, పరిస్థితి, ఆంతరంగిక జాడ్యాన్ని నిర్మూలించుకొని, బాహ్యబంధాలను త్రెంచుకొని, ముందుకు దూకడమే చైతన్య లక్షణం. చైతన్యం మంచి పోటులో గల బాల యౌవనం నీది. నీ పురోగతిని అడ్డగల దేది ? పోదాం పద !

వసి : ఎక్కడికి ?

పరమ : నీ వెక్కడికి పోతున్నావో అక్కడికి నేనుకూడ వస్తా.

వసి : (నిరుత్సాహంగా) మీరా ? మీరు రాలేరు, స్వామీ ! మీరు రాలేరు. నా దారి నాదే. అది మీకు అగమ్యం.

పద పదమ్మున కంటక వ్రజము కనుకు
కనుకు దిగు చుండ, కోటి కర్కశ కఠోర
నరకముల బాధతో నేను నడుచుచుంటి
కరుణలేని నిశీధ మార్గమ్ము నందు !

పరమ : అటువంటి కర్కశ కఠోరమార్గం నీ కెందుకు, నాకెందుకు ? నా మార్గంలో పోదాం పద ! నా మార్గం నిన్ను మహదానంద పదం చేర్చగలదు. స్వాభావికమైన మా పార్వతేయ ప్రణయ జీవనం సౌఖ్యానికి దోహదం కాగలదు. మా నిలయం శాంతికి పూజాగృహం, కాంతికి రాచబాట, క్రాంతికి రంగస్థలం.

గజ చర్మంబులు గట్టి, పాము తలపా
గాల్ జుట్టి, భూమీధర
వ్రజముల్ మెట్టుచు, గంగ గట్టులను వి
శ్రాంతిన్ ప్రవర్తిల్లుచున్,

రజనీకాంతుని నీడలన్ అమృత శృం

గారమ్ములన్ దేలు మా

సుజన స్నేహములో సుఖమ్ము గొనవ

చ్చున్. రమ్ము, మా వీటికిన్

(వసిష్ఠుని చేయి పట్టుకొని లాగుతాడు – వసిష్ఠుడు పులకిత దేహుడవుతాడు.)

వసి : మహాత్మా ! మీ స్పర్శ నాకేదో అపూర్వ శక్తిని ప్రసాదించి నట్టయింది! మీ రెవరో మహాసత్త్వ సంపన్నులైన లోకోత్తర పురుషులై వుండాలి. మీ అవ్యాజ వాత్సల్యానికి కృతజ్ఞుణ్ణి. కాని....

మీరు హిమవన్న గోరుకాంతార కుసుమ

రుచుల కోసము పుట్టిన ఋషులు, నిజము

నాది చింతావిభిన్న భాండపు చరిత్ర,

ఇంకిపోయిన దెవరును ఎత్తలేరు.

నా దారిని నన్ను పోనివ్వండి ?

పరమ : (ఆలోచన నటించి) బహుశా నీ దొక భగ్న ప్రణయ చరిత్ర ! ఈ తాపస కుమారుణ్ణి తాపజ్వాలలలో పడద్రోసి పోయిన ఆ కఠినాత్మురాలు ఎవరో!

వసి : ఆమె కాదు, నేనే కఠినాత్ముణ్ణి. ఆమె మాధవీలత. నేను ఝంఝూ మారుతాన్ని, జాత్యంహంకారం, స్వామీ ! నన్ను సర్వనాశనం చేసింది జాత్యహంకారం.

పరమ : జాత్యహంకారమా ?

వసి : ఔను. నేను ఆర్యజాతివాణ్ణి, అనార్య కన్యకను ప్రేమించాను.

పరమ : (నవ్వి) ఓయి పిచ్చివాడా ! భారతదేశంలో ఆర్య, అనార్య భేదం కలదా?

అలనాడు తొలి హిమ ప్రళయమ్మునకు ముందు
ఉత్తర ధ్రువ భూము లుద్ధరించి ;
ఆ వెన్క, సైబీరియా యెడారులలోన
తిండి, బట్టయులేక తిరిగి తిరిగి;
క్రమముగ, పారసీకపు నీటి పట్టుల
స్థిమితమ్ముగా కాపురములు పెట్టి;
చాలక, భరతదేశము జేరి, శాంతి సు
స్థిరతలు కనుగొన్న నరులలోన
భూరి సత్త్వులు ద్రవిడులు మొదటి జుట్టు
వెనుక వచ్చిన దార్యులు; వీరు వారు
అన్నదమ్ముల కలహాల దన్ను కొనిరి;
ఎవ్వ రార్యులు, ద్రావిడు లెవరు, నేడు?

ద్రావిడులు, ఆర్యులు ఒకే ఒక జాతికి చెందినవారు, సోదరులు కారా ? దితి, అదితుల సంతానం కారా ? అదీగాక - పెరుగుదలలో పరిసరాల ప్రాబల్యం మినహాయిస్తే, మానవ జాతి అంతా ఒక్కటే కాదా, బాలర్షీ ?

వసి : (విచారంతో నిట్టూర్చి) అజ్ఞానం క్షమార్హం కానిది- మహాత్మా ! అజ్ఞానానికి మించిన పాపం మరి లేదు గదా !

పరమ : జ్ఞానసూర్యోదయంతో అజ్ఞానాంధకారం నశించిపోదా ?

వసి : ఈ సాయంకాల సూర్యోదయం నిష్ఫలం, స్వామీ ! ఈ జ్ఞానం ఆనాడే వుండి వుంటే, ఆమె హృదయాన్ని అంత గాయపరిచేవాణ్ణి కాదు కదా!

పరమ : ఇప్పుడు మించిపోయిందేమీ లేదు, కుమారా ! అజ్ఞానంతో చేసిన తప్పును జ్ఞానంతో దిద్దుకోవచ్చును.

వసి : చీకటిలో కొట్టినదెబ్బ వెలుగులో బాధపెట్టదా, స్వామీ ?

పరమ : దానిని పశ్చాత్తాపంతో తుడిచివెయ్యవచ్చును. పొరపాటు చెయ్యడం మానవలక్షణమే. అది తెలిసిన తరువాత వెంటనే దిద్దుకోకపోవడం మాత్రం పశులక్షణం. నీ కోసం ఆమె ఎంత పరితపిస్తున్నదో కదా ! పైగా, మహా తపస్విని, మాతంగ కన్య, అరుంధతి సర్వార్య సమారాధ్య కాదా, బాబూ?

(వసిష్ఠునిలో సుడిగాలి రేగింది. అంతలో సంధ్య కంఠ స్వరంతో దూరంలో పాట వినిపిస్తుంది. ఇద్దరూ సావధానంగా వింటారు.)

(తెరలో)

కన్ను గప్పిన కాళరాత్రిని
తెన్ను దప్పిన తెరువరీ !
తెల్లవారిన దోయి జగమున
కల్లజారినదోయి నిజమున !
ఆగి చూడుము, తెరువరీ !
అడుగు త్రిప్పుము, తెరువరీ !
అమృత మనుకొని నిన్ను గ్రోలిన
ఆత్మ భగ్గున మండుచున్నది !
భస్మమందు లిఖించి, ఊదిన
ప్రణయగీతము వేగుచున్నది !
రమ్ము వెనుకకు, తెరువరీ !
వమ్ము కాకుము తెరువరీ !

వసి : (తత్తరపాటుతో ) ఓహో ! సంధ్యా ! ఏమైనా సరే, ఇక నేను తడవుచెయ్యను. క్షణంలో వెళ్ళి, నే నామె క్షమాభిక్షను వేడుకొంటాను. స్వామీ ! తరువాత కలుసుకొందాం (నిష్క్రమిస్తాడు)

పరమ : (చిరునవ్వుతో అతడు వెళుతున్న దారివంకే చూస్తూ) వసిష్ఠా ! ధన్యుడవు !

సంధ్య : (వెనుకనుంచి ప్రవేశిస్తూ ) అయ్యో ! స్వామీ ! మీరిక్కడున్నారా? లోకమంతా మీ కోసం వెతకలేక చస్తున్నది !

పరమ : నీ విలా తిరుగు తున్నావేం. ఈ కొండల్లో ? అరుంధతి క్షేమమా ?

సంధ్య : పాపం ! ఏమీ తెలియనట్టు !

పరమ : నా కెలా తెలుస్తుంది ?

సంధ్య : సరే కానివ్వండి. ఇప్పుడు మనం మా ఆశ్రమానికి పోవాలి శీఘ్రంగా.

పరమ : ఎందుకు ?

సంధ్య : పని వుంది.

(అంతలో గోష్పాదం, కుంభోదరం, కులగిరి, మరి కొందరు ప్రజలు వగర్చుకొంటూ, పరుగుపరుగున అక్కడికి వస్తారు. ఆకలి-అన్నం అనే నినాదాలు మిన్ను ముట్టుతాయి. పరమశివుణ్ణి చూచి ఆగుతారు.)

గోష్పా : ఈయనగారే శివుడై వుండాలి. ఆగండోయ్, ఆగండి !

కుంభో : ఈయన అయి వుండడు. పదండ్రా ! పదండి !

గోష్పా : వెనుక సతీదేవిలా వుందిరా ! ఈయనే అని నా విశ్వాసం !

కుంభో : మరి, త్రిశూల మేదీ ? పాము లేవీ ?

కుల : మూడోకన్ను అది కాదటోయ్ ? శ్శివుడే ! శ్శివుడే !

ప్రజ : దేవా ! ఆకలి ! ఆకలి !

గోష్పా : ప్రభో ! అన్నంలేదు.

కుంభో : తినడానికి గడ్డికూడా లేదు.

గోష్పా : కుక్కలు కూడా అయిపోయాయండోయ్ !

కుంభో: కొండలు కొరకబడ్డంలేదు.

కుల : స్వామీ ! మ్ముందు నాకో కాయో, కృసరో దయచేద్దురా - మ్మీ పేరు చెప్పుకు బ్రతుకుతాను.

పరమ : ప్రజలారా ! ఈ కరువుకు, మీ కష్టాలకు నేను చాల విచార పడుతున్నాను.

గోష్పా : మీ విచారంతో మా కడుపులు నిండవు.

కుంభో: తక్షణం మా కడుపు కింత ఏదో పెట్టకపోతే, మా జీవనాలుండవు.

గోష్పా : అన్నం సృష్టించండి !

కుంభో: ఆలస్యం చెయ్యకండి !

పరమ : (కోపంతో) ఓరి, మూర్ఖులారా ! భూమికి భారంగా ఇంతమంది ద్విపాదపశువుల్ని సృష్టించడం అసలు బ్రహ్మది తప్పు. తిండి పెట్టలేని తప్పు విష్ణువుది. స్థితినిబట్టి సృష్టి, సృష్టినిబట్టి స్థితి ఏర్పాటు చెయ్యబడ వలసివుంది. ఆ రెంటికీ సమన్వయం కుదరని నాడు, నేను కలుగ జేసుకుంటాను. వారిద్దరి తప్పుల్నీ దిద్దే లయకారుణ్ణి నేను.

గోష్పా : (వణుకుతూ) చచ్చాంరా, కుంభోదరం !

కుంభో: (మరీ వణుకుతూ) మూడో కన్ను తెరుస్తున్నాడ్రోయ్, గోష్పాదం !

ప్రజలు: దేవా ! ఆకలి ! ఆకలి !

సంధ్య : (ముందుకు వచ్చి కేలుమోడ్చి) దేవా !

కులగిరి: (సంధ్యను గుర్తించి) అమ్మో ! మ్మాదిగ పిల్ల ! మ్మాదిగ పిల్ల ! పర మేశ్వరా ! మ్మాదిగపిల్లను మ్ముట్టుకొంటున్నావ్ ! మైలపడి పోతావ్ !

గోష్పా : తొలగండి ! తొలగండి !

కుంభో: తప్పుకోండి ! తప్పుకోండి !

గోష్పా : ఆ మైలచేతులతో మా కేమిచ్చినా పుచ్చుకోం.

కుంభో: చస్తే చస్తాం.

ప్రజలు: దేవా ! ఆకలి ! ఆకలి !

పరమ : (నిరాశతో) ఈ సృష్టిని చేసిన వాడు పిచ్చివాడై వుండాలి. ఎంత అజ్ఞానం! ఎంత స్వార్థం ! ఎంత పరస్పర ద్వేషం ! ఈ నికృష్ట జాతి నశిస్తేనేం ? (ఇటూ, అటూ చూస్తాడు)

సంధ్య : (అంజలి ఘటించి) దేవా ! చంద్రశేఖరా !

చీదపుర్వు పట్టిన దను కోపము
చెట్టుపైని చూపెదవా ?
విషజీవులు నల్గురికై లోకము
విలయములో ముంచెదవా ?
దేవా ! ఏలు !
దీనదయాళు !
కనుగొనుమా ఆ పేదల బాధలు
కన్నులు లోతుకుపోయి.....
వినపడవా ఆ ప్రేవుల మోతలు
వెన్నున కంటుక పోయి ?
దేవా ! ఏలు !
దీనదయాళు !

(మోకాళ్ళపై నిల్చి - పాదాభివాదం చేస్తుంది.)

పరమ : (సంధ్యను వారించి, అభయం ఇచ్చి, కొంచెంసేపు ఆగి) ప్రజలారా ! మీ రెంతకాలం కుల మత వర్గ విభేదాలతో అజ్ఞానులై ప్రవర్తిస్తారో అంతకాలం మీకీ అరిష్టాలు తప్పవు. ఇక ప్రస్తుతానికి మిమ్మల్ని ఈ విపత్తునుంచి రక్షించగలవారొక్క పతివ్రతలు మాత్రమే. మీరు పోయి పతివ్రతలను ఆశ్రయించండి. వారు మీ కింత భిక్ష పెట్టగలరు.

గోష్పా : పదండి - పదండి !

కుంభో: పరిగెత్తండి ! పరిగెత్తండి !

ప్రజలు: ఆకలి ! ఆకలి ! (నిష్క్రమిస్తారు)

సంధ్య : పాపం. అమాయకు లెంత మంది యమయాతనలు పడు తున్నారు ! చాలమంది ప్రజలు మా ఆశ్రమంలో తలదాచు కొంటున్నారు. ఎందుకో మా ఆశ్రమంలోకి ఈ కాటకం ప్రవేశించలేదు !

పరమ : కలిగిన దానితో సంతృప్తిపడే కష్టజీవులను కరువు బాధించదు.

సంధ్య : (ఎదరకుచూచి) స్వామీ ! అతడే ప్రాచీనుడు ! ఇలానే వస్తున్నాడు ! ఆర్యధర్మం యావత్తూ అతని భుజస్కంధాల మీదనే నిలిచివున్నదని అతని ఊహ !

(అంతలో దీర్ఘాలోచనా పరతంత్రుడై ప్రాచీనుడు ప్రవేశిస్తాడు. చాల నీరసంగా, నిరుత్సాహంగా వుంటాడు - మెల్లిగా నడుస్తున్నాడు)

ప్రాచీ : ఒక మాదిగపిల్ల తపస్సు చెయ్యడం ! ఇటువంటి ఉత్పాతాలు సంభ వించడం! ఎంత విపరీతంగా వుంది ? ఇక ఆర్యజాతి అడుక్కు తిన్నట్టే !

(కొంచెం నడచి, అటు చూస్తాడ. సంధ్యా పరమశివులు కనిపిస్తారు. ఆశ్చర్యపోతాడు. అరుంధతీ వసిష్ఠులను కుంటాడు. నెత్తి బాదుకుంటాడు)

అయ్యో ! కర్మ ! కర్మ ! వసిష్టా ! నా సలహాను తిరస్కరించి, చివరకు ఆ మాదిగపిల్లనే చేరావా ? ఈ ధర్మగ్లాని. ఈ ఘోరకలి నేనిక చూడలేను. (చూడలేను. తప్పుకొని పోబోతాడు.)

పరమ : మునిపుంగవా ! అభివాదాలు.

ప్రాచీ : (ఆగి, పరీక్షగా చూచి) వసిష్ఠుడనుకొన్నాను ! క్షమించాలి. తమర్ని ఇదివరలో చూచిన జ్ఞాపకం లేదు !

పరమ : నన్ను పరమశివుడంటారు.

ప్రాచీ : (కంగారుపడి) ఓహో ! పార్వతీ పరమేశ్వరులారా ! ఆది దంపతులారా! భక్తుడు నమస్కరిస్తున్నాడు

సంధ్య : నేను సతీదేవిని కానండోయ్ ! సంధ్యను, సంధ్యను (నమస్కరిస్తాడు) !

పరమ : మహర్షీ ! ఈమె అరుంధతి అక్క చెల్లెలు.

సంధ్య : వీరు మా తాతగారు.

ప్రాచీ : (ఆశ్చర్యంతో ) ఆc ! ఇదెక్కడి సంబంధం ?

సంధ్య : ఆద్యార్య సంబంధం.

ప్రాచీ : అరుంధతి మాతంగ కన్యకాదా ?

సంధ్య : పరమేశ్వరుడు కూడా మాతంగుడే, కాటికాపరి.

పరమ : ఋషివ్యాఘ్రా ! మీరు కూడ అంతే !

ప్రాచీ : (కోపంతో) నాతో వేళాకోళమా ?

పరమశివుడు : కాదు- మునిసింహా-కాదు. నేనన్నది సత్యమే. అధికారం కోసం ఆర్య ద్రావిడుల మధ్య జరిగిన అనేక యుద్ధాల పర్యవసానంగా సమాజంలో హెచ్చు తగ్గు లేర్పడ్డాయి. గుణాల ననుసరించి వృత్తులు పుట్టాయి. వృత్తుల ననుసరించి వర్ణా లేర్పడ్డాయి. అవే కులాలైనాయి. మతంగ మహర్షి సంతానం మాల మాదిగలు. మతంగుడు ఆర్య ద్రావిడ సమైక్యతామూర్తి. ఆర్య ద్రావిడులు మూలార్యజాతి శాఖలు. అన్నదమ్ములు. ఈ భేదాలు తాత్కాలిక

రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ సముద్రంలో పుడుతూ పోతూవుండే అలలవంటి వని తెలిసికూడ, మీ వంటి పెద్దలు వీటిని శాశ్వతంగా పాటించబూనడం కడుంగడు శోచనీయం.

ప్రాచీ : (ఆలోచిస్తూ) ఈ సంగతి నాకు తెలియదే !

సంధ్య : మన ప్రపంచజ్ఞానం మన ఆశ్రమానికే పరిమితం, స్వామీ !

ప్రాచీ : అయితే, ఆర్య ద్రావిడు లొకే జాతి అంటారా ?

పరమ : పూర్తిగా కశ్యప సంతానం.

సంధ్య : పూర్వార్యులు, పుణ్యదేవులు మన ప్రాచీనులే, స్వామీ !

పరమ : (నవ్వుతూ) పైగా, ఆత్మజ్ఞానికి ఈ గందరగోళం అంతా దేనికి? మహర్షీ ! ఈ అనంత విశ్వ మానవ చరిత్రలో ఒక్క అక్షరం తలకట్టు కూడ కావాలని మన అల్ప జీవితాల కోసం ఇంత ఆర్భాటం ఎందుకు ?

(ప్రాచీనుడు మాట్లాడడు. దూరంలో ఆకాశం తేజోవంతం అవుతుంది. అందరూ అటుకేసి చూస్తారు)

ప్రాచీ : (చేతులు మోడ్చి) అరుంధతీ తపోమాహాత్మ్యం !

పరమ : పదండి , అక్కడికి వెళదాం.

(సంధ్య ముందు నడుస్తుంది. ఆ వెనుక పరమశివుడు, ప్రాచీనుడు నడుస్తారు. వారి వేగం హెచ్చేకొలది రంగం అదృశ్యమైపోతూ వుంటుంది.)

## ద్వాదశదృశ్యం

(అరుంధతి ఆశ్రమం. ఎర్రటి కాంతితో రంగం ఉజ్జ్వలంగా వుంది. అరుంధతి నిలబడి తపస్సు చేస్తూ వుంది. ఆమె చేతిలో వసిష్ఠుని కమండలువు, జపమాల అలానే వున్నై. ఆమె శరీరం నుంచి తెల్లటి మంటలు పైకి వస్తున్నై. అవి మంటలో– ఆమెను కాలిపోకుండా రక్షిస్తున్న వెన్నెల వెలుగులో ! ఆమె వదన బింబం నుంచి వెలువడు తున్న తేజస్సు స్వచ్ఛమైన శరన్మేఘంవలె అశాంతరాళాలకు వ్యాపిస్తూ వుంది. ఇది అసలు మేఘాలను నిర్జించడంవల్ల కాబోలు అనావృష్టి ఏర్పడి, కరువుగా పర్యవసించింది. శివోహం ఒక పాత్రతో నీళ్ళు తీసుకొని, ఏమీ తోచక కంగారుపడుతూ, అరుంధతి చుట్టూ తిరుగుతున్నాడు. )

శివో : అయ్యో ! అక్కా! ఎలాగే ఇప్పుడు ? ఎక్కడ పొయ్యను నీళ్ళు? ఎలా ఆరుతుందీ అగ్ని? ఇది మామూలు అగ్నా ఆర్పడానికి ! (పాత్ర అక్కడ పెట్టేసి) తపోవహ్ని ! ఎందుకొచ్చిన తపస్సే తల్లీ ఇది ? ఇదంతా ఆ వసిష్ఠుడివల్ల వచ్చింది. అతణ్ణి నమ్మావు, మోసం చేశాడు. మగవాణ్ణి నమ్మిన ఏ ఆడపిల్ల బాగుపడింది ? కొరివితో నెత్తి గోక్కున్నావు. నెత్తంటుకొన్నది ! మంటల్లేవు, మండి పోతున్నావు ! ఇప్పుడు నే నేం చెయ్యను ?

వసి : (ఆందోళనగా ప్రవేశిస్తూ) అరుంధతీ ! అరుంధతీ ! ఆహా, ఏమి ఈ దివ్యజ్యోతి !

శివో : (అడ్డగించి) ఆగవయ్యా ! ఆగు ! ఇదంతా నీ చలవే ! (భస్మం వాసన గుప్పున కొడుతుంది. శివోహం ముక్కు నలుపు కొంటాడు.)

వసి : అరుంధతీ ! ప్రాణసఖీ ! తపోవహ్నిలో భస్మమై పోతున్నావా ? నీ కన్న ముందు నేనే యోగవహ్నిలో చితాభస్మం అవుతున్నాను. మనిద్దరి భస్మాలు కలిసే పరమేశ్వ రారాధనలో విభూతిపుండ్రం అగుగాక !

(అరుంధతి సరసను నిలబడి యోగముద్ర ధరిస్తాడు. అతని శరీరంలో నుంచి కూడ మంటలు బైలుదేరతాయి. భస్మం వాసన మళ్ళీ గుప్పుమంటుంది. అంతలో పరమశివుడు తక్కినవారు త్వరితంగా ప్రవేశిస్తారు.)

పరమ : వసిష్ఠా ! ఆగు. ఈ మహాచరిత్ర విషాదాంతం కారాదు. (కమండలువులోని తీర్థం తీసి, ఇద్దరిమీదా చల్లుతాడు.)

అరుం : (కన్ను తెరచి, ప్రక్కనున్న వసిష్ఠుణ్ణి చూచి) ఋషి కుమారా ! పాదదాసి అభివాదం చేస్తున్నది.

వసి : (కన్ను తెరచి) ఓహో ! ప్రియా ! ఎంత అదృష్టవంతుణ్ణి !

అరుం : (పరమశివుని చూచి, భక్త్యావేశంతో ) దేవా ! భక్తురాలు నమస్క రిస్తున్నది.

పరమ : కల్యాణమస్తు.

అరుం : (ప్రాచీనుడితో) మునికులావతంసా ! వందనాలు స్వీకరించి – ఆశీర్వదించండి!

ప్రాచీ : పుత్ర పౌత్రాభివృద్ధి రస్తు !

వసి : ప్రాచీనా ! నన్ను క్షమించు.

ప్రాచీ : అరుంధతి కిచ్చిన దీవెన నీకూ యిస్తున్నాను. వసిష్ఠా ! పరమశివుని అనుగ్రహంతో నేను జ్ఞాని నైనాను. ఇప్పుడు మీ రిద్దరూ భస్మం నుంచి పునర్భవించిన దివ్యమూర్తులు. మీకు ఇహపరాలు రెండూ కూడ నిత్యకళ్యాణం, పచ్చతోరణం అగుగాక ! మహేశ్వరా ! ఇక నాకు సెలవిండు. (నిష్క్రమిస్తాడు.)

వసి : (ఆశ్చర్యంతో) మహేశ్వరా ! మీరేనా ? మహా విపత్తునుంచి నన్ను రక్షించిన మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి ! (పాదాభివాదం చేస్తాడు.)

పరమ : (వసిష్ఠుణ్ణి లేవదీసి) కుమారా ! ఏదైనా వరం కోరుకో !

వసి : (ఆనందంతో) దేవా ! అరుంధతిని నాకు అగ్నిసాక్షిగా దయ చెయ్యండి !

పరమ : అమ్మా ! (అరుంధతి దగ్గరకు వస్తుంది)

సంధ్య : మేము మాదిగలం కదా !

వసి : శక్తి రూపిణులారా ! నన్ను క్షమించండి ! (పరమశివుడు అరుంధతి చేతిని, వసిష్ఠుడి చేతిని తన చేతిలోకి తీసుకుని సంధ్య వంక చూస్తాడు.)

సంధ్య : మంగళం భవతు !

పరమ : అరుంధతీ ! వసిష్ఠా !

**పూవులతేనె - లిక్షు రస**
**ముల్ - ఫల శీదువు, లిష్ట కోకిలా**
**రావము - లారు కాలముల**
**రాగములన్ జలకమ్ము లార్చి, మీ**
**సేవలు చేయుచుండ - విర**
**జిమ్ముదు విశ్వజనాంతరంగ రా**
**జీవము లందు ప్రేమ సుఖ**
**జీవ నవోదయ భాగధేయముల్**

(ఇద్దరి చేతులూ కలుపుతాడు. రంగం నిండా చంద్రకాంతి వికసిస్తుంది. శుక పిక శారికా కోటి కంఠాలతో వనలక్ష్మి కళ్యాణ గీతాలు పాడుతుంది. నందన పారిజాతాలు వర్షిస్తై. అమృతం పన్నీటి జల్లువలె కురుస్తుంది. ఆ సమయంలో ఆకలి నినాదాలు వినిపిస్తై. కొన వూపిరితో - కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని కాళ్ళీడ్చుకొంటూ -- కుంభోదరం, గోష్పాదం, కులగిరి, ప్రజలు ప్రవేశిస్తారు.

గోష్పా : దేవా ! చచ్చాం - చచ్చాం !

కుల : ప్పరమేశ్వరా ! ఇక క్కదల్లేం -

(అంతా కూలబడతారు)

పరమ : ఓయీ ! మీ కెక్కడా ఇంత అన్నం పెట్టే అన్నపూర్ణే కనబడలేదా ?

గోష్పా : లేదు, బాబో ! లేదు.

సంధ్య : ఈ పాపులకు అన్నపూర్ణ ఎక్కడ కనబడుతుంది?

పరమ : ఇప్పుడేమిటి గత్యంతరం ?

అరుం : దేవా ! ఏమిటిది ? ఈ ప్రజ లింత దీనావస్థలో వున్నారేమి ?

శివో : నీ చలవే !

పరమ : ఓరి డిప్పకాయా ! పెద్దవాడి వయావే ?

శివో : అది మీ చలవ !

ప్రజలు: తల్లీ ! ఆకలి ! ఆకలి !

పరమ : లోకం మహాదుర్భిక్షంలో చిక్కుకొన్నది. ఆకటితో చస్తున్న ప్రజలకు ఏ పతివ్రతా సహాయపడలేకపోయింది.

అరుం : అన్నపూర్ణాదేవి ?
(ఎవరూ మాట్లాడరు)

పరమ : అరుంధతీ ! నీవు ఈ ప్రజలను రక్షించు !

సంధ్య : మా చేతి అన్నం వీళ్ళు తినరు గదా !

ప్రజలు: (ఏక కంఠంతో) తింటాం. తల్లో ! తింటాం. తింటాం !

అరుం : ఈ పని అన్నపూర్ణాదేవి చెయ్యవలసినట్టిది.

పరమ : ఇప్పుడు ఆమెను ఎక్కడ తేగలను ? ఏ కొండలలో తపస్సు చేసుకొంటున్నదో !

వసి : (అరుంధతితో) దేవీ ! నీ వీపని చెయ్యగలవు !

అరుం : (వసిష్ఠుడి పాదరజం నొసట ధరించి) నాథా !

నేను పతిభక్తి కలదాన నేని, తల్లి
అన్నపూర్ణమ్మ నాపట్ల నున్న దేని,
పిండివంటలుగా మారు కొండరాళ్ళు
తరువులు ఫలించు నిందును దొరువు లిపుడె !

(ప్రకృతిలో ఒక ఉల్లాసం కనిపిస్తుంది మెరుపులా.)

గోష్పా : ఓహో ! బూరెలు ! గారెలు!

కుంభో: బొబ్బట్లు ! నేతి వర్షం !

ప్రజలు: అన్నం ! కూరలు !

(రాసులు రాసులుగా పడివున్న పిండి వంటల మీద ప్రజలంతా ఒక్కపెట్టున మూగుతారు. దోసిళ్ళనిండా తీసికొంటారు. నోళ్లనిండా కుక్కుకుంటారు. ఆమెను అభినందించడానికి కూడ ఇప్పుడు వారికి తీరికలేదు. అవకాశమూ లేదు.)

శివో : (ముందుకు వచ్చి ) ఆర్యులారా ! ఇక మనం ఆ చెరువు గట్టుకు చేరడం మంచిది. పదండి. (ప్రజలందర్నీ తీసుకుని నిష్క్ర మిస్తాడు.)

పరమ : (సంతోషంతో) అరుంధతీ ! నీ వీ మహత్కార్యం సాధించినందుకు నీ కొక వరం ఇస్తున్నాను. నీకు ద్యోమండలంలో నీ నాధుని చెంత ఒక శాశ్వత స్థానం లభించగలదు.

(అందరూ అంజలి ఘటిస్తారు)

లోకంలో ప్రతి నూతన దంపతులు ముందుగా నీకు నమస్కరించి నీ యాశీస్సులు పొందగలరు.

నీవు వైదిక భారతీయతకు, మహా భారత వంశానికి మాతవు కాగలవు.

సంధ్య : (ఆనందంతో) అక్కా !

పెళ్ళి పందెరలోని మల్లెపువ్వవు నీవు,
మింటి జంటలలోని మేటితారవు నీవు
పార్వతీశ్వర మిధున ప్రతిబింబ దీప్తితో
పాలించవే, తల్లి ! పతిగూడి జగము !

(అరుంధతి పరమ నిరామయయంగా చూస్తూ వుంది.)

పరమ : ఇక, మేం వెళతాం (సంధ్య చేయిపట్టుకుంటాడు)

సంధ్య : అక్కా ! సెలవు, ప్రణయవాల్లభ్య దేవతవై, ప్రణవాంశయైన వసిష్ఠుణ్ణి ఏలుకో -

వసి : సంధ్యా !

సంధ్య : బావా ! బెంగపెట్టుకోవద్దు. ఉదయ సాయం సంధ్యా వేళలలో ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తాను నేను. అంతేకాదు -

**పెదవిపై నీకు తుమ్మెదలు ఝుమ్మనువేళ,**
**వపు నామెకు ప్రఫుల్లవనమై బెదరు వేళ,**
**శశి కళాకలశితో సాగి వచ్చెదనులె !**
**శివ సత్య సుందర శ్రీ లొసగిపోదులే !**

అరుం : నన్నేమిచేసి పోతావు ?

సంధ్య : వసిష్ఠుణ్ణి ఇచ్చి పోతున్నాను - నీ ఆశ్రమంలో నా ఉద్యోగం ఇక బావగారే చేస్తారు.

అరుం : (ప్రాధేయపడుతూ) సంధ్యా ! నీవు లేకుండా నేను ఉండలేను. తరువాత ఎప్పుడో వెళ్ళగూడదా ?

సంధ్య : (నవ్వుతూ) చంటిపిల్ల వయ్యావే. తల్లీ ! నీకేనా బెంగ ? నాకు లేదా? నేను ప్రతి ఉదయం మిమ్ము లేపడానికి వస్తాను. ప్రతి సాయంత్రం మీకు జోలపాడి పోతాను - సరేనా ?

వసి : మరి మధ్యాహ్నం ?

సంధ్య : (చిలిపిగా నవ్వుతూ) మధ్యాహ్నం చెట్లనీడల వెలుగు నీడలలో మీతో ఆడుకుంటాను. ఇదంతా మీ భ్రమగాని.

ఒకరితో ఒకరు మీ రొదిగిపోయిన మీద,

ఏ సంధ్య కనిపించు ? ఏ స్వరము వినిపించు ?

మిమ్ము పెంచిన కనులు, మీరు పెంచిన వనులు.

మీ రాగయోగముల మేలుకొని యుండునా ?

(పరమ శివుడు ఇదంతా చిరునవ్వుతో తిలకిస్తున్నాడు - అంతకు ముందే అక్కడకు తిరిగివచ్చిన శివోహాన్ని అరుంధతి తల నిమిరింది. సంధ్యను కౌగలించుకొన్నది. వసిష్ఠుడు శివోహాన్ని సందిట్లోకి తీసుకున్నాడు. తర్వాత అరుంధతీ వసిష్ఠు లిద్దరూ పరమశివుడికి సాష్టాంగపడి లేచారు.)

పరమ : సుఖీభవ ! శుభం భూయాత్ !

సంధ్య : ఇక నీవు - నీ వసిష్ఠుడు -

(పరమశివుని చేయిపట్టుకొని నవ్వుతూ వెళ్ళిపోతుంది. శివోహం వెంట వెళతాడు. ప్రకృతి ప్రశాంతంగా వుంది ఏదో మధురవేదన వాతావరణంలో కెరటాలు వేస్తున్నది. అరుంధతి, వసిష్ఠుడు క్షణకాలం మౌనంగా అటుకేసి చూచి - ఇక భరించలేక - ఒకరి కౌగిట్లో ఒకరు ఐక్యమైపోతారు - ఆశ్రమం అనురాగంతో అవ్యక్త మధురంగా గానం చేస్తున్నది. ఆకాశం ఆనందభాష్ప తారకలతో విలసితమై పులకిత మయింది. వీణా మండలంనుంచి ఒక అపూర్వ మధుర కల్యాణ గానం పూలమీదికి దిగి ఆడుకొంటున్నది.)

కల్ప శ్రియర్లతా ! కళ్యాణ దేవతా !

వివిధ మానవ సమైక్య విధాన దాయినీ !

భాగవత రూపిణీ ! భారతోద్ధారిణీ !

మాతంగ కన్యకా ! మనసా స్మరింతు.

శుభం

***

# చిత్రకళాప్రదర్శన

(పది సంగీత నృత్య నాటికల సంపుటి)

బోయి భీమన్న

సుఖేలా నికేతనం

హైదరాబాదు

సుఖేలా నికేతనం,
మూడవ పుష్పం
1963

ముద్రణ:
దక్షిణ భారత ప్రెస్సు
హైదరాబాదు – 4

ప్రతులకు:
సుఖేలా నికేతనం
92/2, ఆర్. టి. విజయనగర కాలనీ
హైదరాబాద్

హక్కులు రచయితవి

వెల రూ :4/-

## మా విషయం

మా సుఖేలానికేతనం కేవలం సాహిత్యాభిరుచితో పెంచుకొంటున్న సారస్వతోద్యానంలో వికసించిన నాలుగవ కుసుమం ఈ 'చిత్రకళా ప్రదర్శన'. ఇంత వరకు వెలువడినట్టివి 'త్రిపదలు', 'మానవుని మరొక మజిలీ', 'ప్రకృతిలో మానవ ప్రకృతి'. ఇప్పటి ఈ చిత్రకళా ప్రదర్శన గురించి చెప్పే ముందు మా సంస్థ గురించి నాలుగు మాటలు చెప్పడం అవసరమని భావిస్తున్నాం.

మా సుఖేలా నికేతనం స్థాపించబడి అయిదారేళ్ళయినప్పటికీ అది వ్యవస్థీకరించబడత 1960లో. శ్రీ బోయి భీమన్నగారి గేయ కావ్యం ''పైరుపాట'' సంగీత నృత్య నాటికగా ప్రదర్శించబడడంతో ఈ సంస్థ వెలుగులోకి వచ్చింది.

1960 సెప్టెంబరు మాసంలో, స్వర్గీయ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షత క్రింద జరిగిందా ప్రదర్శనం. అదే సమయంలో ఏ తత్కావ్యకర్త అయిన శ్రీ బోయి భీమన్నగారికి సన్మానం జరిపి, ఒక సన్మాన సంచికను కూడ వెలువరించి సమర్పించిందాయనకు. డా. దివాకర్ల వెంకటావధాని గారి ప్రధాన సాహిత్యోపన్యాసంతో, విధాన సభాధ్యక్షులు శ్రీ కాళేశ్వర రావుగారి శుభాకాంక్షలతో, తదనంతర ప్రదర్శనా సమంచితాలైన రమణీయ నృత్య సంగీతాలతో ఆనాటి కార్యక్రమం సహృదయ హృదయ రంజకమ్మై, సమస్త సదస్య సమాహ్లాదకమ్మై ఒప్పారిందన్నది జనవాక్యం.

ఆనాటి నుంచి, ఆనాటి విజయంనుంచి లభించిన ప్రోత్సాహ ప్రేరణల బలంతో, మా సంస్థ నృత్య సంగీత కార్యక్రమాలలో ఇతోధికమైన శ్రద్ధాసక్తులను ప్రదర్శించసాగింది. 'పైరుపాట'ను అప్పుడప్పుడు అక్కడక్కడా ప్రదర్శించుకుంటూ, రవీంద్రుని శత జయంతి ఉత్సవాల నాటికి 'చాండాలిక'ను నృత్య నాటికగా రూపొందించింది. ఆ తరువాత గురజాడ శతజయంతి సందర్భంలో 'కన్యక' సంగీత నృత్య రూపకంగానే నిర్మించబడింది. ఎగ్జిబిషను థియేటరులో 'చాండాలిక' ప్రదర్శన, రవీంద్ర భారతిలో 'కన్యక' ప్రదర్శన అపారంగా ప్రేక్షకుల మన్ననలను పొందినాయి.

సంగీత నృత్య నాటక ప్రదర్శనల ద్వారా కేవలం ఒకే రంగానికి కట్టుబడి వుండడం కంటె, వాస్తవ సాహిత్య రంగానికి కూడ కొంత సేవచేయాలన్న నిర్ణయానికి వచ్చి, సాహిత్య గ్రంథ ప్రచురణకు కూడ ఈ సంస్థ పూనుకొన్నది. సంగీత, సాహిత్య,

నృత్య, చిత్రకళా రంగాలన్నిటికీ తన కార్యక్రమాన్ని విస్తరింపచేయాలన్నది యీ సంస్థ ఆకాంక్ష. ఏతత్కళా స్రష్టలను ప్రోత్సహించాలని, సృజనాత్మక సాహిత్యాన్ని వెలయింప చేయాలని, సార్వజనిక శ్రేయానికి మూలభూతమైన సాహితీ సంస్కృతుల ద్వారా భరత మాతను సేవించాలని మా చిరంతనాభిలాష. ఈ మా లక్ష్యసిద్ధి ప్రజల ఆదరాభిమానాలపై ఆధారపడి వున్నది.

ఈ ప్రస్తుత నాటికా సంపుటిలో పది నాటికలున్నాయి. అవన్నీ నృత్య సంగీత రూపకాలుగా నిర్మించడానికి అనువైనట్టివే. రంగ స్థలాన్ని, ప్రేక్షక జనాన్ని దృష్టిలో వుంచుకుని వ్రాయబడినట్టివే. ఇవన్నీ శ్రీ బోయి భీమన్నగారి స్వతంత్ర రచనలే. ఇందులో రెండు నాటికల యితి వృత్తాలు మాత్రం పూర్వ చరిత్రల నుంచి చేకొనబడినట్టివి. అందులో 'దేవయాని' కథ మహా భారతము నుంచి తీసుకొనబడగా, 'చాండాలిక' కథ రవీంద్రుని రచన నుంచి స్వీకరించబడింది. 'అంధకారంపై విజయం' కూడ నరకాసుర వధను అనుసరించిందే అయినా, అది ప్రస్తుత భారతోత్తర సీమారేఖపై దురాక్రమణకు, ఏతత్ప్రతిఘటనలో భారత యువజనతా దిగ్విజయానికి కేవలం ప్రతీక.

ఈ నాటికల సంపుటి తమ సోదరీ ప్రాయ అయిన స్వర్గీయ శ్రీమతి ఆదిలక్ష్మి ఎం.ఏ., ఎం.లిట్ గారికి అంకితమివ్వబడింది. రష్యాలోని లెనినుగ్రాడు యూని వర్సిటీలో ప్రాచ్య భాషా (తెలుగు, తమిళము) ప్రొఫెసరుగా వుంటూ, ఆంధ్ర భారతి ప్రతిభా ప్రాభవాలను విదేశాల నిండా వెదజల్లుతూ, అక్కడే బాలెంత జబ్బుతో స్వర్గస్థురాలైన ఆంధ్ర విదుషీమణి శ్రీమతి ఆదిలక్ష్మి. ఈ సందర్భంలో కృతికర్త ప్రదర్శించిన ఉదాత్త సోదర్యభావం ఆదర్శప్రాయమైనది, అభినందనీయమైనది.

ముఖచిత్రం వ్రాసి పెట్టిన ఆర్టిస్టు శ్రీ పి. ఆర్. రాజు గారికి, అందంగా ముద్రణ పని జరిపిన దక్షిణ భారత ప్రెస్ వారికి కృతజ్ఞతలు.

మధుర కవితా సౌరభ భరితమైన మా యీ ప్రఫుల్ల కుసుమం రసజ్ఞులను అలరింపచేయగలదని మా విశ్వాసం.

శోభకృత్ ఉగాది
హైదరాబాదు

నమస్సులతో
సుఖేలా నికేతనం

## అంకితం

# సోదరి ఆదిలక్ష్మికి

స్టెల్లామేరీస్ కాలేజీలో బి.ఏ. క్లాసుకు ''మధుబాల'' కావ్యం పాఠం చెబుతూ, నన్ను మీ అన్నయ్యగా దత్తత చేసుకొన్న చెల్లీ!

''మాల వాళ్లంటే ఏమిటో అనుకునేదాన్ని! మీలా వుంటారని వూహించ లేదన్నయ్యా! నిజానికి మా బ్రాహ్మణ స్త్రీలు అంత కన్సర్వేటివుగా వుండటానికి కారణం వాస్తవ లోకజ్ఞానం లేకపోవడమే'' అంటూ, విశ్వమానవ ప్రగతి శీలకమైన పవిత్ర వాక్యాన్ని వేదవాక్యం వలె పలికిన తల్లీ!

''అన్నయ్యా'' అన్న మూడక్షరాలలో మూడు లోకాల సౌభ్రాత్రాన్ని నింపి, ''వదినా'' అన్న అక్షరత్రయంలో త్రిలోకాల సౌహార్దాన్ని ప్రపంచిస్తూ – వంట గదిలో చేరి, వదినెతో గంటల తరబడి కబుర్లు చెప్పే స్నేహరూపిణీ! ఆదిలక్ష్మి!

మాతృదేశ కీర్తి ప్రతిష్ఠలు విశ్వంనిండా వెన్నెల కాయడం కోసం విదేశాలకు వెళ్ళిన ఆంధ్ర భారతి గారాబు బిడ్డవు – ఇక తిరిగి రావా, ఇక మాకు లేవా, అమ్మా!

చంద్ర లోకాలకూ, సూర్యలోకాలకూ తిరుగు ప్రయాణం టికెట్లను అచ్చు కొడుతున్న భౌతిక మానవుడు, బాలెంత అయిన మా తల్లిని మాకు తిరిగి ఇవ్వలేని నిస్సహాయుడేనా, విదుషీమణీ!

''మనం ముగ్గురం'' అనుకొంటూ ఆనాడు నీవూ, వదినా, నేనూ తీయించు కొన్న ఈ ఫోటో ఇక శాశ్వతస్మృతి చిహ్నమేనా, సోదరీ!

గురువు విద్యారత్న, తల్లి రుక్మిణమ్మ, భర్త ఆంజనేయులు, మైథిలి, భారతి, జోగా, వదిన, నేను – అందరం గోడలమీద ఫ్రేములలో ఫోటోలమై నీ చుట్టూ వున్నా – మేం వున్నామనీ, నీవు లేవనీ అనిపిస్తున్నదేమిటి, ''పంచామృత'' వాగ్దేవీ?

నీ – నా వాగ్దేవీ సౌదర్య తత్త్వానికి ఈ సంగీత నృత్య నాటికా గుచ్ఛం పూజా కదంబంగా స్వీకరించి, మన్నించమ్మా జనప్రియా!

రసాలిని

భాగ్యనగరం

–బోయి భీమన్న

* * *

## రంగరచన

చిత్రకళా ప్రదర్శనం ఒక భవనంలో ఏర్పాటు చేయబడింది. మన రంగం ఆ భవనం ముందుగల హాలు, హాలుమధ్య ప్రధానద్వారం భవనంలోకి కలదు. హాలు కుడికి, ఎడమకు కూడ ద్వారాలు కలవు. హాలులో కొన్న చిత్రాలు ప్రదర్శించబడి వున్నాయి. ప్రదర్శన ద్వారానికి ఒక ప్రక్కన నర్తకి చిత్రం, ఒక ప్రక్క మృదంగ వాద్యగాని చిత్రం నిలువెత్తు చిత్రాలలో బిగించబడి వున్నాయి. చిత్రాల పైని సన్నని తెరలు కలవు. వాటిగుండా లోని చిత్రాలు ప్రేక్షకులకు కనిపిస్తూ వుంటాయి. ఆ చిత్రాలను అవసరమైనప్పుడు చట్రాలనుంచి తొలగించడానికి, మంజీర పాత్రధారిణి, మార్దంగం పాత్రధారి ఆ చట్రాలలో చిత్రాలవలెనే నిలవడానికి ఏర్పాటుండాలి. అసలు చట్రాలలో చిత్రాలు అక్కర లేకుండానే, మంజీర, మార్దంగం పాత్రధారులు చిత్రాలవలె చట్రాలలో నిలబడవచ్చు. చట్రం దాటి వాళ్ళు వచ్చినప్పుడు చైతన్యం పొందిన చిత్రాలే ముందుకు వచ్చి నట్లుంటుంది.

చిత్రదత్తు చాలా నాజూకైన యువకుడు. కళ చిత్రంలోని నర్తకి కంటే అందమైంది. తరచు జనం హాల్లోని చిత్రాలను చూస్తూ మెచ్చుకొంటూ భవనంలోకి పోతూ వుంటారు. భవనం ముందుహాలే ఈ నాటికకు రంగస్థలం, చివర వ్రాసిన నేపథ్యగీతమే ప్రారంభం లోను, మధ్య మధ్యా వినిపిస్తూ వుంటుంది.

## ప్రదర్శన

(నేపథ్యంలో "మానవుని కానంద" అనే గీతం వినిపిస్తూ, తెర తొలగుతుంది. చిత్రకళా ప్రదర్శనం భవనం ముందుహాలు పూర్వ పద్ధతిలో కనిపిస్తుంది. ప్రదర్శిత కళా ఖండాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ "చిత్రదత్తు" ప్రవేశిస్తాడు)

చిత్రదత్తు

ఓయి, స్నేహశీలి !
ఓయి, భావశాలి !
ఎడదగల మనుష్యుడా !
ఎదుగుతున్న తమ్ముడా !

రంగు రంగు తెరలలోకి
తొంగిచూడు మొకసారి !
ఇది కళా ప్రదర్శనమో !
ఇది జీవిత దర్శనమో !

ఇవిగో ఇవి తొలిగీతలు,
అవిగో అవి మలిరేఖలు,
తొలిగీతల దున్నలివి !
మలిరేఖల మధుపము లవి !

కుంచె వెనుక గుండెలోకి
పొంచిచూడు మొకసారి !
అసలు రంగు కదె పెట్టె !
అవనికి కుంకుమ బరిణె !

తెలుపు నలుపు మానవు లివి !
త్రివర్ణాల దేవత లవి !
పూల గుండెలలో మునిగి
తేలివచ్చిన రుచులివి !

శోభానిలయం లోనికి
చూపు మలుపు మొకసారి !
ప్రతి చిత్రం నిన్నొకింత
ప్రతి ఫలించి చూపునేమొ !

(చిత్రదత్తు తన చేతిలోని సూచికాదండంతో చిత్రాలకేసి చూపుతూ వుంటే, ఒక్కొక్కరు చూస్తూ ప్రధాన ద్వారం లోనికి నిష్క్రమిస్తూ ఉంటారు. ఎడమప్రక్క ద్వారం నుంచి కళ ప్రవేశిస్తుంది. హాలంతా ఒకసారి పరికించి మంజీర చిత్రాన్ని కొంచెం సేపు చూచి, మార్దంగం చిత్రం దగ్గర ఆగిపోతుంది. తర్వాత చిత్రదత్తును చూస్తుంది. చిత్రదత్తు చాలా సేపటినుంచీ తన కేసే చూస్తున్నాడు. ఇద్దరి చూపులు కలుస్తాయి. ఒక్క సారిగా సిగ్గుపడతాడు. ఆమె ముందు, అతడు వెనుక ప్రదర్శన ద్వారం గుండా నిష్క్రమిస్తారు. నేపథ్యంలో మద్దెల ధామ్మని మోగుతుంది. మంజీర చిత్రం కదులుతుంది. చిత్రంలోని మంజీర మానవరూపంలో ముందుకు వస్తుంది. మార్దంగం కూడ మానవ రూపంలో ముందుకు వస్తాడు.)

మంజీర :

ఎంత మోసం ! ఎంత మోసం !
ఎవతె వెంటో పోదువే ?
స్థాణువుగ నన్నిందె నిలిపీ
చంచలను ప్రేమింతువే ?

ధరణిలో నిన్ను మించిన సౌం
దర్యవతి లేదంటివే !
చిలిపి సీతాకోక చిలుకకు
చిత్తమున తావిస్తివే !

గుండె నెత్తురులోన ముంచి
కుంచె నడిపితి నంటివే !
కుంచె కందని కుర్రదేవతెకొ
కొంగు ముడివై పోతివే !
చిత్రలోకమునకే, సహృదయ

చిత్తములకే రాణి ననవే ?
చిత్రకళలకె దత్తుడా ?
చెదరెనే నీ చిత్కళా ?

(ఎవరో పిల్చినట్టుగా కుడిప్రక్కనుంచి చిత్రదత్తు, ఎడమప్రక్క నుంచి కళా ప్రవేశిస్తారు. అంతలోనే మంజీర మార్దంగం మానవ రూపం విడిచి చిత్రాలైపోతారు. చిత్రదత్తు, కళ ఒకరి నొకరు ప్రశ్నార్థకంగా చూచి కొంటారు.

**చిత్రదత్తు :**

ఎవరో నను పిలిచారు !
యువతీమణిరో, నీవా ?

కళ :

నన్ను కూడ పిలిచారు !
నవ్వులాట కాదు కదా ?

**చిత్రదత్తు, కళ**

**ఎవరో, మరి, పిలిచారు !**
**ఇద్దర్నీ పిలిచారు !**
**పేరుపెట్టి పలిచారు !**
**పీయూషం చిలికారు !**

(ఇద్దరూ ఇటూ, అటూ చూచి, చెరొకవైపుకు నిష్క్రమిస్తారు. నేపథ్యంలో గజ్జెలు ఘల్లున మ్రోగుతాయి. మార్దంగం చిత్రం కదులుతుంది. మార్దంగం మానవరూపంలో ముందుకు వస్తాడు. మద్దెలను టక టక వాయిస్తాడు. నిష్క్రమిస్తున్న కళకేసి చూస్తాడు. విరాళి కనపరుస్తాడు. మంజీర కూడ మానవ రూపంలో బైటికి వచ్చి అభినయం చేస్తుంది.)

మార్దంగం :

ఏమందం ! ఏమందం !
ఇలకే మధురానందం !
దివ్యలోక మందారం
దిగివచ్చిందో హో హో !

సకల కళా సౌందర్యం
చట్రంలో బిగించబడ,
సర్వజీవ సౌందర్యం
జవరాలై వచ్చెనొహో !

నిర్జీవపు గీతలలో
నిశ్చలమౌ రంగులలో
ఎంత మహిత చిత్రమైన
ఈడగునే ఒక కాంతకు ?

సహజకళను పట్టి తెచ్చి
చట్రము లోపల బిగించి,
జీవకళను వెంటాడే
చిత్రదత్తుడే ధన్యుడు !

(మళ్ళీ ఒక వైపునుంచి కళ, మరోవైపునుంచి చిత్రదత్తు ఆశ్చర్యంతో ప్రవేశిస్తారు. మంజీరా, మార్దంగం యథారీతి చిత్రాలైపోతారు.)

చిత్రదత్తు :

ఎవ్వరో నను విమర్శించుచున్నా రిందు !
నీవు కాదనుకొందు, నీరేజనయన !
కళను సృష్టింతునేగాని, చత్రములోన
బంధించి విడవైచు పండితుడగాను.

కళ :

నను కూడ నిందించినా రెవ్వరో యిచట !
నీవు కాదనుకొందు, నిర్మల కళాశీలి !
కమనీయమౌ చిత్రకళ కంటె, కేవలము
నరకాంత నేను యెవ్వరి దృష్టి మళ్లింతు ?

చిత్రదత్తు :

కేవలము నరకాంతవేనా ?
దేవ వన సుమ గుచ్ఛ మీవు !
నా కళా సర్వస్వమును నీ
నఖ పరాగము పోలునా ?

కళ :

వినయశీలుడ, వంతెకానీ,
విశ్వమోహిని నీదు శిల్పము !
ఎందరేన్ నా వంటి కన్యలు
ఈడె నీ ఒక రేఖకు ?

(నేపథ్యంలో సంగీతం, ప్రేక్షక సహృదయులు వస్తూ పోతూనే వుంటారు. సంగీతం వింటూ, కళా చిత్రదత్తులు కలిసి ప్రధాన ద్వారం ద్వారా లోనికి పోతారు. ధామ్మని మద్దెలా, గళ్మని గజ్జెలు మ్రోయగా మంజీర, మార్దంగం మానవ రూపాలతో రంగంలోకి దూకుతారు. నాట్యం చేస్తారు.)

మంజీర :

చూచినావుగా - మానవ మూర్తులు
సుందరములు, మధురములు !
పోల్చినావుగా - మానవ బుద్ధులు
మోహితములు, కృతకములు !

సౌందర్యమ్ముల ఉత్తమము కళా
సౌందర్యమె అని అంటారు !
ఎవతో, ఎవడో కనిపించగనే
కువ కువ మంటూ పోతారు !

మార్దంగం :

ఎందుకు వాళ్లను విమర్శించడం ?
విందు చేసుకో కన్నులకు !
ఎంద రెందరో ! ఎన్ని రూపులో !
అందాలకె ఆదర్శాలు !

జడములైన రేఖలకు రంగులకు
చైతన్యంబిడి, మానవులు
తమ అందాలను ప్రదర్శింత్రు - చి
త్రములమై మనము పరికింప !

(ఇద్దరూ మైమరచి నృత్యం చేస్తూవుండగా చేరో వైపునుంచీ అక్కడికి వచ్చిన కళా, చిత్రదత్తులు ఆశ్చర్యచకితులై, చిత్రాలవలె నిలిచి పోతారు. మంజీర చిత్రంలో కళ, మార్దంగం చిత్రంలో చిత్రదత్తు చిత్రాలైపోతారు. మంజీరా, మార్దంగం ఆ చిత్రాలను ఆశ్చర్యంతో చూచి ఆనందంతో నృత్యం చేస్తారు - నేపథ్యంలోని సంగీతానికి అనుగుణంగా.)

నేపథ్యంలో :

మానవుని కానంద
మార్గా లనేకం !
కళ అందులో అమృత కలశం
లలిత
కళ అందులో అమృత కలశం

శిల్పులే చిత్రాలు,
చిత్రాలె శిల్పులూ !
ఒకరిలో ఒకరుండి
ఉన్నతుల కెగయగా
కళ అందులో జీవ కలశం
లలిత
కళ అందులో జీవ కలశం

రమ్య చిత్ర ప్రద
ర్శనము మానవుల కిది !
సరస మానవ ప్రద
ర్శనము చిత్రముల కిది !
ఒండొరుల జూచుకొని
ఉల్లములు పెంచుకొని
ఆనంద పారమ్య
మందుకొని, తరియింప
కళ అందులో ఆత్మ కలశం
లలిత
కళ అందులో ఆత్మ కలశం !

# వసంత స్వయంవరం

(శిశిర ఋతువు చివరి ఘడియ గడిచిపోయింది. వసంతఋతువు తొలి ఘడియ ప్రారంభం కాబోతున్నది. ఒడలెల్ల కనులుగా ఎదురు చూస్తున్నది ప్రకృతి కాంత వసంతుని కోసం. ఆ చూపుల కొసలు ఏదో వార్తను మోసుకు వస్తున్నాయి. అది బృందగానంగా వినిపిస్తున్నది.)

బృందగానం :

అది గదిగో కెందామర పువు బొడిపె !
అది గదిగో మావి చిగురు జెండా !
అదిగో మధుపూర పూర్ణ కుంభం !
అదిగో నవ వసంతోత్సవ రథం !
బైలుదేరె ! బైలుదేరె !
బైలు కొసల నుండి !
మలయానిల పత్రముపై
మధుపాక్షర లేఖ ఇదే !
వసంతుని విలాసాలను
దెసలు చదివి వినిపించె !
వచ్చెనిదే ! వచ్చెనిదే !
వసంతోత్సవ రథం !
కోకిల స్వాగతము చెప్పె తొలుత.
కుంకుమ మిడె మంకెనపువు నెలత.
ఉగాది పల్లకి లోనికి
ఉరికె కొత్త పెండ్లికొడుకు
తరలివచ్చె ! తరలివచ్చె !
తరుణోదయ శోభ !

(వసంతుడు ప్రవేశించాడు. ప్రకృతి పదహారువేల వనలక్ష్ములై అతణ్ణి వరించి వచ్చింది. ఒక్కొక్కరినే అతడు సమాదరిస్తూ వస్తున్నాడు. అంతట మధుప్రియ (కోకిల) అతణ్ణి సమీపించింది.)

మధుప్రియ :

నీ వియోగమహార్త వార్ణవ పంచకమ్మున
నావ దొరకని దాననోయీ !
పంచమమ్మును దాచుకొని, బ్రతుకోర్చుకొని, నీ
పంచ చేరిన దాననోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !
అణగి, లోకపు కాకులతో దశమాసములు నే
నణువువలె జీవిస్తి నోయీ !
శిశిరపుం గొసలందు నీ చిరునవ్వులే నా
చీకుచింతలు రాల్చెనోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !
కంఠమున శివునిన్ ధరించిన విషమునై, నీ
కరుణకై మనుచుంటినోయీ !
నీవ నన్ను ధరించి, ప్రకృతికి పురుషుడై, న
వ్యావనులు నిర్మింపు మోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !

వసంతుడు :

నీవటే కోకిలా !
నీవటే కాకిలా ?
నా వియోగము లోన
నల్ల నైనావటే !
నవ్వరే, యెవరైన
నవకవులు వింటే ?
నీవ కాటుక కాయ
వే వనరమల కెల్ల,
నీవ బొగ్గుల కుంప
టే విరహ హృదయాల,
నాకు ప్రియురాలవా ?
నవ్వరే యెవరైన ?
విషపు బాణాగ్రమ్ము,
వింటివా ? నీ గొంతు !
కలిపిగొట్టు నొకప్డు
కలియ గొట్టు నొకప్డు
నీ వటే కోకిలా ?
భావాగ్ని పొగలా ?

(కోకిల సిగ్గుపడి దారి విడుస్తుంది. వసంతుడు పరిక్రమిస్తాడు. రసాలిని (మామిడి) ప్రవేశిస్తుంది.)

రసాలిని :

నేను బాల రసాల లతనోయ్ !
నేను మాధవ ! నీకు జత నోయ్ !
ఉగాదికి రుచుల గాదెను, నే
జగానికి మాధురిమ నోయ్ !

తావి తరగల షట్పదమ్ముల
నీవు వ్రాసిన ప్రేమ లేఖలు
నన్ను నన్నే త్రావి త్రేన్చును
నున్న వివిగో నోయ్ !

తీయ తేనియ పాత్రముల ఆ
తిథ్యమును సమకూర్చి పెట్టితి,
పీపులా ? నీ కేలు సోకిన
చేపవా రసపయోనిధులు ?

వసంతుడు :

ఈ వగరు పిందెలా
నీ వలపు రసధునులు ?
ఈ తేనెటీగలా
నీ తలపు దూతికలు ?
నవ్వరే, యెవరైన
నవ కవులు వింటే ?
మనసులో కోకిలపు
మసిగూడు కట్టుకొని

శాంతి లోకమును జవ
జవ లాడ కవ్వించు
కెంజివురు బావుటా
రంజించునా నన్ను?
ఎలమావి నా కొక్క
వలపు నెల వనుకొంటి,
నింగికే గురి పెట్టు
నిప్పు బాణపు మొనవె!
చూతులే తరువాత,
చూతమా! నిలువుమా!

(రసాలిని దారి తొలగుతుంది. నింబలత (వేప) ప్రవేశిస్తుంది.)

నింబలత :

ముద్దులొల్కు భూ కాంతకు ముత్యాల్
ముగ్గులు పెట్టిన వాకిలి నేను,
నింగి అద్దమున నా ప్రతిబింబమె
తొంగి చూడదా పాలపుంతవలె ?
రావోయీ, మధుదేవా! కై
కోవోయీ, నా సేవ!
పికములు, శుకములు, కాకము లనుచున్
భేదము లేదోయ్ నా పంక్తి!
అందరి కాయు, స్సారోగ్యము, భా
గ్యము సమముగ కూర్చే రాణిని నే!
రావోయీ, మధుదేవా! కై
కోవోయీ, నా సేవ!.

వసంతుడు :

నీ పూల నవ్వు వె
న్నెల కాయునే కాని,
వెన్నెలల కడలిలో
విషము దాగిన దమ్మి !
చేదు విషమో లమ్మి !
చేరరాకో లమ్మి !
వేల చూపుల వలపు
పూలప్రభ వనుకొంటి !
నీ గుండె చేదుతో
నింపు కొన్నావటే
ఆయురారోగ్యలె
ఆనంద మగునటే ?

(నింబలత నిష్క్రమిస్తుంది. ఇక్షు కాంత (చెరకు) ప్రవేశిస్తుంది.)

ఇక్షుకాంత :

చెరకు వింటి చెలి చెప్పగ
వింటిని, నిను కంటిని
మల్లిక నీ మాట చెప్ప
ఊరితి, నిను కోరితి !

పువ్వుటమ్ము రివ్వుమనగ
నేను కూడ దానితోడ
దూకి నిన్ను తాకలేక
విలపించితి విరహ బాధ !

విశ్వానికె రుచి, పంచమ
వేదానికె పర్వము నే !
కనికరించి చేకొనుమా,
కాంతా ! ఓయి వసంతా !

వసంతుడు :

ఓసి, గడసాని ! నీ
బోసి నవ్వుల కేమి,
వాసి వన్నెల కేమి,
వాలు చూపుల కేమి.
నాప్రక్క నిను చూచి
నవ్వరే ఎవరైన ?
దీను రాలవు, పరా
ధీను రాలవు నీవు
ఆసనమవే గాని
అమ్ము వెట్లగుదువే ?
ఎత్తరౌ మగనాలు
ఏల గలదే మగని ?
నీ నిండ ఎంతెంతొ
తేనెయున్నను గాని
నమిలి మింగిన కొలది
నార సాగును పిప్పి
వేణు ప్రియవె కాని
వినపడదు నీ పల్కు

(ఇక్షుకాంత ప్రక్కకు తొలుగుతుంది. ఒక వెండి గిన్నెను చేత పట్టు కొని నాట్యం చేసుకొంటూ ఒక గోపిక ప్రవేశిస్తుంది. తన ప్రాణాలు ఆమె చేత నున్నట్టుగా వసంతుడు ఆమె ననుసరిస్తాడు.)

గోపిక :

ఉగాది దేవత,
యుగాది దేవత,
జగానికే అ
గ్రగామి దేవత,
దిగాలు పడనేమి ? వసంతుని
మొగాన ఎరుపేమి ?
ప్రణయ విహంగము
పరభృత మనుచు,
ప్రియ మాకందము
పేదది యనుచు,
సిద్ధ నింబలత
చేదే యనుచు,
కోమలేక్షువే
కురూపి యనుచు,
దిగాలు పడనేమి ? వసంతుని
మొగాన ఎరుపేమి ?
ఆకులు రాలని
మ్రాకు లున్నచో,
శిశిరము సోక
చేత మున్నచో

చేదే యెరుగని
స్వాదు వున్నచో,
కుందు లేని ఆ
నంద మున్నచో
జగాన దిగులేమి ? వసంతుని
జన్మకు కతమేమి ?
రసాధి దేవత
వసంత భూమిక
ఒసంగినవె ఈ
పసందు లన్నీ,
అసాధువన నేమి? వసంతుని
ప్రసాదమే భూమి !

(ఆమెతో కలిసి నాట్యం చేస్తూ వసంతుడు ఆమె చేతిలోని పాత్రను తన చేతిలోకి తీసుకొంటాడు. రుచి చూస్తాడు. తేజోవంతుడవుతాడు. ఆనందమూర్తి అవుతాడు.)

వసంతుడు :

అనిర్వచనీయ మిది, ఓహో !
అమృతమునకే అమృతమో !
అపూర్వము, అద్వితీయ, మహో !
ఆత్మకే ఇది ఆత్మమో !
ఓ జగన్మధు మోహినీ ! నా
యాగమము నీ కోసమేనే !
కంఠమున కల కంఠములతో
కందొవల యెల వెన్నెలలతో

అధరమున శీధురసములతో
అఖిల సౌందర్యరుచి నీవే !
ఓ జగన్మధు మోహినీ ! నా
యాగమము నీ కోసమేనే !

(ఆమె అతని కేలు గ్రహిస్తుంది. పాత్రను తిరిగి మెల్లిగా అందు కొంటుంది.)

గోపిక :

ఇదేనోయ్, అమృత కలశం !
ఇదేనోయ్, జీవన రహస్యం !
తీపి, చేదూ, వగరు, పులుపూ
రూప మందిన విశేషం !

విడివిడిగా ఒక్కొక్కరుచి కే
ర్పడదు సంపూర్ణత్వము.
అన్ని రుచుల సమైక్యమియ్యది.
ఆంధ్ర కిది ప్రత్యేకము !

బ్రతుకు భాండము నింద నవరస
పాకములు నింపిన దిదే నోయ్ !
కష్టసుఖముల నిగ్గు, తెలుగు ఉ
గాది పచ్చడి ఇదే నోయ్ !

(ఆమె ముందు, అతడు వెనుక నాట్యం చేసుకొంటూ నిష్క్రమిస్తారు. ప్రకృతి అంతా సుందర తరంగా వికసిస్తుంది.)

వసంతుడు :

బలే దానవే ! బలే జాణవే !
తెలుంగు వాసిని నిల్పితివే !
ప్రపంచరుచులకె అధినాథుడ నను
పచ్చడి గిన్నెను పట్టితివే !
మహీమాధురీ, మధురఝురీ ! మ
న్మనోహరీ ! ఆంధ్రీ !
ఉగాది పచ్చడి నిగారములలో
జగజ్జీవితమె గుబాళించెనే !
ఏ రుచి కందని వసంతునే నీ
పారాణకి పహరా పెట్టితివే !
జనుస్సుందరీ ! జగా జహ్వారీ !
జనతా మాధురి ! ఆంధ్రీ !

# గులాబి ప్రసవించింది

(రంగం ఉద్యానవనం, గులాబితీగ ప్రసవ వేదన పడుతున్నది. దాని చుట్టూ చేరింది - తుమ్మెద, సీతాకోకచిలుక, కోకిల, మందమారుతం, ఆకుపురుగు, గుడ్లగూబ, మేకపిల్ల, గోపిక వగైరా ఇరుగు పొరుగంతా. ప్రక్కనే తామర కొలను, కోటాకు వేసిన అరటి, తులసికోట, తోటకూర చెట్టు, క్రోటను మొక్క, కరివేచెట్టు, ఇత్యాదికూడ. మొత్తం ఉద్యానవనం అంతా గంభీర ముద్రదాల్చి వుంది. మధ్య మధ్య ఇరుగుపొరుగుల సన్నని గుసగుసల సవ్వడులు, నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. గులాబితీగ ప్రసవ వేదన పడుతున్నది.)

సీతాకోక చిలుక :

జువ్వలా ఎదిగింది
జువ్విలా అలిమింది
బ్రతుకంత వేవుళ్ళై
బక్కపలచని తల్లి,
    మసలకోయీ, మందమారుతం ! కాసేపు
    విసరవే, కమలా కరం !
తుమ్మెదయ్యకు కలలు
బొమ్మకడుతున్నాయి.
విశ్వాల యవధులకు
వెడలి వస్తున్నాయి !
    అతిలోక రుచులు నించుకొన ! నందన వ
    నానంద సుధలు పంచుకొన !
పాడకే కోకిలా !
ఆడకే నెమలీ !

క్షణమైన ఊరకుం
డని వేడ్కలేమిటే ?
చూపులకు రాణియౌ చిన్నది, పురిటింట
చావుబ్రతుకుల మధ్యనున్నది !

ఆకు పురుగా ! నీకు
ఆకలే లోక మటె ?
మేకపిల్లా ! కొండ
మిట్టలకు పోలేవె ?
కష్టసుఖములు పంచుకోని – మనుగడలు
సృష్టికే బహుముఖ గ్లాని.

గుడ్లగూబ :

కోకడాబుల వట్టి
పోకిరీ యనుకొంటి,
గట్టిదే యీ పిల్ల !
గుట్టు తెలిసిన పిల్ల !
ద్విజులమే మేమంత,
త్రిజము గద అది కొంత !
కాని, ఏమిది ? ఇంత
గడబిడా యెందుకో ?
కనుట పెంచుట సహజ
కార్యాలె కావొకో ?
పిచ్చిలోకము, గులా
బీ చుట్టు చేరినది !

తులసి :

నిండుచూలా లీగులాబీ తీగచెల్లి
పండువౌ కన్నులకు వెన్నెల పాలవెల్లి !
అంద మంతర్వత్నిదే గద సృష్టిలోన !
అబ్జమిత్రుని గనదె ప్రత్యూషము సుఖాన !
అబ్బ ! ఎంతటి వేదనో ! అటు సుళ్ళు తిరుగు !
బొబ్బలిడుటకు కూడ ఓపిక లేక సురుగు !
ఇరుగుపొరుగంతయును కన్నుల నించు నీరు !
ఎవ్వరే మొనరించగల, రిది సృష్టి తీరు !

కోకిల :

ముగ్ధ సుందరలత భరించెడి
మూగి వేదనకు శ్రుతి కలిపి,
ఆత్మ వేదన ననుభవించెడి
అఖిల వనమును గొంతు నిలిపి.
నాద రూపము నొసగి ప్రకటన చేతు నేను.
నన్ను ఎవరేమన్న, నేనిది మానలేను !
పరుల దుఃఖము లెక్కచేయని
పాడుకుల మనుకొంద్రు గాని,
పాడుతనమున కోటిదుఃఖాల్
గూడుకట్టుక యుండు టెరుగరు
గుండెనిండే పొంగిపొర్లే మందులన్నీ
గొంతు వెల్వడుచుండు పాటలరీతి, చిన్నీ !
ప్రసవవేదన లతిక దైనా,
పశువుదైనా, పదతిదైనా,

విశ్వవేదన యది; సమస్తా
వేగములకును కేంద్ర మయ్యది;
దానికేదో దారి బైటికి లేక యున్న,
ధరణియే బ్రద్దలగు, నూతనసృష్టి సున్న.

నెమలి :

మధురవేదనా భరమున
మానలేదు పికము పాట.
అతి దుఃఖావేగములో
ఆపలేను నేను ఆట;
నర్తనమని అనుకొందురు పామరులు,
కర్తవ్యము లేక వణుకు పాదములు !
నిరంతరము చూలాలు,
నిత్యము బాలెంతరాలు,
ప్రకృతిదేవి మందిర మొక
పరమానంద కందము;
కడలిమీది కెరటాలీ కానుపులు
కదలించకపోవు నన్ను లయగతులు

ఆకుపురుగు :

రోజూ చచ్చేవాడికి
ఏడ్చేవా డెవడు ?
రోజూ పుట్టేవాడికి
సంతోషం ఎందుకు?
నిత్య తద్దినానికి ఫలశ్రుతి
ధర్మపిండం.

మానుకోవాలట తిండి !
మహాచెప్తారు లెండి !
చెట్టుమీద పిట్ట,
చెట్టుకింద రెట్ట !
ఎందుకయ్యా వేదాంతం మెట్ట ?
నాక్కావలసిం దింత రొట్ట !

మేకపిల్ల :

ఔను, గురో ! ఔను
"రొట్ట" ఎంతటి అమృత శబ్దం !
అవతరించావయ్యా, శబ్దబ్రమ్మా !
అందించవయ్యా, మరోకొమ్మ !

ఏడ్వాలేదు, నవ్వాలేదు;
ఉన్నదంతా, వేదాంతం, దంతం;
నీ లయకు నా తాళం, మేళం;
కోరికెయ్ ఒక నాళం !

సీతాకోక చిలుక :

అడ్డం వస్తున్న వెవో
అపశ్రుతుల వంటివి !
సుఖప్రసవ సహాయ్యక
సుప్రసార వీచికలకు
అడ్డం వస్తున్న వెవో
అపశ్రుతుల వంటివి :

చూడకమ్మ, ఇటు కేసి,
చూలాలవు, అరటి !
బెదరగలదు మానసము,
చెదరగలదు విశ్వాసము.
చూడకమ్మ ఇటు కేసి,
చూలాలవు, అరటి !

తులసి :

మృదుల దళ చేలాంచ లమ్మున
వదనమును గప్పుకొని, కన్నులు
తుడుచుకొను చుండినది, పాపం
జడుచుకొనుచుండినది, అనటి !

చుట్టు నల్గురు పిల్లలతో ఈ
చుట్టుప్రక్కలకెల్ల గృహిణివి,
సుఫల హస్తములతో ఇహపర
సుగతి కీవె తెరువువి !

కలగవలదోయమ్మ, రంభా !
కన్నులెర్రని దొప్పలైనవి !
మృత్యువన్నది భ్రాంతి, బ్రతుకే
సత్య; మది నీ ప్రక్కలేదే ?

గుడ్లగూబ :

అరటిబోదె కన్నీటిని
అపశ్రుతిగ తలచు చుంద్రి !

స్వార్థపరుల భావపరం
పరల నేల గుర్తించరొ ?

కన్నీరెటు వంటిదైన
కరగించును కష్టాలను,
స్వార్థమాత్మగతమె యైన
ప్రగతికి ప్రతిబంధకమౌ !

మనకెందుకు లెమ్మని ప్రతి
మంచియు చెడ్డను సహించు !
చివరకు మంచిని అడంచి
చెడ్డయె జగమాక్రమించు !

తోటకూరచెట్టు :

చూడలేకున్నాను సుకుమారి కష్టం !
తొందరగ ప్రసవించ దెందుకోగాని !
రాత్రిగడవకముందే రావాలి పురుడు '
ముద్దుముచ్చట చూచి పోవాలి నేను !

క్రోటను మొక్క :

ఒసే తోటకూర చెట్ట !
ఎందుకె నీకంత వెట్ట ?
ముండ్లతీగ యెక్కడైన
ముచ్చటగా ప్రసవిస్తదె ?

సీమరాణికంటే, ఈ
సీతకోకచిలకకంటె
రంగుల రాణిని నేను,
రండా ! ఇటు చూడ వేమె ?

తులసి :

వెలుగున్న చోట నీ
దలులేక యెట్లుండు ?
నీడలను భేదించు
నేత్రమ్ము కలుగవలె;
అప్రమత్తత నుంటివి కదే ?
కరివేప !
అంతర్గృహము భద్రముకదే ?
అభ్యుదయగతి నేవొ
అద్భుతలపులు తాకె,
వారింప వలయు మన
వాసనా బలముతో
నలుదెసలు కట్టుకొంటివి కద ?
క్షణములో
వలరాణి పుట్టుచున్నది పొద !

సీతాకోకచిలుక :

తెల్లవార్లు నొప్పులు పడి,
జిల్లార్చుకపోయి గుండె,
కొనవూపిరితో మూల్గుచు
ననబోణియ మూర్ఛపోయె !